అభివృద్ధిలో కేసీఆర్ ఆదర్శం

ఎక్స్‌లో మేధావుల మధ్య చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి అంశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అనుసరించిన విధానాలు, పరిపాలన విధానాలు ఆదర్శనీయమని, అవే తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపాయని సోషల్‌మీడియాలో ఆర్థికవేత్తలు, మేధావుల మధ్య ఆసక్తికర చర్చ కొనసాగుతున్నది. ఎక్స్ వేదికగా ముత్తుకృష్ణన్ అనే ఆర్థికవేత్త *'2014 నుంచి 2023 వరకు తెలంగాణ సాధించిన అభివృద్ధిని భారతదేశంలోని మరే రాష్ట్రం సాధించలేదు. ఇది నా స్వంత పరిశోధనల నుంచి తెలుసుకున్నది. కేసీఆర్ గత దశాబ్ద కాలంగా తెలంగాణకు ఆర్థికంగా, సామాజికంగా అద్భుతమైన అభివృద్ధిని చేశారని నా పరిశోధనతో నేను నిర్ధారించాను. అయినప్పటికీ తెలంగాణ ప్రజలు ఎందుకు అలా తిరస్కరించారో నాకు తెలియడం లేదు'* అని అభిప్రాయం వ్యక్తం చేశారు. దానిపై మరో ఆర్థిక, సామాజికవేత్త అర్వింద్ వారియర్ స్పందిస్తూ *'నేను 2021లో భారతదేశంలోని వివిధ రాష్ట్రాల అభివృద్ధి నమూనాను పరిశోధించడం ప్రారంభించాను. 2014 నుంచి 2023 వరకు తెలంగాణ ప్రభుత్వం సాధించిన భారీ విజయాలను చూసి ఆశ్చర్యపోయా'* అని వెల్లడించారు. వారిద్దరే కాదు ఆ పోస్టుపై అనేక మంది మేధావులు తెలంగాణ అభివృద్ధిపై పోస్టులు పెడుతూ తమ పరిశోధనలు, అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు.

బీసీల ఆమరణదీక్షపై సర్కారు చిన్నచూపు

- పది రోజులవుతున్నా పలకరించని ప్రభుత్వం
- పత్తాలేని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అన్నిపార్టీలు, సంఘాలు నుంచి మద్దతు





ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని పరామర్శిస్తున్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, జూలూరు గౌరీశంకర్, పాశం యాదగిరి

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్ : కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ మేరకు రాష్ట్రంలో సమగ్ర కులగణనను తక్షణమే చేపట్టాలని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ నేతలు చేపట్టిన ఆమరణదీక్షపై కాంగ్రెస్ సర్కారు కనికరించని పరిస్థితి కనిపిస్తున్నది. దీక్షాపరుల ఆరోగ్యం క్షీణిస్తున్నా లెక్కచేయని దుస్థితి నెలకొన్నది.

కొనసాగుతున్న దీక్షలు..

బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు భక్తుల సిద్దేశ్వర్, రజక సంఘం నాయకుడు చాపర్తి కుమార్‌గాడ్గే గత నెల 23 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. హామీలపై స్పష్టతనివ్వని సర్కారు దీక్షను భగ్నం చేసేందుకు పూనుకున్నది. దీక్ష చేపట్టిన నేతలను అరెస్టు చేసింది. కుమార్‌గాడ్గేను హన్మకొండ జిల్లా మడికొండకు తరలించింది. అనంతరం ఎంజీఎంలో చేర్చగా, కుమార్‌గాడ్గే వైద్యశాలలోనే దీక్ష కొనసాగిస్తున్నారు. సిద్ధేశ్వర్, సంజయ్‌ను అరెస్టు చేసి గాంధీ దవాఖానలో చేర్పించింది. వారు అక్కడే దీక్షను కొనసాగిస్తున్నారు. సంజయ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించింది.

వెల్లువెత్తిన మద్దతు..

దీక్షాపరులకు బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ సంఘీభావం తెలిపారు. బీఆర్‌నేత సీనియర్ నేత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి బీసీ నేతలకు మద్దతు ప్రకటించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్, బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేశ్, సీపీఎం, పలు సంఘాలు మద్దతు తెలిపాయి. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని గాంధీదవాఖానకు వెళ్లి దీక్షాపరులను పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీ హనుమంతరావు సైతం దీక్షకు మద్దతు ప్రకటించారు. గాంధీ దవాఖానలో దీక్ష చేస్తున్న సిద్దేశ్వర్‌ను సోమవారం బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కేవీ గౌడ్, బీసీ ఆజాది సంఘ్ అధ్యక్షుడు డీ మహేశ్‌గౌడ్, అంబేద్కర్ అజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి పరామర్శించి సంఘీభావం తెలిపారు. కాచిగూడలో దీక్ష చేస్తున్న సంజయ్‌ను జర్నలుస్టులు పాశం యాదగిరి, జూలూరు గౌరీశంకర్ పరామర్శించారు.

పత్తాలేని బీసీ సంక్షేమ శాఖ మంత్రి

బీసీ నేతల దీక్షకు అన్నివర్గాల నుంచి మద్దతు లభిస్తున్నా కాంగ్రెస్ సర్కారు మాత్రం ఏమాత్రం లెక్కచేయని దుస్థితి నెలకొన్నది. ఇప్పటివరకు ప్రభుత్వ పెద్దలు స్పందించలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కనీసం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం ఇప్పటివరకు దీక్షపై స్పందించకపోవడంతో బీసీ వర్గాలు మండిపడుతున్నాయి.

ఇక సర్కారుతో యుద్ధమే

సమగ్ర కులగణన, రిజర్వేషన్ల పెంపు అంశంపై ప్రభుత్వం తక్షణం స్పందించాలి. బీసీ నేతల దీక్షపై ఇప్పటివరకు స్పందించకపోవడం కాంగ్రెస్ బీసీ వ్యతిరేక వైఖరికి నిదర్శనం. అన్నివర్గాల ప్రజలను మోసం చేసినట్టు బీసీలను మోసం చేస్తే కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు. ఇక కాంగ్రెస్ సర్కారుపై బీసీల యుద్ధం మొదలైంది. హామీలు అమలయ్యే వరకు విశ్రమించేది లేదు. **-రాజారాంయాదవ్, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు**

ఉన్నత పదవుల్లో ఉన్నవారు సంయమనం పాటించాలి

- సీఎం రేవంత్‌పై సుప్రీంకోర్టు అసహనం
- ఓటుకు నోటు కేసు రెండువారాలకు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఉన్నత పదవుల్లో ఉన్నవారు కొంత సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. గత నెల 29న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరైన సందర్భంగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి.. తన వ్యాఖ్యలను వక్రీకరించారని పేర్కొంటూ ఎక్స్ వేదికగా సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణ చెప్పారు. న్యాయస్థానాల పట్ల తనకెంతో గౌరవమని, దేశ న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసమున్నదని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంగా ఈ అంశం సోమవారం మరోసారి ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కోర్టులు, న్యాయవ్యవస్థ పట్ల సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా వ్యవహరిస్తున్నారని.. ఇందుకు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని తెలిపారు. దీనిపై ఒక ఐఏ (ఇంటర్‌లాక్యుటరీ అప్లికేషన్) దాఖలు చేశామని పేర్కొన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తుల ఫొటోలు పెట్టి ఇష్టారీతిలో సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆ వివరాలు అన్ని ఐఏలో పొందుపరిచినట్టు వివరించారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ స్పందిస్తూ.. ఉన్నత పదవుల్లో ఉన్నవారి నుంచి కొంత సంయమని ఆశిస్తామని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు కోర్టులను, లాయర్లను ఇందులోకి లాగుతున్నారు అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం హోంమంత్రిత్వశాఖ కూడాసీఎం రేవంత్ వద్దనే ఉన్నదని, ఓటుకు నోటు కేసును ముందుకు తీసుకెళ్లాల్సిన అధికారులు ప్రతిరోజు ఆయనకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పిటిషనర్ తరపు న్యాయవాదులు వివరించారు. ఒకవేళ మరోచోటుకు మార్చినా అధికారులు ఆయనకు చెప్పిన తర్వాతే కోర్టుకు వెళతారు కదా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అప్పుడు కోర్టు అధికార పరిధి (జ్యూరిస్‌డిక్షన్) మారుతుందని న్యాయవాదులు వివరించారు. విచారించే కోర్టు మారినా.. పరిధి మారదు, విషయం మరదని న్యాయమూర్తులు తెలిపారు. ఇప్పటికే 25 మంది సాక్షుల నుంచి అన్ని వివరాలు నమోదు చేసినట్టు తెలంగాణ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. పిటిషనర్లు దాఖలు చేసిన ఐఏకు తమ సమాధానాలు ఇవ్వాలని ప్రతివాదులను ఆశించిన ధర్మాసనం ఓటుకు నోటు కేసు బదిలీ పిటిషన్‌పై విచారణను మరో రెండు వారాల పాటు వాయిదా వేసింది.



హుస్నాబాద్‌లో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం, నాయకులు

వైఎస్ సేవలు చిరస్మరణీయం: పొన్నం

హుస్నాబాద్, సెప్టెంబర్ 2: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన కొనసాగిస్తూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నామని చెప్పారు. లింగమూర్తి, వల్లపు రాజు, సరోజన, చిత్తారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల బకాయిలు చెల్లించాలి

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మాజీ సర్పంచ్‌లకు బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. వారంలో ఇవ్వకుంటే ఇందిరా పార్క్ వద్ద నిరసన చేపడుతామని ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ యాదయ్య, కార్యదర్శి రాజేందర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు కావస్తునాన మజీ సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా తయారైందని ఆందోళన వ్యక్తంచేశారు. రూ.1300 కోట్ల బకాయిలు పెండింగ్ ఉన్నాయని, కేంద్రం నుంచి వచ్చిన రూ.600 కోట్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే అమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

48గంటల్లో రూట్‌మ్యాప్ ప్రకటించాలి

- లేకుంటే లక్షల మందితో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్
- హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద బీసీ నాయకుల ధర్నా



హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 2: కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం 48 గంటల్లో రూట్ మ్యాప్ ప్రకటించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తక్షణమే కులగణనకు చర్యలు చేపట్టాలని, లేకుంటే రాస్తా, రైల్‌రోకోలు, మంత్రుల నివాసాల ముట్టడితోపాటు హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని, రాష్ట్ర బంద్‌కు కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలరాజు గౌడ్, వేముల వెంకటేశ్, మణిమంజరి, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నగేశ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



రంగసముద్రానికి జలకళ

'నమస్తే తెలంగాణ'కు గిరికొత్తపల్లి రైతుల కృతజ్ఞతలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/మాడ్గుల : రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపల్లిలోని చారిత్రక రంగసముద్రం చెరువుకు మోక్షం లభించింది. రియల్టర్ల చెర వీడటంతో జలకళ సంతరించుకుంటున్నది. 400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు భూగర్భజలాల పెంపునకు నెలవైన ఈ చెరువు రియల్ వలలో చిక్కుకుని బీడువారిపోయింది. ఈ ఏడాది జనవరిలో గ్రామ రైతులు 'నమస్తే తెలంగాణ'ను ఆశ్రయించి చెరువును రక్షించాలని కోరాగా.. 'రియల్ వలలో రంగ సముద్రం విలవిల' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు మే నెలలో కత్వ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. రూ.5 లక్షలతో మరమ్మతులు చేయడంతోపాటు చెరువు వరకు కాల్వను పునరుద్ధరించారు. చెరువుకట్ట పటిష్టానికి రూ.16 లక్షలతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పెద్దవాగు ద్వారా చెరువులోకి నీరు చేరుతుంది. దీంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఏండ్ల తర్వాత చెరువులో జలకళ చూస్తున్నామని 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి భూములివ్వం

- సంగారెడ్డి జిల్లాలో అధికారులను అడ్డుకున్న బాధితులు
- పచ్చని పొలాల్లో 'ఫార్మా' పాగాను సహించబోమని స్పష్టం



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్-మల్గి గ్రామాల శివారులో అధికారుల వాహనాలను అడ్డుకుంటున్న ఫార్మాసిటీ భూబాధితులు, ప్రజలు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 2: జీవనాధారమైన పచ్చని పంటపొలాలను తీసుకుని.. తీవ్రమైన నష్టం చేకూర్చే ఫార్మాసిటీ ఏర్పాటుకు తమ ప్రాణాలు పోయినా సరే భూములను ఇచ్చేది లేదని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాల ప్రజలు తేల్చిచెప్పారు. ఆయా గ్రామాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు సేకరించే భూములను పరిశీలించేందుకు సోమవారం వచ్చిన జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జహీరాబాద్ ఆర్డీవో రాజును డప్పూర్-మల్గి గ్రామాల శివారులో స్థానికులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, భూబాధితులు మాట్లాడుతూ.. తమ గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గుట్టుచప్పుడు కాకుండా అధికారులు సర్వే చేసి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సాగు భూములు తీసుకొని తమను రోడ్డు పాలు చేయొద్దని, ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు నాలుగు గంటల వరకు అధికారులను కదలనివ్వకుండా వాహనాలకు అడ్డుగా నిలిచారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి అధికారులెవరూ వెళ్లేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. అనంతరం జిల్లా రెవెన్యూ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జహీరాబాద్ ఆర్డీవో రాజుకు భూబాధితులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇకపై అధికారులెవరైనా తమ గ్రామాలకు వచ్చేముందు సమాచారం ఇవ్వాలని, గుట్టుచప్పుడు కాకుండా వస్తే సహించేదిలేదని స్పష్టంచేశారు.

పచ్చని పొలాలపై 'ఫార్మా' పాగా తగదు

ఇప్పటికే న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో నిమ్జ్ ఏర్పాటుకు ఈ ప్రాంత రైతుల నుంచి 12,635 ఎకరాల భూమి సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మొదటి విడతలో 3,600 ఎకరాలు సేకరించారు. ఇప్పుడు ఫార్మాసిటీ కోసం న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో 2,003 ఎకరాల భూసేకరణ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగానూ న్యాల్‌కల్ మండలం డప్పూర్ గ్రామ శివారులో 1465.25 ఎకరాలు, మల్గిలో 282.13 ఎకరాలు, వడ్డిలో 256 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సర్వే చేసిన సంబంధిత జిల్లా అధికారులు.. ప్రభుత్వానికి నివేదికలను పంపించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో భూసేకరణ చేపట్టేందుకు సంబంధిత జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై గెజిట్ నోటిఫికేషన్ జీవో పత్రాలను అతికించారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో ఆయా గ్రామాల శివారులోని గుట్టలపై నవనాథ్ సిద్ధలింగేశ్వరస్వామి, మల్లన్నస్వామి, ఫీర్‌గైబ్ సాహెబ్ దర్గాలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సైతం ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. భూములు కోల్పోవడంతో తాము రోడ్డున పడటంతోపాటు అన్ని విధాలుగా నష్టం జరుగుతుందని వాపోతున్నారు.

హద్నూర్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఫార్మాసిటీ (విలేజ్) కోసం చేపట్టే భూసేకరణకు అధికారులు ముందుస్తు సమాచారం లేకుండా గ్రామాల్లోకి రావొద్దంటూ వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాలకు చెందిన నాయకులు, భూబాధితులు సోమవారం రాత్రి హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సై రామానాయుడుకు ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీ కోసం బలవంత భూసేకరణ తగదని, ముందస్తు సమాచారం లేకుండా గ్రామాలకు వచ్చే సమయంలో జరిగే పరిణామాలకు తమను బాధ్యులు చేయొద్దని చెప్పారు. ముందుగా సమాచారం ఇస్తే అధికారులకు సహకరిస్తామని తెలిపారు.

సామాజిక, ఆహార అలవాట్లతో

పోషకాహార లోపానికి చెక్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): సామాజిక, ఆహార అలవాట్లతోనే పోషకాహార లోపాన్ని నివారించవచ్చని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా 'అందరికీ పోషకాహారం' అనే అంశంపై హైదరాబాద్‌లోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో 5 రోజులపాటు కేంద్ర సమాచార సంస్థ నిర్వహిస్తున్న అవగాహన సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ.. భిన్న సంస్కృతులు, భాషలతో కూడిన మన దేశంలో ప్రజలందరికీ పోషకాహార సమాచారాన్ని చేరవేయడం సవాలేనని పేర్కొన్నారు. సృజనాత్మక వ్యూహాలతో ఈ సవాలును అధిగమించడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని చెప్పారు. సదస్సులో తాజా ఆహార మార్గదర్శకాలు, స్థూల-సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం, ఆహారంలో పోషకాలను గుర్తించే విధానాలపై ఫొటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్, తెలంగాణ మహిళా వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ ఎమ్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్థుల అరెస్ట్

- చెక్‌బుక్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు స్వాధీనం
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, సెప్టెంబర్ 2 : ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ప్రజలను నమ్మించి దేశవ్యాప్తంగా రూ.కోట్లు కొల్లగొట్టిన ఇద్దరు సైబర్ నేరస్థులను వరంగల్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీపీ అంబర్‌కిశోర్ ఝా కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం కాంచిపురానికి చెందిన జసిల్, ప్రీతి కలిసి గోల్డ్‌మ్యాన్ సచ్, యాం-బ్రాండింగ్స్ నకిలీ వెబ్‌సైట్ ద్వారా తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుందని ప్రజలను నమ్మించి రూ.కోట్లు వసూలు చేశారు. తెలంగాణలోనే 15 నేరాల్లో 3 కోట్లు కొల్లగొట్టారు. హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి రూ.28 లక్షలు ఇన్వెస్ట్ చేసి మోసపోయినట్టు గుర్తించి వెంటనే వరంగల్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చెన్నైలోని సలయూరులో జసిల్, ప్రీతి జంటను అదుపులోకి తీసుకున్నారు. ఈ జంట మొత్తం 150 కేసుల్లో కోట్ల వసూళ్లకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలినట్టు సీపీ తెలిపారు. నిందితులు వినియోగించిన బ్యాంకు ఖాతాలు సీజ్ చేసి, చెక్ బుక్కులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, పెన్ డ్రైవ్ స్వాధీనం చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సూరం చెరువుపై సర్వే

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/మహేశ్వరం: సూరం చెరువు కబ్జాపై 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో నీటిపారుదలశాఖ ఇంజినీర్లు సోమవారం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఎస్ఈ హైదర్‌ఖాన్ సహా డీఈఈ, ఏఈఈ, మహేశ్వరం తహసీల్దార్ సైదులు సూరం చెరువును పరిశీలించారు. త్వరలో సర్వే చేయించి నివేదిక రూపొందిస్తామని ఇంజినీర్లు తెలిపారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఎగువన ఉన్న కొత్తకుంటను మాత్రం నీటిపారుదలశాఖ ఇంజినీర్లు విస్మరించడం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది. పత్రికలో వచ్చినందుకు మాత్రమే సూరం చెరువును పరిశీలించారా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ బాధ్యతగా కబ్జాకు గురైన నీటి వనరులను పరిశీలించి, చర్యలు తీసుకోవాల్సింది పోయి కంటి తుడుపు చర్యగా సూరం చెరువును పరిశీలించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఆర్‌ఆర్ కోసమే ప్రపంచ బ్యాంకుకు!

మొదటిపేజీ తరువాయి...

ఎదురవుతుండగా, భూసేకరణ పూర్తయ్యాక టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ప్రాజెక్టు మంజూరై మూడున్నరేండ్లు పూర్తవుతున్నా ఇంతవరకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. కేంద్రం నుంచి, జాతీయ రహదారుల శాఖ సరైన సహకారం లభించటం లేదు. నష్ట పరిహారం పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనలను కేంద్రం పట్టించుకోలేదు. దీంతో ఉత్తర భాగం టెండర్ల ప్రక్రియలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో తాము అధికారంలో ఉండగానే ఆర్‌ఆర్‌ఆర్‌ను పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉన్న సీఎం.. దక్షిణ భాగం పనులను ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో పీపీపీ విధానంలో చేపట్టాలని నిర్ణయించారు. భూసేకరణ సహా రోడ్డు నిర్మాణానికి రూ.15,000 కోట్లకు కాస్త అటుఇటుగా ఖర్చవుతుందని, నాలుగు టోల్ ప్లాజాలను ఏర్పాటుచేసి 20-25 ఏండ్ల పాటు టోల్ వసూళ్ల ద్వారా పెట్టిన పెట్టుబడి రాబట్టుకోవచ్చని అంచనా వేశారు.

ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ

సీఎం సూచనల ప్రకారం రోడ్డు నిర్మాణంలో సాధ్యమైనంత తక్కువగా ప్రైవేటు భూములు ప్రభావితం అయ్యేలా, ప్రభుత్వ భూములు, అటవీ భూములు ఎక్కువగా ఉపయోగించుకునేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఇప్పటికే ఉన్న రోడ్లను విస్తరిస్తూ సాధ్యమైనంత తక్కువగా ప్రైవేటు భూములు ప్రభావితమయ్యేలా అలైన్‌మెంట్ ఖరారుచేశారు. ముచ్చర్ల ప్రాంతంలో భారీ జంక్షన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని దృష్టిలో ఉంచుకొని రేడియల్ రోడ్లు వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు భూములు ప్రభావితం అవుతున్న ప్రాంతాల్లో ల్యాండ్‌పూలింగ్ పద్ధతిలో భూములు సేకరించాలని, భూములు కోల్పోతున్న రైతులకు అక్కడే అభివృద్ధి చేసిన భూమిని ప్లాట్ల రూపంలో కేటాయించి.. వాటి అభివృద్ధికి అవసరమైన డెవలప్‌మెంట్ రైట్స్ కూడా ఇవ్వాలని తెలిపారు. దీంతో రైతులు కోల్పోతున్న భూములకు సరైన న్యాయం లభిస్తుందని, రైతులు కూడా ఇందుకు సంతోషంగా ముందుకు వస్తారని ప్రభుత్వం భావిస్తున్నది. ఖరారైన అలైన్‌మెంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారుల బృందాలను పంపారు. హెచ్ఎండీఏ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, నీటి పారుదల, ఆర్అండ్‌బీ, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు భూముల సేకరణలో క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నదా? రైతులు ఏం కోరుకుంటున్నారు? వారికి నష్టం జరుగకుండా ఏం చేయాలి? తదితర అంశాలను అధ్యయనం చేసి రైతులు కోరుతున్న అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. రైతుల నుంచి ఎటువంటి వ్యతిరేకత వ్యక్తంకాకుండా వారు కోరుకున్నట్టు డెవలప్‌మెంట్ రైట్స్ కల్పించాలని నిర్ణయించారు.

తమ ఆధ్వర్యంలోనే పూర్తిచేయాలని..

ఫ్యూచర్ సిటీ పరిధిలోనే ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం కూడా ఉన్నది. తన హయాంలో ఏదో ఒక్కటైనా భారీ ప్రాజెక్టు పూర్తిచేయాలని సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు. ఇందులో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం పనులను వెంటనే ప్రారంభించి సాధ్యమైనంత తొందరగా పూర్తిచేయాలని నిర్ణయించారు. ఉత్తర భాగం మంజూరు చేసిన మూడున్నరేండ్లకు కూడా ఇంకా టెండర్ల ప్రక్రియ మొదలు కాలేదు. ఇదే పద్ధతిలో ముందుకుపోతే దక్షిణ భాగానికి ఎన్నేండ్లు పడుతుందో తెలియదు. పైగా, కేంద్రం ఆధ్వర్యంలో చేపడితే రాష్ట్ర ప్రభుత్వ పాత్ర పెద్దగా ఉండదు. శంకుస్థాపన కార్యక్రమానికి తమ పార్టీ పెద్దలను ఆహ్వానించే అవకాశం ఉండదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మించటం ఉత్తమమనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి-ఆమన్‌గల్-షాద్‌నగర్-చౌటుప్పల్ ప్రాంతాలగుండా సాగనున్నది.

నమస్తే తెలంగాణ

• వరద పర్యటనలోనూ రాజకీయ రంగు







1. ఖమ్మం పర్యటనలో భాగంగా ఎఫ్‌సీఐ రోడ్డులో ఓపెన్‌టాప్ వాహనంలో ఊరేగింపుగా వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. కాంగ్రెస్ పార్టీ ప్రచార రథానికి తెల్ల వస్త్రం కట్టడం చర్చనీయాంశంగా మారింది.
2. ఖమ్మంలోని మున్నేరు వాగును కాంగ్రెస్ కండువా వేసుకొని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
3. సూర్యాపేట జిల్లా మోతెలో పూలతో అలంకరించిన స్టేజీపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి

కన్నీరు.. మున్నేరు!

- ఖమ్మంలో మున్నేరు ముంపుప్రాంత ప్రజల విలవిల
- అర్ధరాత్రి వరద నీటితో కట్టుబట్టలతో పరుగులు
- తాగడానికి నీళ్లు..తినడానికి ఆహారం లేక పస్తులు
- బురదతో నిండిన ఇండ్లను చూసి కన్నీళ్లు
- ప్రభుత్వం నుంచి అందని సహాయ సహకారాలు



ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు ప్రాంతంలో ఆరుబయట చీరతో ఊయల కట్టి చంటిపాపను ఊపుతున్న తల్లి జ్యోతి

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/తిరుమలాయపాలెం : ఖమ్మం జిల్లాలో 20 ఏండ్లలో ఎన్నడూ పడనంతగా భారీ వర్షం పడింది. ఖమ్మం జిల్లా చరిత్రలోనే రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. కూసుమంచి మండలంలో అత్యధికంగా 31.5 సెం.మీ., మధిర 28.38 సెం.మీ, తిరుమలాయపాలెం 26.3 సెం.మీ, చింతకాని 26.22 సెం.మీ, వైరా 24.76 సెం.మీ, ఎర్రుపాలెం 24.76 సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికితోడు ఎగువ నుంచి వచ్చే వరదతో మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చి జలప్రళయం సృష్టించింది. పాలకుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో మున్నేరు నది పరీవాహక ప్రాంతాలైన బొక్కలగడ్డ, వెంకటేశ్వర నగర్, మాణిక్యనగర్, గణేశ్‌నగర్, మోతీనగర్, మంచికంటినగర్, దానవాయిగూడెం కాలనీ, ధంసలాపురం కాలనీలోని బడుగు జీవులు బజారున పడ్డారు. శనివారం రాత్రి ఒక్కసారిగా వచ్చిన భారీ వరదతో ఖమ్మం నగరంలో ప్రజలు కట్టుబట్టలతో ఇల్లు వదిలారు. బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి తలదాచుకున్నారు. ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో కొందరే ఉన్నారు. 24 గంటలు గడిచినా పాలకులు, జిల్లా యంత్రాంగం వారికి తినడానికి తిండి, తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా అందించలేదు. అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు ముంపు బాధితులను ఆదుకున్నాయి.

లక్షల్లో ఆస్తి నష్టం..

మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో బురదతో నిండిన ఇంటిని, నీటిలో మునిగిన వస్తువులు, వాహనాలను చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రతి ఇంటికి కనీసం రూ.2లక్షల ఆస్తినష్టం జరిగింది. పస్తులతోనే ఇంటిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే నిరుడు కూడా మున్నేరు 32 అడుగుల మేర ప్రవహించింది. అయితే అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం వల్లనే భారీ ఆస్తి నష్టం జరిగింది. దీంతో తమ ప్రాంతాలకు వస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఆకేరు ఆగ్రహం.. అపార నష్టం

ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలంలో ప్రవహించే ఆకేరు వాగు ఉధృతికి అన్నదాతలు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. హైదర్‌సాయిపేట-ధర్మారం బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయింది. అజ్మీరాతండా, తిప్పారెడ్డిగూడెం, తిరుమలాయపాలెం సమీపంలోని ఆకేరు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. 1,770 ఎకరాల్లో వరి, 1,470 ఎకరాల్లో పత్తి, 505 ఎకరాల్లో మిరప పంటలకు నష్టం జరిగినట్టు మండల వ్యవసాయాధికారి సీతారామరెడ్డి తెలిపారు. ఆకేరు ప్రవాహంతో రాకాశి తండా నీటమునిగింది. గ్రామంలో రెండు ఇళ్లు కొట్టుకుపోగా, మరో 10 ఇళ్లు దెబ్బతిన్నాయి. గ్రామంలో పర్యటించిన అధికారులు ఐకేపీ ద్వారా భోజనాలు అందించి చేతులు దులుపుకున్నారు. వైద్యసిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేశారు.మంత్రులెవ్వరూ రాకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ మా దేవుడు

పోయిన ఏడాది వరదలు వచ్చినప్పుడు సీఎం కేసీఆర్ సీఎంగా ఉన్నారు. ఆయనే మా దేవుడు. ఆయన వెంటనే పువ్వాడ అజయ్‌కుమార్‌ను పంపి మాకు అండగా ఉంచారు. ఎలాంటి ప్రాణ నష్టం కాదు కదా.. కనీసం ఆస్తి నష్టం జరగలేదు. నిరుడు వరదలు వస్తాయని ముందే చెప్పడంతో మా సరుకులు, వస్తువులను ట్రాక్టర్లలో తీసుకెళ్లి నయాబజార్ కళాశాలలో ఉంచాం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. వరదలు వస్తాయని ఏ ఒక్కరూ చెప్పలేదు. మాకు జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారు?

- నాళం విజయలక్ష్మి, ఖమ్మం

మమ్ముల్ని కాపాడేది ఎవరు?

ఖమ్మం ఎమ్మెల్యేగా అజయ్‌కుమార్ ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు. నిరుడు వరదలు వస్తే మా తోటే ఉండి మాతోటే తిన్నాడు. నాయకుడు అంటే అలా ఉండాలి. ఇప్పుడు మమ్ముల్ని పట్టించుకునేవాడే లేడు. రాత్రిపూట వరద వస్తుందని చెప్పినట్లయితే మా ఆస్తులను పోగొట్టుకునే వాళ్లం కాదు. అధికారులు, నాయకులు నష్టం జరిగాక వచ్చి ఫొటోలుకు ఫోజులు ఇవ్వడం వల్ల ఏ ఉపయోగం ఉండదు. ఇప్పుడు మమ్ముల్ని కాపాడేది ఎవరు.

- జ్యోతి, చంటి పాప తల్లి, ఖమ్మం



ఖమ్మం కాల్వొడ్డులో ఇంట్లో తడిసిన పుస్తకాలను తీసి ఆరుబయట చదువుకుంటున్న చిన్నారులు



ఖమ్మం కాల్వొడ్డులో ఓ ఇంట్లోని సామగ్రి బయట వేసి శుభ్రం చేసుకుంటున్న కుటుంబ సభ్యులు



ఖమ్మంలో వరదలో కొట్టుకుపోయిన బైక్



ఖమ్మం కాల్వొడ్డులోని కాలనీలో వరదతో తడిసి ముద్దయిన సామగ్రిని ఇంటి ముందు పెట్టిన కుటుంబ సభ్యులు

'సీతారామ' కాలువకు గండి

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/పుల్కల్: రైతులకు నీరందించే సీతారామ కాలువకు గండి పడింది. సీతారామ కాలువను ఇటీవలె సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ములకలపల్లి మండలం కమలాపురం పంప్‌హౌస్ వద్ద కాలువకు భారీగా నీరు చేరడంతో ముందుగానే అధికారులు గండికొట్టే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. వరద ఉధృతికి కాలువ కోతకు గురికావడంతో ఒక్కసారిగా పక్కనే ఉన్న పంట పొలాలకు కాలువలో నీరు ప్రవహించాయి. సుమారు 50 ఎకరాల పంట నష్టం జరిగింది. అలాగే సంగారెడ్డి జిల్లాలో సింగూరు ప్రాజెక్టు కాలువ తెగిపోయింది. ఏకధాటిగా వర్షాలకు ఇసోజిపేట శివారులోని సింగూరు కెనాల్ కాలువలోకి వరద భారీగా వచ్చి తెగింది. గడిచిన మూడేండ్లలో ఈ కాలువ ఐదుసార్లు తెగింది.

కృష్ణమ్మ ఉగ్రరూపం.. ఉప్పొంగిన గోదావరి

హైదరాబాద్, సెప్టెంబర్2 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం ప్రాజెక్టుకు 4.86 లక్షలు, నాగార్జునసాగర్‌కు 5.46 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ప్రకాశం బరాజ్ వద్ద రికార్డు స్థాయిలో వరద ప్రవాహం నమోదయింది. 2009లో రికార్డు స్థాయి ప్రవాహం 10లక్షల క్యూసెక్కులుండగా తాజాగా ఆదివారం రాత్రి 10.10 లక్షల క్యూసెక్కులు నమోదయింది. ప్రకాశం బరాజ్ 70 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో శ్రీరాంసాగర్ 10 గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ఎల్లంపల్లికి 2.92 లక్షల ప్రవాహం కొనసాగుతున్నది. మున్నేరు, ఆకే రు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 275చెరువులు, కాలువలకు గండ్లుపడగా, రూ.700కోట్ల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఇరిగేషన్‌శాఖ అధికారులు నిర్ధారించారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 62చెరువులు, ములుగు జిల్లాలో 42, ఖమ్మం జిల్లాలో 38, సూర్యాపేట జిల్లాలో 32 చెరువులు, కాలువలు గండిపడినట్లు తెలిపారు. 275 గండ్లలో దాదాపు 150 మేరకు చోట్ల తక్షణ మరమ్మతులు చేట్టినట్లు వివరించారు.



ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న యువతను అదుపు చేస్తున్న పోలీసులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మల్లెలమడుగు వద్ద కొట్టుకుపోయిన ప్రధాన రహదారి



మహబూబాబాద్‌లో రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు

యుద్ధప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

- వంద మంది కార్మికులు, ఐదు యంత్రాలతో మరమ్మతులు
- 10 చోట్ల కొట్టుకుపోయిన రోడ్లు.. మరో 10 చోట్ల రహదారికోత
- మరమ్మతుకు రూ. 2 కోట్లు అవసరమన్న అధికారులు
- మహబూబాబాద్ జిల్లాలో 28,217 ఎకరాల్లో మునిగిన పంటలు



మహబూబాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/కేసముద్రం : భారీ వర్షాల కారణంగా మహబూబాబాద్ జిల్లాలో దెబ్బతిన్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వరద ప్రవాహం అధికంగా రావడంతో జిల్లాలోని కేసముద్రం - ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలో మీటర్ రాయి వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతిన్నది. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం డీఆర్‌ఎం అరుణ్‌కుమార్ జైన్ పర్యవేక్షణలో రైల్వే అధికారులు సుమారు వంద మంది కార్మికులు, ఐదు యంత్రాలతో మర్మమతు పనులు చేపట్టారు. ఐదు ప్రాంతాలలో డ్యామేజీని గుర్తించి 4 ప్రాంతాల్లో పనులు పూర్తి చేసినట్టు డీఆర్‌ఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరణ పనులు పూర్తికావాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 10 చోట్ల రోడ్లు కొట్టుకుపోగా, మరో 10 చోట్ల రోడ్డు కోతకు గురైనట్టు ఆర్‌అండ్‌బీ అధికారులు గుర్తించారు. వీటి మరమ్మతుకు రూ. 2 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. వర్షాల కారణంగా జిల్లాలో 16,810 ఎకరాల్లో వరి, 5,764 ఎకరాల్లో పత్తి, 2,796 ఎకరాలో మక్కజొన్న, ఇతర పంటలు 2,172 ఎకరాలు, మొత్తం 27,542 ఎకరాల్లో పంటలు నీటి మునిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 675 ఎకరాలల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. మంత్రి సీతక్కతోపాటు అధికారులు పర్యటించినప్పటికీ ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంతో ప్రజలు నిరాశ చెందారు.



మహబూబాబాద్‌లో నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

ఖమ్మం జిల్లాకు 10 మెడికల్ క్యాంపులు

- రాష్ట్రవ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లోనూ ఏర్పాటు
- వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.అవసరమైన వారికి టెస్టులు చేసి, మెడిసిన్ అందజేయాలని సూచించారు. ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, వైద్యవిధాన పరిషత్తు కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్‌తో మంత్రి సోమవారం సాయంత్రం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.వరదతీవ్రత ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాలో 10 మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి టీమ్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లు, సిబ్బంది, టెస్టులు చేయడానికి అవసరమైన పరికరాలు, మెడిసిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ బాధ్యతలను హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్‌కు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

వరద నష్టం 5,438 కోట్లు!

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, వరదల ఫలితంగా దాదాపు రూ.5,438 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. 110 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసి 4,000 మందికి పైగా ప్రజలను సురక్షితంగా శిబిరాలకు తరలించినట్టు వెల్లడించింది. రోడ్లు, భవనాలశాఖకు రూ.2,362 కోట్లు, ఇంధనశాఖ (ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్‌కు నష్టం) రూ.175 కోట్లు, పంట నష్టం 4,15,000 ఎకరాల్లో రూ.415 కోట్లుగా, నీటిపారుదల (మైనర్ ట్యాంకుల మరమ్మతులు) రూ.629 కోట్లుగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.170 కోట్లుగా, వైద్యారోగ్యశాఖకు రూ.12 కోట్లుగా, పశు సంవర్ధక శాఖ రూ.25 కోట్లుగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ రూ.1,150 కోట్లు, ఇతర విభాగాల్లో రూ.500 కోట్ల ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లినట్టు తెలిపింది.



మహబూబాబాద్‌లో ఇల్లు కూలడంతో నిరాశ్రయులైన ఓ కుటుంబం

వరద తగ్గింది.. బురద మిగిలింది




మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండాను ఆకేరువాగు ముంచెత్తింది. ఇంట్లోకి వచ్చిన వరద తగ్గిన తర్వాత బురదలో చిందరవందరగా పడి ఉన్న సామాగ్రి, పాడైపోయిన గృహోపకరణాలు, వస్తువులను చూస్తున్న మహిళ



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండాలో తన ఇంటిని ఆకేరువాగు వదర ముంచెత్తడంతో తడిసిన బియ్యాన్ని చూపిస్తున్న వృద్ధుడు

లోకం పోకడ



సర్కారు విఫలం!

సహాయక చర్యల కల్పనలో వెనుకబడిన రాష్ట్ర ప్రభుత్వం

- భారీ వర్షాలకు 33 మంది మృతి.. 16 మందే అంటున్న ప్రభుత్వం
- వరద ప్రాంతాల్లో బాధితుల ఆగ్రహం
- సోషల్ మీడియాలో నెటిజన్ల ఫైర్
- ఆదివారం సీఎం ఎక్కడంటూ ప్రశ్నలు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వర్షాలు, వరదలతో రాష్ట్రం అతలాకుతలం అవుతున్నది. ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఖమ్మం జిల్లా ఇంకా వరద ముంపులోనే ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి, ముగ్గురు మంత్రులు అక్కడే తిష్ట వేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. సహాయక చర్యలు మెరుగుపడలేదని, తమకు సహాయం అందలేదని బాధితులు ఆక్రోశిస్తున్నారు. సూర్యాపేటలోనూ ఇదే పరిస్థితి. వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 31 మంది వరకు మరణించినట్టు చెప్తున్నారు. 16 మంది మాత్రమే మరణించారని ప్రభుత్వం ప్రకటించింది. 5,700 గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయినట్టు పంచాయతీరాజ్‌శాఖ తెలిపింది. 117 గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయని, 80 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని అధికారులు చెప్తున్నారు. 150 ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయని, 500 రోడ్లు భారీగా దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. లక్షన్నర ఎకరాల్లో పంటనష్టం సంభవించిందని వ్యవసాయశాఖ అధికారులు చె ప్తుండగా, 4-5 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లిందనే అంచనాలు ఉన్నాయని, సమగ్ర సర్వే చేయాలని సీఎం చెప్పడం గమనార్హం.

ముందుచూపులేక తీవ్ర నష్టం

రాష్ట్రంలో వరద ముంపునకు, ప్రాణనష్టానికి ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమనే వాదన వినిపిస్తున్నది. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని, ఏపీ, తెలంగాణకు వర్ష ముప్పు పొంచి ఉన్నదని వాతావరణశాఖ ముందుగానే హెచ్చరించింది. ప్రస్తుత టెక్నాలజీ ప్రకారం ఒక జిల్లాలోని ఏ ప్రాంతంలో ఎక్కువ వర్షం కురిసే అవకాశం ఉన్నదో కూడా అంచనాలు ఇస్తుంటారు. దీనిని బట్టి ముంపు ప్రాంతం ఎక్కడ ఉంటుందో, వరదలు ఎక్కడ సంభవించే అవకాశం ఉన్నదో ముందస్తుగా అంచనా వేసే అవకాశం ఉంటుంది. అయినా ప్రభుత్వం ముంద స్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. గతంలో వర్ష, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, ఫైర్ తదితర వ్యవస్థలను అప్రమత్తం చేసి రక్షణ చర్య లు చేపట్టేవారని, ఎక్కడ చిన్న వరద, వాన వచ్చినా వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు హెలికాప్టర్లను రంగంలోకి దించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఎందుకు లేదని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ సీఎంతోపాటు ఇద్దరు మంత్రులున్న ఖమ్మం జిల్లా లో సహాయక చర్యలకు ఒక్క హెలికాప్టర్ కూడా రా లేదని ఉదహరిస్తున్నారు.



మహబూబాబాద్ జిల్లాలోని ఆకేరు వాగుపై వరద ఉధృతికి వంతెన కొట్టుకుపోవడంతో నిచ్చెనల సాయంతో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

'బురద' రాజకీయం

సీఎం రేవంత్‌రెడ్డి వరదల వేళ బురద రాజకీయం చేస్తుండటంపై ప్రజలు, నెటిజన్లు మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం రాష్ట్రంలో వరద ప్రభావం మొదలైన సంగతి తెలిసిందే. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఎక్కడా బయట కనిపించలేదు. కనీసం సచివాలయానికి రాకుండా ఇంటికే పరిమితమయ్యారు. మంత్రులకు ఫోన్లు చేసి ఆదేశాలు ఇచ్చినట్టు ప్రకటనలు విడుదల చేశారు. సోమవారం ఉదయం మాత్రం హడావుడిగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లి సమీక్ష నిర్వహించారు. తర్వాత సూర్యాపేట, ఖమ్మం పర్యటనలకు బయలుదేరి వెళ్లారు. ఆదివారమే ఎందుకు ప్రత్యక్షంగా పర్యవేక్షించలేదని ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇక సోమవారం సూర్యాపేటలో సీఎం మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నా పట్టించుకోకుండా, అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్‌ను విమర్శించారు. దీంతో 'వరదల వేళ బురద రాజకీయం ఏమిటి?' అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. ఖమ్మం పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా వేసుకోవడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రెస్‌మీట్ సమయంలో అందంగా అలంకరించిన వేదికపై కూర్చోవడం, కాంగ్రెస్ ప్రచార రథంలో సీఎం, మంత్రులు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా వరదలకు 33 మంది మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు, వరదలతో 33 మంది వర కు దుర్మరణం చెందినట్టు అనధికారికంగా తెలిసింది. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 9 మంది మృత్యువాతపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8 మంది చనిపోయారు. ఫోన్లు చేసినా కాపాడేవారులేక వరదల్లో కొట్టుకుపోయినవారే అత్యధికంగా ఉన్నారు. నల్లగొండ, సూర్యాపేట, నారాయణపేట, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ఇద్దరు చొప్పున, కామారెడ్డి, పెద్దపల్లి, కరీంనగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నిర్మల్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతిచెందారు.

దుందుభి నదిలో చిక్కుకున్న చెంచులు

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 2: చేపల వేటకు వెళ్లిన తొమ్మిది మంది చెంచులు దుందుభి నదిలో చిక్కుకున్న ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి సమీపంలోని గుర్రలబండ వద్ద చోటుచేసుకున్నది. నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లికి చెందిన తొమ్మిది మంది చెంచులు సోమవారం గుర్రలబండ వద్ద ఉన్న దుందుభి నదిలోకి చేపల వేటకు వెళ్లారు. నదిలో నీటి ఉధృతి పెరగడంతో అందులో చిక్కుకున్నారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ యువకుల సహకారంతో సోమవారం సాయంత్రం డ్రోన్‌లతో ఆహార పదార్థాలు అందించారు. మంగళవారం ఉదయం చెంచులను బయటకు తీసుకొస్తామని డీఎస్పీ తెలిపారు.



బీఆర్‌ఎస్ హయాంలో 2023 జూలై 27న భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిని వరద ముంచెత్తడంతో హెలికాప్టర్ సాయంతో సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు

అంతులేని విషాదం!

- కేసీఆర్‌లా స్పందించి ఉంటే నష్టం తగ్గేది
- సహాయక చర్యల జాప్యానికి భారీ మూల్యం
- వాతావరణశాఖ హెచ్చరికలు బేఖాతరు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలతో అనేక జిల్లాల్లో అంతులేని విషాదం అలముకున్నది. ప్రకృతి వైపరీత్యాలు చెప్పిరావు. కానీ వాతావరణశాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని యుద్ధప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే ఇంతలా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేది కాదనే అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. సర్కార్ సమయానికి స్పందించకపోవడం వల్ల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ సహా అనేక జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. గతనెల 27న వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని, తమకు సకాలంలో సహాయం అంది ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. గతంలో కేసీఆర్ సర్కార్ చేపట్టిన సహాయక చర్యలు, ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న వైఖరి పట్ల రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చ సాగుతున్నది.

అప్పుడలా.. ఇప్పుడిలా

2020, 2022, 2023లో భారీ వర్షాలు రికార్డు సృష్టించాయి. నాడు కేసీఆర్ ప్రగతిభవన్‌ను వార్‌రూంగా మార్చి, కంట్రోల్ రూంగా చేసి ఎప్పటికప్పుడు భాగస్వామ్య శాఖలను అప్రమత్తం చేశారు. దశాబ్దం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆ ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల కన్నా అధిక వర్షపాతం కురిసింది. యుద్ధప్రాతిపదికన కడెం ప్రాజెక్టు కింద ఉన్న 12 గ్రామాలను ముందస్తుగా ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్ల వందలాది మంది ప్రాణాలను రక్షించటమే కాకుండా కడెం ప్రాజెక్టును వరద ముంపు నుంచి కేసీఆర్ ప్రభుత్వం రక్షించగలిగింది. 2020లో కురిసిన భారీ వర్షాలకు తక్షణం కేంద్రసాయం కింద ఆదుకోవాలని రూ. 1350 కోట్లు ఇవ్వాలని వానలు కురుస్తున్న సమయంలోనే అంచనాలు వేసి నివేదించినా కేంద్రం నుంచి ఒక్క పైసా రాకున్నా రాష్ట్రప్రభుత్వమే ఆదుకున్నది.

నాడు హెలికాప్టర్లు తెప్పించిన కేసీఆర్

అర్ధరాత్రి దొంగ దెబ్బతీసినట్టు వాన పోటెత్తడంతో భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిని వరద నుంచి రక్షించిన వైనం రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం చర్చనీయాంశమైంది. జూలై 27, 2023లో కురిసిన అతిభారీ వర్షం వల్ల మోరంచపల్లి వాసులు తిరిగి లోకాన్ని చూస్తామని కలలో కూడా అనుకోలేదని ఆ ఘటనను గుర్తుచేసుకుంటున్నారు. మోరంచపల్లి వాగు తెగిపోవడం వల్ల ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. కేసీఆర్ కేంద్రం రక్షణశాఖతో సకాలంలో సంప్రదింపులు జరిపి ప్రత్యేక హెలికాప్టర్లు, పడవలను తెప్పించి 900మందిని గంటల వ్యవధిలోనే సురక్షిత ప్రాంతాలకు తరలించిన దృశ్యాలు కండ్ల ముందు తిరుగుతున్నాయి. చరిత్ర లో కనీవినీ ఎరుగని కుంభవృష్టితో ఉ మ్మడి వరంగల్ అతలాకుతలమైంది. 108 గ్రామాలు ముంపులో చిక్కుకున్న ఉదంతాన్ని జనం గుర్తుచేసుకుంటున్నారు.

ప్రభుత్వంపై విమర్శలు

భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్న విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన తీరు విమర్శలకు తావిస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రులు సహాయక చర్యలను సైతం రాజకీయ శిబిరాలుగా మార్చుకోవడం దారుణంగా కనిపిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట జిల్లా సమీక్ష సమావేశం తీరు, ఖమ్మం బాధితులను పరామర్శిస్తున్న సందర్భంగా సీఎం సహా మంత్రులు ప్రవర్తించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆపత్కాలంలో కండువాలకు, ఫొటోలకు అంత ప్రాధాన్యం ఎందుకని వరద బాధితులు సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	32.6°c	24.2°c
మెదక్	30.8°c	21.1°c
కరీంనగర్	28.0°c	25.0°c
వరంగల్	28.0°c	24.0°c
ఖమ్మం	28.0°c	23.0°c
నల్లగొండ	27.0°c	23.0°c
రంగారెడ్డి	26.1°c	19.9°c
నిజామాబాద్	24.8°c	22.2°c
మహబూబ్‌నగర్	24.2°c	21.3°c
హైదరాబాద్	23.8°c	21.4°c

మరో ఐదురోజులు వర్షాలు

- 5 నాటికి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఈ నెల 5నాటికి వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి రాబోయే ఐదు రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వానలు కురిసే అవకాశముందని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

11 జిల్లాలు అప్రమత్తం : సీఎస్

రాష్ట్రంలోని దాదాపు 11 జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ఆయా జిల్లా కలెక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతి కుమారి సూచించారు. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే విషయం జిల్లా కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్ కలెక్టర్‌ను ఆదేశించారు.

బస్సులు, రైళ్లు రద్దు

భారీ వర్షాల కారణంగా టీజీఎస్ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 1447 బస్సు సర్వీసులను రద్దు చేసినట్టు తెలిపింది. ఆదివారం రాత్రి వరకు 877, సోమవారం ఉదయం నుంచి మరో 570 బస్సులను రద్దు చేసింది. ఖమ్మం, విజయవాడ, మహబూబాబాద్ వైపుగా వెళ్లే రోడ్లన్నీ జలమయం కావడంతో ఆయా మార్గాల్లో బస్సులను పూర్తిగా రద్దు చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లాకు యథావిధిగా బస్సులను నడుపుతుండగా, వికారాబాద్‌లో 212 బస్సులకు బదులు 50 మాత్రమే నడుపుతున్నట్టు చెప్పారు. అలాగే, భారీ వర్షాలతో 432 రైళ్లు రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. 140 రైళ్లు దారి మళ్లించగా, మరో 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు తెలిపింది. సోమవారం ఉదయం మరో 96 రైళ్లను రద్దు చేసినట్లు వెల్లడించారు.

ఏపీకి తప్పని భారీ వర్షాలు..

సెప్టెంబర్ 5 నాటికి ఏర్పడే అల్పపీడనం ప్రభావంతో ఏపీలో కోస్తా తీరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొన్నది. వరద ప్రాంతాల్లో డ్రోన్లతో ఆహారం సరఫరా చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ట్రయల్ రన్‌ను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షించారు. ఈ డ్రోన్లు దాదాపు 8 నుంచి 10 కిలోల వరకు ఆహారం, మెడిసిన్ , తాగునీరు వంటివి తీసుకెళ్తాయనే అంచనాకు వచ్చినట్టు సమాచారం. చిట్టినగర్‌లోని విజయ డెయిరీ నీట మునిగి 70 కోట్ల నష్టం వాటిల్లినట్టు చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు.

ఆపద రక్షకులెక్కడ?

- బాధితులను ఆదుకొనే దిక్కే లేదు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతుండటంతో భవనంపై కూడా తమ ప్రాణాలకు రక్షణ లేదని భావించిన ఓ మహిళ తన నలుగురు పిల్లలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆదివారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు సహాయం కోసం హాహాకారాలు చేసింది. ఎంత మొత్తుకున్నా వారిని ఆదుకొనే నాథుడే కరువయ్యాడు. ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన ఘటన ఇది. చివరికి ఆ మహిళ మధిరలోని తమ బంధువులకు కాల్ చేయగా.. అక్కడినుంచి వచ్చిన గజ ఈతగాళ్లు వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మరో ఘటనలో మున్నేరు బ్రిడ్జిపై 9 మంది మధ్యాహ్నం ఎప్పుడో చిక్కుకుంటే.. రాత్రి పది గంటల వరకూ వారిని కాపాడే వారే లేకపోయారు. ఆఖరికి ఓ జేసీబీ డ్రైవర్ తన ప్రాణాలకు తెగించి ఆ తొమ్మిదిమందిని కాపాడారు. మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో కూడా వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వ్యవస్థ మొద్దు నిద్ర పోయినట్టు జరిగిన ఘటనలు తెలియజేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే అధికార యంత్రాంగం ఎందుకు మొద్దునిద్రలోకి జారుకుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖమ్మంలో ముగ్గురు మంత్రులు, పోలీసు, అగ్నిమాపక వ్యవస్థ పూర్తిగా చేష్టలుడిగి బాధితులను ఆదుకోవడంలో చేతులెత్తేసింది. వరద ఉధృతికి ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకొని ఆర్తనాదాలు చేశారు. అధికారులు మాత్రం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వరద ప్రాంతాలకు తరలించలేదు.

విపత్తులోనూ రేవంత్ రాజకీయం

- వరద సాయం చేయకుండా బీఆర్‌ఎస్‌పై సీఎం బురద
- రేవంత్ మాటలను ప్రజలు అసహ్యించుకుంటున్నరు
- ఆయన చీఫ్ మినిస్టర్ అని మరోసారి నిరూపించుకున్నడు
- ప్రభుత్వ వైఫల్యంతోనే 31మంది చనిపోయిండ్రు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు



మెదక్ జిల్లా చేగుంటలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/ చేగుంట : వరద సాయం చేయాలని కోరితే సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై బురద జల్లుతున్నాడని, ముఖ్యమంత్రి హోదాను దిగజార్చి విపత్తును కూడా రాజకీయం చేయడం దురదృష్టకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 'దుఃఖంలో ఉన్న ప్రజలకు భరోసా కల్పించాల్సింది పోయి సీఎం ప్రతిపక్షాల మీదపడి ఏడుస్తున్నడు. రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు అసహ్యించుకుంటున్నరు. ఆయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని మరోసారి నిరూపించుకున్నడు' అంటూ ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలపై నిందలు వేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను సీఎం ఒప్పుకొన్నాడని దుయ్యబట్టారు. వర్షాలను లెక్కచేయకుండా ఏపీలో 74 ఏండ్ల సీఎం బయట తురుగుతుంటే, మన సీఎం ఇంట్లో ఫిడేల్ వాయించాడని ఎద్దేవాచేశారు. రాజకీయాలు పక్కనబెట్టి ప్రజలకు భరోసా ఇచ్చేలా మాట్లాడాలని సూచించారు. మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి హరీశ్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు, వరదలతో 16మంది చనిపోయినట్టు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నా మొత్తం 31 మంది చనిపోయినట్టు తమకు సమాచారం ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇన్ని మరణాలు సంభవించాయని విమర్శించారు. వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా ప్రభుత్వం మొద్దునిద్ర పోయిందని, ముందస్తు చర్యల్లో విఫలమైందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు విఫలమయ్యారని, అక్కడ కాంగ్రెస్‌కు తొమ్మిది సీట్లిస్తే తొమ్మిది మందిని కూడా కాపాడలేక పోయారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వరదల్లో చనిపోయిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఖమ్మంలో సాయమడిగిన వరద బాధితులపై పోలీసులు లాఠీ చార్జీ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నాయకులమంతా కలిసి వరద బాధితులకు విరాళాలు అందిస్తామని చెప్పారు.

ఇంట్లో వరదనీరు.. కంట్లో కన్నీరు

'ఇంట్లో వరద నీరు, కంట్లో ఎడతెగని కన్నీరు.. వరద సృష్టించిన విలయాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని' అని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికీ సహాయక చర్యలు అందలేదని జనం ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం మనసుపెట్టి చర్యలు చేపట్టాలని, వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.పదివేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. భారీ వర్షాలను లెక్క చేయకుండా ప్రాణాలు పణంగా పెట్టి విధి నిర్వహణలో తలమునకలైన విద్యుత్తు ఉద్యోగులను హరీశ్ అభినందించారు.

భట్టి మాటలు శోచనీయం

ప్రజలు ఆపదలో ఉంటే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాజకీయాలు మాట్లాడటం శోచనీయమని ఎక్స్‌వేదికగా హరీశ్ విమర్శించారు.' మీలాగ మేం విమర్శలు చేయలేక కాదు, ఇలాంటి కష్టకాలంలో ప్రజలను ఆదుకోవడం ముఖ్యం, ప్రజలు మీమీద మండిపడుతున్నరు.. ముందు సహాయక చర్యలపై దృష్టి పెట్టండి' అని హితవుపలికారు.

నాగేశ్వర్‌పై బీజేపీ బెదిరింపులను ఖండిస్తున్నా

మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కొందరు బీజేపీ నాయకులు చేస్తున్న అనుచిత దాడి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హరీశ్ పేర్కొన్నారు. రాజకీయ విమర్శలను రాజకీయ విమర్శలతోనే ఎదుర్కోవాలని, అందుకు భిన్నంగా భౌతిక దాడులు చేస్తామని, బయట తిరగనివ్వబోమని బెదిరిస్తూ తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా దుర్భాషలాడటం గర్హనీయమన్నారు. ఈ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో ఆకేరువాగు ఉధృతికి కూలిపోయిన ముల్కలపల్లి బ్రిడ్జి

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

జలవిలయంపై తాత్సారం

తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో జనజీవనం అతలాకుతలమైంది. రికార్డు స్థాయి వర్షాలతో జలవనరులు పొంగి పొర్లుతున్నాయి. అనేక ప్రాంతాల్లో ఇండ్లు జలమయ్యాయి. వరదల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. నివాస ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో రైలు వంతెన కొట్టుకుపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం సమీక్షలు, ప్రకటనలతో కాలక్షేపం చేస్తున్నది. ప్రకృతి విపత్తుపై సర్కారు స్పందనలో అనుభవ రాహిత్యమే కాదు, అలసత్వం కూడా కనిపిస్తున్నది. ఇదేదో విపక్షాలు చేస్తున్న విమర్శ కాదు. ప్రకృతి విపత్తు చుట్టుముట్టిన వేళ సర్కారు సకాలంలో ఆదుకోవడం లేదంటూ వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహమే ఇందుకు నిదర్శనం.

ఖమ్మంలో మున్నేరువాగు వంతెనపై వరద నీటిలో చిక్కుకుపోయిన బాధితులు ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు ప్రాణభయంతో మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో స్థానికులే చొరవ తీసుకొని జేసీబీ, గజ ఈతగాళ్ల సాయంతో కాపాడారు. ఖమ్మంలోనే మరోచోట రెండో అంతస్థు వరకు నీరు చేరడంతో డాబాపై చిక్కుకుపోయిన వ్యక్తులను కాపాడటంలోనూ ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఇంటిలోని వారు కాపాడమంటూ పెట్టిన సందేశం ప్రజల మనసు కరిగించింది కానీ ప్రభుత్వాన్ని కదిలించలేకపోయింది. సొంతంగా గజ ఈతగాళ్లను పిలిపించుకుని వారు ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి సహా ముగ్గురు మంత్రులు ఉండి ఏమి లాభమని బాధితులు ప్రశ్నిస్తుండటంలో వింతేముంది! వానలతో, వరదలతో జనం అవస్థలు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయానికి రాకుండా ఇంటినుంచే టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా అధికారులకు ఆదేశాలివ్వడంతోనే సరిపెట్టడం అనుభవరాహిత్యం మాత్రమే కాదు, బాధ్యతారాహిత్యం కూడా. సమస్యపై ప్రభుత్వానికి సరైన అవగాహన లేదని కూడా క్షేత్రస్థాయి పరిస్థితులు సూచిస్తున్నాయి. జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రానికి సిఫారసు చేయడం వల్ల స్థానికంగా పరిస్థితుల్లో మార్పు రాదు. సర్కారు సాయం అట్టడుగు స్థాయికి చేరుకోవాలంటే పై స్థానాల్లో ఉన్నవారు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడం తప్పనిసరి. సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందిని సమన్వయపరిచే బాధ్యత సర్కారు పెద్దలదే. అది లోపించడమే ఇప్పుడు ప్రజలకు శాపంగా మారింది. సీఎం, మంత్రులు ఒకింత ఆలస్యంగా వరద ప్రాంతాల సందర్శనకు వెళ్లినప్పుడు బాధితులు గోబ్యాక్ అంటూ తిరగబడుతున్నారు. మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును స్థానికులు ఘెరావ్ చేయడం ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తున్నది. బాధితులు రోడ్డెక్కి ఆందోళనకు దిగితే ప్రభుత్వం లాఠీలతోనే సమాధానం చెప్పుండటం మరో వైపరీత్యం.

ఇలాంటి ప్రకృతి సంక్షోభాలు గతంలోనూ వచ్చాయి. వానలు, వరదలు ముంచెత్తినప్పుడు ఇదివరకటి బీఆర్ఎస్ ప్రభుత్వ స్పందనను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గంటలోనే హెలికాప్టర్ పంపి బాధితులను ఆదుకున్న విషయాన్ని విశేషించి ప్రస్తావిస్తున్నారు. ప్రజలను, అధికారులను అప్రమత్తం చేసి, లోతట్టు ప్రాంతాలవారిని పోలీసుల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలను పకడ్బందీగా చేపట్టడం తెలిసిందే. అదే సమయంలో ఆపత్కాలంలో మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమన్వయ బాధ్యతలను చూసుకునేవారు. కానీ, ఇప్పుడంతా తారుమారైంది. భారీ వర్షాలతో ముప్పు పొంచి ఉన్నట్టు ముందస్తు సమాచారమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కావాల్సిన వేగాన్ని అందుకోలేకపోయింది. ఇంకా ఉపద్రవం పూర్తిగా తొలగిపోలేదు. మరికొద్దిరోజులు వర్షాలు పడతాయని హెచ్చరికలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చురుకుగా స్పందించి కేంద్ర విపత్తు సహాయక దళాలను, అవసరమైతే రక్షణ దళాలను అప్రమత్తం చేసి ప్రజలను గట్టెక్కించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

హైదరాబాద్ నగర పర్యావరణ పరిరక్షణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 'హైడ్రా' రూపంలో తలపెట్టిన ప్రయత్నం సూత్రరీత్యా ఆహ్వానించదగినదే. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించి ఇంతవరకు స్వయంగా తను చెప్పిన విషయాలనూ, ప్రభుత్వ ఉన్నతాధికారులు చెప్పినవాటినీ, హైడ్రా కమిషనర్ చెప్పినవాటినీ, ఆచరణలో జరుగుతున్నవాటినీ, హైకోర్టు వ్యాఖ్యలూ, ఉత్తర్వులనూ గమనించిన మీదట ఇందులో అర్థం కాని విషయాలు అనేకం ముందుకు వస్తున్నాయి. అవి తలెత్తటం మొదలైన తర్వాత కూడా వాటికి ప్రభుత్వం వైపు నుంచి స్పష్టత లభించటం లేదు. ఆ కారణంగా ప్రజలలో అయోమయాలు, భయాందోళనలు ఏర్పడుతున్నాయి. అందువల్ల ప్రభుత్వం వెంటనే వాటిని పరిగణనలోకి తీసుకుని అవసరమైన స్పష్టీకరణలు ఇవ్వటంతో పాటు తన కార్యక్రమానికి తగు మార్పుచేర్పులు చేయటం అవసరం.

హైడ్రా లోగుట్టు ఏమిటి?



టంకశాల అశోక్



ఇందులో అన్నింటికన్న ముందు కొట్టవస్తున్నట్టు కనిపించే విషయం ఒకటున్నది. హైదరాబాద్ వంటి సుదీర్ఘమైన చరిత్ర గల మహానగరంలో ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమం సాధారణమైనది కాదు. ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడుతూ నగర పర్యావరణ, నిర్మాణాలకు సంబంధించి ఐదు రకాల ఉల్లంఘనలు జరిగాయన్నారు. ఒకటి, చెరువులు, సరస్సుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలు. రెండు, వాటి బఫర్ జోన్‌లో నిర్మాణాలు. మూడు, నాలాలను, పార్కులను ఆక్రమించి నిర్మాణాలు. నాలుగు, ప్రైవేటుగా పట్టాలున్నప్పటికీ అనుమతులు లేకుండా చేసిన నిర్మాణాలు. అయిదు, ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా చేసినవి. వీటిలో ప్రస్తుతానికి మొదటి మూడింటిపై దృష్టి పెడుతున్నామని అన్నారాయన. అదేవిధంగా హైడ్రా ప్రస్తుత పరిధి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకని చెప్పారు. ఈ పరిరక్షణలు జరగనందువల్ల కలుగుతూ వస్తున్న రకరకాల నష్టాలు ఏమిటో, అభివృద్ధి రీత్యా మునుముందు కలగగల నష్టాలు ఏమిటో వివరించారు. అందువల్ల నగర వర్తమానం కోసం, భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలు తప్పవని ప్రకటించారు.

ఆ విధంగా ఇది సాధారణ కార్యక్రమం కాదు. బృహత్తరమైనది. అటువంటపుడు దాని అమలుకు రూపొందించే ప్రణాళిక కూడా బృహత్తరంగా ఉండాలి. అందుకు సంబంధించిన సమస్త కోణాల గురించి ముందుగానే ఆలోచించి వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. వాటి మంచి చెడులు, పరిధులు, అమలు కోసం ముసాయిదా ప్రణాళికలు, ఎదురవగల చిక్కులను పరిశీలిస్తూ, అందుకు పరిష్కారాలపై ఒకవైపు అధికారుల స్థా యిలో, మరొకవైపు బయటి నిపుణులు, అనుభవజ్ఞుల స్థాయిలో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. అప్పుడు కార్యాచరణకు ఒక నిర్దిష్టమైన, స మగ్రమైన రూపం ఇచ్చి ఆచరణకు పూనుకోవాలి. అంతచేసినా కొన్ని లోటుపాట్లు, సమస్యలు ఎదురుకావచ్చు గాక. అది ఏ విషయంలోనైనా ఉండేదే. కానీ, ఇటువంటి మహానగరం ఎదుర్కొంటున్న ఇంతటి బృహత్తర సమస్య విషయం లో ముందుగా తగినన్ని జాగ్రత్తలు తీసుకొని కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామా లేదా అనేది ప్రశ్న. అటువంటి ప్రణాళికాబద్ధత లేనట్లయితే దానికి అరాచక లక్షణాలు వస్తాయి.

> **హైడ్రాకు సంబంధించి గత కొద్ది వారాల మాటలను, చేతలను కూడా గమనించినపుడు దురదృష్టవశాత్తు కలుగుతున్న అభిప్రాయం అటువంటిదేమీ జరగలేదని. ఎటువంటి ముందస్తు మేథోమథనం జరగలేదని. అంతా హడావుడి, అట్టహాసం, సంచలనం. ఒకవైపు క్షేత్రస్థాయిలో కనిపించేది ఇది కాగా, మరొకవైపు పరిపాలనాపరమైన స్థాయిలో కనిపిస్తున్నది అస్పష్టతలు, అయోమయాలు, ప్రశ్నలకు జవాబులేని తనాలు. బయటనే కాదు, కోర్టుల ముందు కూడా. ఇవన్నీ చాలవన్నట్లు ద్వంద్వ ప్రమాణాలు. హైడ్రా దారి హైడ్రాది కాగా, జీహెచ్ఎంసీ నుంచి మున్సిపాలిటీల వరకు వాటి తీరు వాటిది. తమ విషయం చెప్పుకునేందుకు పెద్దవాళ్లకు ఏవో, ఎవరో కనిపిస్తుండగా, అర్ధరాత్రి ఇళ్లపైకి జేసీబీలు దూసుకొస్తున్న సామాన్యులకు, పేదలకు, వికలాంగులకు తమ గోడు ఎక్కడ చెప్పుకోవాలో తెలియని స్థితి.**

ఒక ఉద్దేశం నిజంగా మంచిది అయి, పద్ధతి ప్రకారం ఆచరణ ఉన్నట్టయితే ఇటువంటి గందరగోళ పరిస్థితులు తలెత్తుతాయా? ఈ తరహా పరిస్థితులు తలెత్తగూడదని, అందుకు ప్రణాళిక సవ్యంగా ఉండాలనేది ప్రభుత్వానికి తెలియని విషయమా? ఇటువంటి కార్యక్రమాల విషయంలో ముందుగానే చేయవలసిందేమిటి? ఓఆర్ఆర్ పరిధిలో గల చెరువులు, సరస్సులు ఏమిటి? వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఏమిటి? వాటిని తుది రూపంలో ఎప్పుడు నోటిఫై చేశారు? వాటి హద్దులను గుర్తించే రాళ్లు, కంచెలు నేలపై ఉన్నాయా? ఉంటే ఎక్కడ? వీటన్నింటి మ్యాపులు, ఉపగ్రహ చిత్రాల కాపీలు ఉన్నాయా? వీటిలో ఎక్కడెక్కడ ఏ మేరకు ఆక్రమణలు జరిగాయి? ఎపుడు జరిగాయి? అందుకు వ్యక్తులు గాని, అధికారులు గాని ఎవరెవరు బాధ్యులు? ఆక్రమిత స్థలాలలో ప్రస్తుతం ఏమున్నాయి? నిర్మాణాలుంటే వాటికి అనుమతులివ్వటం, కరెంట్, నీళ్లు, డోర్ నంబర్లు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి వసతుల కల్పన ఎట్లా జరిగింది? అందుకు ఫీజుల వసూలు ఎట్లా చేస్తున్నారు? మొదలైన వివరాలన్నీ ముందుగానే పూర్తిగా సేకరించాలి. పూర్తి పారదర్శకత ఉండాలి. ఎవరైనా సమాచార హక్కు కింద అడిగితే వివరాలిచ్చే ప్రజాస్వామికత కూడా ఉండాలి.

చర్యల దశ ఆ తర్వాత వస్తుంది. ముందుగా ఉల్లంఘనదారులకు నోటీసులివ్వాలి. అదే సమయంలో దోషులైన అధికారులకు, బిల్డర్లకు, ఇతర కాంట్రాక్టర్లకు కూడా నోటీసులివ్వాలి. చెరువులు, సరస్సుల విషయంలో అనుసరించే ఈ క్రమాన్ని నాలాలు, పార్కుల విషయంలోనూ అనుసరించాలి. ప్రభుత్వాలే ఏవో పథకాల కింద పట్టాలు ఇచ్చిన సందర్భాలలో, అధికారుల అనుమతితో ఉల్లంఘనలు జరిగిన సందర్భాలలో, ముఖ్యంగా అది కొన్నేండ్ల కాలంగా ఉన్నపుడు, ఇంత కాలం ఫీజులు సైతం వసూలు చేస్తున్నందున, ప్రభుత్వం తరపున 'పాప పరిహారం' అనుకుని, సదరు వ్యక్తులు అక్కడి నుంచి ఖాళీ చేసేందుకు తగిన సమయం ఇవ్వాలి.

> **ప్రభుత్వ దోషాలను అంగీకరిస్తూ వారికి నష్ట పరిహారమిచ్చి తర్వాత బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసుకోవాలి. బాధితులు పేదవారైతే వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం చూపాలి. మరీ పేదలైతే ఇళ్లు కట్టివ్వాలి. ముఖ్యమంత్రి పేర్కొన్న అయిదు ఉల్లంఘనలలో ప్రస్తుతం మొదటి మూడింటిపై దృష్టిపెడుతున్నట్లు ఆయనే ప్రకటించినందున, మనం కూడా ప్రస్తుతం అందుకు పరిమితమై ఇదంతా చెప్పుకుంటున్నాము.**

కానీ వాస్తవంగా జరుగుతున్నదేమిటి? ఇక్కడే వస్తున్నది అసలు సమస్య. ఇంతవరకు మన దృష్టికి వచ్చినవి ఈ కింది విధంగా ఉన్నాయి. ఓఆర్ఆర్ పరిధిలో గల చెరువులు, సరస్సులు, నాలాలు, పార్కుల జాబితాలైతే ఉన్నాయి. కానీ అన్నింటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల చిత్రాలు, హద్దురాళ్లు, పార్కుల ప్రహరీలకు సంబంధించిన సమగ్ర సమాచారం లేనే లేదు. చర్యలు మొదలైన తర్వాత ఇపుడు సేకరిస్తున్నారు. ఉల్లంఘనలు చేసినవారి సమాచారం లేదు. ఈ సర్వేలు ఇపుడు జరుపుతున్నారు. రికార్డులు ఇపుడు చూస్తున్నారు. వారికి అనుమతులిచ్చినవారు, ఫీజులు వసూలు చేసినవారి గురించి తెలిసింది సముద్రంలో నీటిబొట్టంత. ఎవరు నిర్మాణాలు చేసి అమ్మారో, ఎవరు కొనుగోలుదారులో, జరిగిన మారుబేరాలు ఏమిటో తెలియదు. పేదలకు పట్టాలు ఇచ్చింది ఏ ప్రభుత్వాలో, ఎంతకాలం క్రితమో, తిరిగి అవి ఏమైనా చేతులు మారాయో, కుటుంబసభ్యుల మధ్య పంపకాలు జరిగాయో అసలేమీ తెలిసినట్లు లేదు. వారిని అడగటం, షోకాజ్ నోటీసులివ్వటం, చట్టపరమైన విషయాల విచారణ ఏమీ లేదు. అనగా, అసలు రెగ్యులర్ పరిపాలన అన్నది ఇంత అధ్వాన్నంగా సాగుతున్నదన్న మాట. అందుకు నగర పర్యావరణం, ప్రజలు ఇంతకాలం ఒక విధంగా బలి కాగా, ఇపుడు మరొకవిధంగా బలి కావాలా?

> **ఇది ఒకటైతే, ఉల్లంఘనదారులకు ముందుగా నోటీసులిచ్చి, వారి వివరణ చూసిన తర్వాత చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత సందర్భంలోనూ హైకోర్టు మొదటిరోజునే ఆ మాట చెప్పింది. కానీ, అధికారులు సంచలనం కోసమా అనిపించేట్లు ఇదేమీ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో కేవలం ఒకటిరెండు గంటల నోటీసుతో. అది కూడా అర్ధరాత్రి. అదికూడా పేదలపై. కోర్టులు స్వయంగా జోక్యం చేసుకొని, ముందుగా నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించి, ఇవ్వకుండా ఎట్లా చర్యలు తీసుకుంటారని నిలదీసి, కూల్చివేత నోటీసులను తామే షోకాజ్ నోటీసులుగా మార్చితే తప్ప పరిస్థితి దారికి రాలేదు.**

అపుడు గాని అధికారుల అనాలోచితమైన దూకుడుతనం మనకు తెలియలేదు. ఇందులో మరికొన్ని విచిత్రాలున్నాయి. పైన చెప్పుకున్న తరహా సమాచారాలను ప్రభుత్వం సేకరించిందా అన్న ప్రశ్నకు, ఆ పని ఇప్పుడు చేస్తున్నామంటున్నారు. నోటీసులు ఇచ్చారా అంటే, ఒకసారి ఇకనుంచి ఇస్తామని, మరొకసారి ఏదో తీర్పు ప్రకారం అట్లా ఇవ్వనక్కరలేదని చెప్తున్నారు. మరోసారి అయితే, ఉల్లంఘనదారులు కోర్టు నుంచి స్టే తెచ్చేలోగానే కూలుస్తామని ప్రకటిస్తున్నారు. ఒక చట్టబద్ధ వ్యవస్థలో కోర్టు నుంచి రక్షణ పొందటం పౌరుల హక్కని వారికి తెలియదా? వారట్లా మాట్లాడవచ్చునా? అది చట్టాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించడం కాదా? ఇట్లా చెప్పుకునేందుకు ఇంకా ఉన్నాయి. కానీ, ఇంతవరకు గమనించినా, ప్రభుత్వ కార్య ప్రణాళికను లోపభూయిష్ఠంగా హడావుడిగా కాకుండా, సక్రమంగా రూపొందించి అమలుపరచవలసిన అవసరం మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నది. లేనట్లయితే, పైకి చెప్తున్నది ఒకటి కాగా మరేవో ఉద్దేశాలతో ఈ పనిచేస్తున్నారనే అనుమానాలు బలపడతాయి. అటువంటి అనుమానాలు ఇప్పటికే మొదలయ్యాయి కూడా.

పోతే, ఇందులో గమనించవలసినవి మరికొన్ని ఉన్నాయి. ఉల్లంఘనలను గుర్తించేందుకు ప్రభుత్వం సాధారణంగా కటాఫ్ తేదీని నిర్ణయిస్తుంది. అనగా ఎంతకాలం వెనుకకుపోయి ఇందుకు ఒక గడువును తీసుకుంటారన్నది. నగరంలో చెరువులు, సరస్సులు, నాలాలు నిజాం కాలం నుంచి ఉన్నాయి. వేటి ఉల్లంఘనలు ఎప్పటినుంచి జరుగుతున్నాయో ఉపగ్రహ చిత్రాలలో తేలుతుందేమో తెలియదు. ఉపగ్రహాలు వాడుకలోకి రానప్పటి సంగతేమిటో తెలియదు. మ్యాపులు ఏమున్నాయో తెలియదు. మొత్తానికి అట్లా ఎంత వెనుకకుపోతారు? నిజాం కాలమా? ఉమ్మడి ఆంధ్రప్రదేశా? తెలంగాణ రాష్ట్రమా? ప్రభుత్వం ఇంతవరకు ఏమీ ప్రకటించలేదు. ఇదొక ముఖ్యమైన సమస్య కాగా, కూల్చివేతలకు గురయ్యే నిర్మాణాలలో వేర్వేరు రకరకాలవి ఉంటాయి. ఒకటి, ఉన్నతవర్గాల నివాసాలు. రెండు, మధ్యతరగతి వారి నివాసాలు. మూడు, దిగువ మధ్యతరగతి నివాసాలు. నాలుగు, పేదల నివాసాలు. అయిదు, వ్యాపార సంబంధమైనవి. ఆరు, విద్యాసంస్థలు, వైద్య సంస్థల వంటి ప్రజోపయోగ సంస్థలు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో కొన్ని ప్రభుత్వ నిర్మాణాలు కూడా వస్తాయనే అంచనాలు ఉన్నందున అవి ఏడవ కేటగిరీ అవుతాయి. వీటన్నింటిని గురించి ప్రభుత్వం ఆలోచించిందా లేదా తెలియదు. ఒకవేళ ఆలోచిస్తే ఆ విషయాలు రహస్యంగా ఉంచటం గాక ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలి. ఒకవేళ ఆలోచించి ఉండకపోతే ఆ మాట ఇప్పటికైనా బయటకు ఒప్పుకొని, ఇక నుంచి ఆ పని చేస్తామనాలి.

ఇది చాలా సీరియస్ విషయం అయినందున ప్రభుత్వం మరొక పని చేయటం కూడా అవసరం. మొత్తం చెరువులు, సరస్సులు, నాలాల ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, బఫర్‌జోన్ ప్రాంతాలు అన్నింటిలోని అన్ని ఆక్రమణలు కలిపి ఎన్నో, అవి ఏ తరహావో పూర్తి లెక్కలు తీసి ప్రకటించాలి. వాటిని వేలకు వేలుగా కూల్చివేయటం వల్ల కలిగే ఆర్థిక నష్టం ఎన్ని లక్షల కోట్లలో ఉంటుందో అంచనా వేయాలి. నష్టం ఏ వర్గానికి ఎంత, ప్రభుత్వానికి ఎంత అనేది లెక్కల విశ్లేషణలో తేలుతుంది. నష్టం ప్రజలది అయినా, ప్రభుత్వానిదైనా అంతిమ విశ్లేషణలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థది అవుతుందని గుర్తించాలి. ఇవి నష్టం లెక్కలు కాగా, తర్వాత పునర్నిర్మాణాలు ఏ విధంగా? ఎవరెక్కడ? సంస్థల మాటేమిటి? అందుకు నగరంలో గాని, మరొక చోట గాని ఏ విధంగా? ప్రభుత్వం ఒక ప్రభుత్వంగా ఏమైనా ఆలోచించి ప్రణాళికలేమైనా వేస్తుందా, లేక తన బాధ్యతేమీ లేదు, ఎవరిష్టం వారిదంటుందా? ఒక ప్రభుత్వం ఒకవేళ అట్లా చేతులు ఎత్తి వేస్తే, అది బాధ్యతాయుతమైన వ్యవహారణ కాగలదా? లేక వారందరిని ముఖ్యమంత్రి పెట్ ప్రాజెక్ట్ అయిన ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతానికి, ఫోర్త్ సిటీకి తరలిపోక తప్పని పరిస్థితిని సృష్టించే ఆలోచన ఉందా? అన్నవి కొన్ని సందేహాలు.

> **ఉరుము లేని పిడుగు వలె, అకస్మాత్తుగా, అస్తవ్యస్తమైన రీతిలో, ఒక ప్రణాళికాబద్ధత లేని రీతిలో తెరపైకి వచ్చి, లేడికి లేచిందే పరుగన్న రీతిలో సాగుతున్న ఈ కూల్చివేతల పథకం రహస్యోద్దేశం అదే కాదు గదా అన్నది మరొక సందేహం. ఒకవేళ అట్లా వీరంతా తరలిపోవాలన్నదే ఆలోచన అయితే అది జరిగేందుకు ఎంతకాలం పడుతుంది? అదొక కొత్త నగర నిర్మాణం వంటిది గదా.**

పోతే, ఈ క్రమం అంతటిలో వివిధ వర్గాల ప్రజలపై, వ్యాపారాలపై, వ్యవస్థలపై, అంతిమ విశ్లేషణలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడగల ప్రభావాల గురించి, అదేవిధంగా ఈ అస్తవ్యస్తతల వల్ల ఏర్పడగల అస్థిరతలతో ఒకవేళ ఏవైనా ఒడిదుడుకులు, రాష్ట్ర ప్రతిష్ఠ పట్ల బయటివారికి సందేహాలు కలిగే అవకాశం ఉంటే అవీ, వీటన్నింటి గురించి కూడా ప్రభుత్వం ఆలోచించటం అవసరం. అటువంటి మేథోమథనాలు ఇప్పటికే ఏమైనా చేశారేమో తెలియదు. పని జరుగుతున్న తీరుతెన్నులను చూడగా, అటువంటిదేమీ జరిగినట్లు మాత్రం కన్పించటం లేదు.

ఓపీఎస్ విధానమేది?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన 9 నెలల పాలనలో రైతులను, మహిళలను, యువతను దారుణంగా వంచించారు. ఇస్తామన్నవి ఇవ్వలేదు సరికదా కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నో మంచి మంచి పథకాలకు మంగళం పాడేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్ల వంతు వచ్చింది. వీరిని కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వంచించబోతుందా? కేంద్రానికి దాసోహం అంటుందా? అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను గంగలో కలపనుందా? అనే సందేహాలకు అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు ఏకంగా 'పింఛన్ విద్రోహ దినం' పాటించారు.



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238




గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనర్లకు సంబంధించి.. పాత పింఛన్ విధానాన్ని అమలుపరుస్తామని, ఏకీకృత, జాతీయ పింఛన్ విధానాలను అమలుపరచబోమని పెండింగ్‌లో ఉన్న మూడు డీఎలను వెనువెంటనే చెల్లిస్తామని, ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల్లోపే పీఆర్సీ ఆమోదించి అమలు పరుస్తామని పేర్కొన్నది. ఇవన్నీ నిజమని నమ్మారు ఉద్యోగులు. కానీ ఈ తొమ్మిది నెలల కాలంలో (మొదటివారంలో జీతాలు, పింఛన్లు తప్ప) ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనర్లకు సంబంధించిన ఇతర ప్రధాన హామీలేవీ అమలు కాలేదు సరికదా ఈ 9 నెలల కాలంలో ముఖ్యమంత్రి గాని, ఇతర మంత్రులు గాని ఆ ఊసే ఎత్తడం మానేశారు. ఇటీవల ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు అన్నారే తప్ప పాత పింఛన్ విధానాన్ని మాత్రమే అమలుపరిచి తీరుతానని ఒక్క మాట అనలేదు. విశేషమేమిటంటే ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ నోటి నుంచి కూడా పాత పింఛన్ హామీ వెలువడ లేదు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు, పాత పింఛన్ వంటి ప్రధానమైన అంశాల్లో ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఒక సమీక్ష జరిపిన దాఖలాలు కనిపించలేదు. ముఖ్యమంత్రి సర్వస్వతంత్రుడని, తమ సమస్యలు చిటికలో పరిష్కారమవుతాయని ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు పెట్టుకున్న గంపెడాశలు నానాటికి అడుగంటుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వం ఏర్పడిన 9 నెలలకే ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు వీధుల్లోకి రావాల్సిన దుస్థితి ఏర్పడింది.

> **పీఆర్సీ, డీఏ బకాయిల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు దశాబ్దాలుగా సర్దుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారు. కొంత అటూ ఇటు అయినా భరిస్తూ వస్తున్నారు. కానీ, అలవికాని అలసత్వం ప్రభుత్వ యంత్రాంగ సంక్షోభానికి కారణమవుతున్నది. పులి మీద పుట్రలా కేంద్రం ఇటీవల ఆమోదించిన 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్' ప్రభుత్వ ఉద్యోగుల, పింఛనర్ల పాలిట అశనిపాతంగా మారింది. ఆ గండం నుంచి గట్టెక్కడానికి వారంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైపు ఆశగా చూస్తున్నారు.**

2004 జనవరి 1న జాతీయ పింఛన్ విధానాన్ని నాటి ప్రధాని వాజపేయి ప్రవేశపెట్టగా ఆరు నెలల తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దానిని తోసిపుచ్చలేదు, సరికదా పకడ్బందీ విధి విధానాలను రూపొందించింది. 2013లో పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించింది. ఇటీవల ప్రధాని మోదీ క్యాబినెట్ కొత్త సీసాలో పాత సారా పోసినట్టు వాజపేయి జాతీయ పింఛన్ విధానానికి బదులుగా ఏకీకృత పింఛన్ విధానాన్ని ఆమోదించింది. ఇదొక అద్భుతమైన పింఛన్ విధానమని ప్రకటించింది. కానీ, కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లయింది. ఈ తలతిక్క విధానాల ఫలితంగా గత 20 ఏండ్లుగా పింఛనర్లు తమ బతుకు భరోసా అయిన న్యాయమైన పింఛన్‌ను పొందలేని దుస్థితిలో కునారిల్లుతున్నారు. 2004 కంటే ముందు నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు రిటైరైన తర్వాత దర్జాగా న్యాయమైన, హక్కుగా సంక్రమించిన పింఛన్ అనుభవిస్తుంటే, ఈ 20 ఏండ్ల కాలంలో నియమితులైన వారు పాత పింఛన్ విధానం అమలుకోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. కొత్త పింఛన్ విధానాల్లో ఉన్నదేమిటంటే... ఉద్యోగి 10 శాతం వేతనం కంట్రిబ్యూట్ చేస్తే ప్రభుత్వాలు అంతకంటే కొంత ఎక్కువ 18 శాతం వరకు మ్యాచింగ్ చేసి ఉద్యోగి రిటైరయ్యే సమయంలో ఇస్తాయట. ఈ లోగా సదరు రొక్కాన్ని ఎక్కడో షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి వచ్చిన లాభాలను రిటైరైనప్పుడు ఇస్తాయట. అంటే కేంద్రం ఒకరకంగా ఉద్యోగుల శేష జీవితాలను పణంగా పెట్టి జూదం ఆడాలనుకుంటున్నది. ఇదెక్కడి సంక్షేమ రాజ్యం? తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగి రిటైరైతే ఈ విధానం వల్ల నష్టపోయేది ఎంత? ప్రపంచ బ్యాంక్ విధానాలకు అనుకూలంగా కేంద్రం ఆమోదించిన ఈ కొత్త పింఛన్ విధానం పద్మవ్యూహంలోకి పింఛనర్లు వెళ్తే తిరిగి రాగలరా? పాత పింఛన్ విధానం కంటే కొత్త ఏకీకృత పింఛన్ లాభదాయకంగా ఉంటే ఉద్యోగులు ముక్తకంఠంతో వ్యతిరేకించరు కదా! ఇంటికి ధనలక్ష్మి వస్తుందంటే తలుపులు మూసుకోరు కదా!

ఇప్పటికే పశ్చిమబెంగాల్, కేరళ, పంజాబ్, రాజస్థాన్ సహా కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా లు కొత్త పింఛన్ విధానాన్ని పక్కనపెట్టాయి. దక్షిణాదిన అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈ బాధ్యత మరింత ఉన్నది. ఎందుకంటే, గత ఎన్నికల మ్యానిఫెస్టోలో వారు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టంగా పేర్కొన్నారు కాబట్టి. ఈ సందర్భంగా చాలామంది ప్రభుత్వ ఉద్యోగ మిత్రులు, తోటి పింఛనర్లు అంతర్గత చర్చల్లో... వ్యవసాయ మోటార్లకు మీటర్ల విషయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఏకంగా ప్రధాని మోదీని ఢీకొని, కేంద్రం నిధులు ఇవ్వనని బెదిరించినా ధర్నాకు దిగి 'చావనైనా చస్తాను గానీ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించను' అని నినదించిన సందర్భం గుర్తుచేసుకుంటున్నారు. ఆ స్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోట పాత పింఛన్ ఇస్తాననే నొక్కి వక్కాణింపు కోసం కొత్త పింఛన్ బాధితులు ఎదురుచూస్తున్నారు. అసలు ముఖ్యమంత్రి బడేభాయ్ మాటను కాదనే సాహసం చేస్తారా? అన్న సందేహం కొందరిని పీడిస్తున్నది. అందుకు మరో కారణం కూడా ఉన్నది. ఏపీ సీఎం నోటివెంట ఇంకా పాత పింఛన్ ఇస్తానన్న మాట రాలేదు మరి. కేసీఆర్ హయాంలో 95 శాతం లోకల్ రిజర్వేషన్, 43 శాతం ఫిట్‌మెంట్, తెలంగాణ ఇంక్రిమెంట్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వంలో గౌరవప్రదమైన పదవులు, వివిధ విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, వంటి చరిత్రాత్మకమైన ఉద్యోగ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలయ్యాయని చెప్పుకోవడానికి ఉన్నాయి. ఈ తొమ్మిది నెలల్లో అలాంటి చారిత్రక సందర్భాలు ఏవీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తారసపడలేదు. (చెప్పుకుంటున్న ఆరు నెలల్లో 30 వేల ఉద్యోగాలు కూ డా కేసీఆర్ ప్రభుత్వం వల్లనేనని అందరికీ తెలిసిందే). ఇప్పుడు సమయం ఆసన్నమైంది. గత ప్రభుత్వం కంటే ఒక చేయి పైన ఉండేట్లుగా ఫిట్‌మెంట్, పాత పింఛన్ విధానం అమలు, డీఏ బకాయిల చెల్లింపు అంశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించాలని ఉద్యోగులు, పింఛనర్లు ఆశిస్తున్నారు. సమస్యలు పాలకుల ముందుకొచ్చినప్పుడల్లా గతం మీద తోసేయడం, సంచలనాలు సృష్టించి దృష్టి మళ్లించడం, దరిద్ర దేవత దండకాలు వినిపించడం ఇంకానా... ఇకపై చెల్లవు.



సీఎం నిలదీత.. మంత్రుల అడ్డగింత

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. 'వరద నీటిలో చిక్కుకొని రెండు రోజులుగా నరకం అనుభవిస్తే ప్రభుత్వం నుంచి ఒక్కరు కూడా వచ్చి ఆదుకోలేదని, అన్నపానీయాలు లేకుండా మగ్గిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడొచ్చి రూ. 10 వేలు ఇస్తామని ప్రకటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాకు ఈ ప్రకటనలు, హామీలు వద్దు.. సాయం చేయండి' అంటూ డిమాండ్ చేశారు. భారీ వర్షాల కారణంగా శని, ఆదివారాల్లో ఖమ్మంలోని మున్నేరు మహోగ్రరూపం దాల్చి పరీవాహక ప్రాంతాలను ముంచేసింది. వరద నీటిలో చిక్కుకొని నరకం చూసిన ప్రజలను పరామర్శించేందుకు, జరిగిన నష్ట తీవ్రతను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఖమ్మం వచ్చారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసాలు నీటమునిగిన ప్రాంతాలకు వెళ్లి బాధితుల బాగోగుల గురించి అడిగి తెలుసుకోబోయారు. ఈ క్రమంలో రెండు రోజులుగా ఆచూకీలేని ప్రభుత్వ పెద్దలు సోమవారం పరామర్శకు రావడంపై బాధితులు భగ్గుమన్నారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో మహిళలు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి ఎదుటే ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖమ్మం నగరంలో ఆయన పర్యటనను నిరసిస్తూ వ్యర్థాలను రోడ్డుపై పోయించి నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తాము జల ప్రళయంలో చిక్కుకున్నా తమను ఎవరూ పట్టించుకోలేదన్న విషయాన్ని సీఎంకు చెప్పేందుకు వెళ్తున్న పలువురు మహిళలను మగ పోలీసులు లాగిపడేశారు.

పోలేపల్లిలో సీఎంకు నిరసన సెగ

వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డికి నిరసన ఎదురైంది.

మండలంలోని పోలేపల్లి రాజీవ్ గృహకల్ప కాలనీలో సీఎం పర్యటిస్తున్న సమయంలో స్థానికులు అడుగడుగునా అడ్డుతగిలారు. మంత్రి పొంగులేటి తమ కాలనీకి వచ్చి తమ కష్టాన్ని చూడాలంటూ ఉదయం 8 గంటల సమయంలో ఖమ్మం బైపాస్‌పై సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో చేశారు. పర్యటనలో భాగంగా సాయంత్రం ఐదు గంటలకు రేవంత్ అదే కాలనీకి వెళ్లాల్సి ఉంది. దీంతో కాలినడకన వచ్చిన తమ ఇండ్లలోని పరిస్థితిని చూస్తారని కాలనీవాసులు ఆశపడ్డారు. కానీ సీఎం కాలినడక కాకుండా ఓపెన్‌టాప్ జీప్‌లో వచ్చారు. దీంతో ఆగ్రహించిన కాలనీవాసులు నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి కారులో ఉండి హాయ్ చెప్పడానికి ఇక్కడకు వచ్చారా? అని మండిపడ్డారు. జీప్ దిగివచ్చి తమ ఇబ్బందులను చూడాలని నినాదాలు చేశారు. కాలనీలో దాదాపు 15 నిమిషాలపాటు జీప్‌పై ఉన్న సీఎం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడాన్ని గమనించారు. కాలనీ సెంటర్‌కు వచ్చిన ఆయన అక్కడ జీప్ ఆపారు. పక్కనే ఉన్న మూతి సంతోశ్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లారు. ఇంటి పరిసరాలను చూసి తిరిగి వచ్చి జీప్ ఎక్కబోయారు. ఆ సమయంలో ఓ వ్యక్తి సీఎం జీప్‌కు అడ్డంగా వచ్చి కింద పడుకునే ప్రయత్నం చేశాడు. ఈలోపే సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి మైక్ తీసుకొని మాట్లాడారు. సీఎం ప్రసంగం ఆరంభం మొదలుకాగానే కాలనీవాసులు నినాదాలు చేశారు. 'ప్రచారం వద్దు.. సాయం చేయండి' అంటూ నినదించారు. 'ఇంటికి రూ.పది వేల పరిహారం ఇస్తాం' అని చెప్పే సమయంలో అన్ని వైపుల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'మీరు ఇచ్చే రూ. పది వేలకు ఒక్క సామాను కూడా రాదు.. మీ 10 వేలు వద్దు.. మీరు వద్దు..' అంటూ చేతులు ఎత్తి నినాదాలు చేశారు. రెండ్రోజులుగా నీళ్లలోనే ఉన్నప్పటికీ తమను పట్టించుకున్న వారే లేరని చెప్పడానికి సీఎం వద్దకు వెళ్తుండగా పోలీసులు పోలేపల్లి కాలనీ మహిళలను పక్కకు తప్పించారు. సీఎం పర్యటనకు కొద్ది గంటల ముందు మున్సిపల్ అధికారులు ఖమ్మంలోని బొక్కలగడ్డ ప్రాంతంలోని చెత్తను ట్రాక్టర్ల ద్వారా తొలగించి బ్లీచింగ్ చల్లారు. రెండు రోజులుగా తమ ఇబ్బందులను పట్టించుకోని అధికారులు ఇప్పుడొచ్చి శుభ్రం చేస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నిరసనకు సీఎంకు తెలియజేసేలా ఆ ట్రాక్టర్లలోని వ్యర్థాలను అక్కడి రోడ్డుపై పోయించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చినట్టు చేతులు ఊపుకుంటూ, టాటా చెప్పి వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డ ప్రాంతంలో పారిశుధ్య సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న వ్యర్థాలను రోడ్డుపై పోయించి నిరసన వ్యక్తం చేస్తున్న వరద బాధితులు



ఖమ్మం పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్నేరును పరిశీలించి వెళుతుండగా అడ్డుకుంటున్న గ్రామస్థులు

సీఎం ఏమన్నా నీ ఇంటికి వచ్చి కలుస్తాడా?

మీడియాతో బాధలు చెప్పుకుంటున్న వరద బాధితులను కాంగ్రెస్ నాయకుడు మోసిన్‌ఖాన్ బెదిరించారు. ఖమ్మం కాంగ్రెస్ అడ్డా అని, ఇక్కడికి వచ్చి ఏం మాట్లాడుతున్నారని హెచ్చరించారు. సీఎం ఏమన్నా నీ ఇంటికి వచ్చి కలుస్తాడా అంటూ మండిపడ్డారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వరద బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మీడియా ప్రతినిధులను కూడా బెదిరించారు.

వరద బాధితుల ఆర్తనాదాలు

హుజూర్‌నగర్, కోదాడలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆయన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతి పర్యటించగా బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురంలో 50 మందికిపైగా వరద బాధితులు సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

నిత్యం సమస్యలతో సతమతమవుతున్నామని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట తలోడి గ్రామస్థులు ధర్నా చేశారు. సమస్యలపై పలుమార్లు కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీవో మహేందర్ రెడ్డి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

> 'రేవంత్‌రెడ్డికి దోమలు కుడతాయని బ్లీచింగ్ చల్లుతున్నారా? మేం చచ్చినా పర్లేదా? మూడ్రోజుల నుంచి తిండి, నీళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నాం'
>
> -ఖమ్మంలో వరద బాధితులు

తహసీల్దార్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

తాగు నీటి సమస్య పరిష్కరించాలని విర్దండి గ్రామంలో సోమవారం తహసీల్దార్ పుష్పలత కారును ఎస్సీ కాలనీ వాసులు అడ్డుకున్నారు. కలెక్టర్ పర్యటన అనంతరం తహసీల్దార్ విర్దండి నుంచి కౌటాలకు వచ్చే క్రమంలో గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు ఆమె కారును అడ్డుకున్నారు.

మణుగూరులో బస్తీ వాసుల బైఠాయింపు

మణుగూరు టౌన్: భారీ వర్షంతో తమ కాలనీ ముంపునకు గురైతే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ఆరోపిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని మేదర బస్తీవాసులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కనీసం మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అరగంటకు పైగా నినాదాలు చేశారు. ఓట్ల సమయంలో వచ్చి పలకరించిన ఎమ్మెల్యే బాధల్లో ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై మేడ ప్రసాద్ అక్కడికి చేరుకుని కాలనీవాసులకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

అధైర్య పడొద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుంది

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఇళ్లల్లోకి నీళ్లొచ్చి, ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ భరోసా కల్పించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, మహబూబాబాద్, గంగారం మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆమె స్థానిక ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి పర్యటించారు. కేసముద్రం, ఇనుగుర్తి, గంగారం మండల కేంద్రాలు, నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించారు. వరద బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కూలిన ఇళ్లను, తడిసిన నిత్యావసర సరుకులు, తెగిన చెరువులు, వరదలో కొట్టుకపోయిన మూగజీవాలను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

దండం పెడతా.. ఆదుకోండి

బయ్యారం: 'రెండు రోజులుగా కురిసిన వర్షం కారణంగా వరదలో వరి పంట కొట్టుకుపోయింది. నష్టం వచ్చింది. దండం పెడతా ఆదుకోండి' అంటూ మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం అల్లిగూడెం గ్రామానికి చెందిన రైతు కోడి మల్లేశ్ మంత్రి సీతక్క ఎదుట కన్నీరు పెట్టుకున్నాడు. వారం క్రితమే ఐదెకరాల్లో వరి పంట వేశానని, వరదతో పంట మొత్తం దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలుపుతూ 'దండం పెడతా ఆదుకోండి' అంటూ కన్నీరు పెడుతూ వేడుకున్నాడు. బాధ పడొద్దని రైతుకు ధైర్యం చెప్పిన మంత్రి సీతక్క పంట నష్టాన్ని అంచనా వేయాలని తహసీల్దార్ విజయను ఆదేశించారు.



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం అల్లిగూడెం గ్రామంలో తమను ఆదుకోవాలంటూ మంత్రి సీతక్కకు దండం పెడుతున్న రైతు మల్లేశ్

మంత్రి సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకున్న తండావాసులు

కేసముద్రం/ఇనుగుర్తి/నెల్లికుదురు/మహబూబాబాద్ రూరల్/గంగారం : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని కట్టతండా వాసులు సోమవారం మంత్రి సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ముంపునకు గురైన పలు మండలాల్లోని గ్రామాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కేసముద్రం వచ్చిన మంత్రిని తమ ప్రాంతానికి రావాలని తండావాసులు కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతో మంత్రి కాన్వాయికి అడ్డుతగిలారు. పోలీసులు వెంటనే అక్కడికి వచ్చి వారిని బలవంతంగా పక్కకు నెట్టివేయడంతో కాన్వాయి వెళ్లిపోయింది.



మంత్రి పొంగులేటి వచ్చి వరద తీవ్రతను పరిశీలించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం బైపాస్‌పై బైఠాయించిన రాజీవ్ స్వగృహ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీవాసులు

పొంగులేటి వస్తేనే నిరసన విరమణ

ఖమ్మం రూరల్: తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్నది పాలన ప్రజాపాలన కాదని, ప్రజావ్యతిరేక పాలనని ఖమ్మంలోని రాజీవ్ స్వగృహ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీల వాసులు ఆరోపించారు. మున్నేరు ముంపునకు గురైన తాము నీటిలో రెండు రోజులుగా అరిగోస పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం నుంచి ఇసుమంతైనా సాయం అందలేదని అన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చి తమ కాలనీలను పరిశీలించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బైపాస్ రోడ్డుపై సోమవారం రాస్తారోకో చేశారు. దాదాపు 500 మంది కాలనీవాసులు రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి పొంగులేటి తమ కాలనీలకు వచ్చి పరిశీలిస్తేనే తాము ఈ ఆందోళనను విరమిస్తామని, లేదంటే ఇక్కడినుంచి కదలబోమని మహిళలు స్పష్టం చేశారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా తమను నిండా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పొంగులేటి రాబోతున్నారని తెలుసుకున్న పోలీసులు నిరసనకారులపై విరుచుకుపడ్డారు. రాస్తారోకోను భగ్నం చేసేందుకు యత్నించారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న మంత్రి పొంగులేటిపై ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. 'అందరూ చచ్చాక వస్తే ఇంకా బాగుండేది కదా..' అంటూ నినాదాలు చేశారు. తమకు పూర్తి న్యాయం చేయకపోతే మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని డిమాండ్ చేశారు.



మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగు ఉధృతికి ధ్వంసమైన ఎన్‌హెచ్-365

5700 గ్రామాల్లో నీటి సరఫరా బంద్

- 600 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న పీఆర్ రోడ్లు
- కొట్టుకుపోయిన 150 ప్రధాన రహదారులు
- రోడ్ల మరమ్మతులకు 1000 కోట్లు అవసరం
- ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వర్షాలు,వరదలతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. 9 నెలలుగా మరమ్మతుకు నోచుకోని రోడ్లు వర్షాలతో 150ప్రాంతాల్లో కొట్టుకుపోయినట్టు, 500 రోడ్లు భారీగా దెబ్బతిన్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటి మరమ్మతులకు సుమారు రూ. 600 కోట్ల వరకు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. 117 గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతినడం వల్ల 80 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో 600 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని, వీటి మరమ్మతుకు రూ.421 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

బకాయిలు పెండింగ్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి రోడ్ల పునరుద్ధరణ పనులు జరగలేదు. తాత్కాలిక మరమ్మతు పనులు సైతం నిధుల కొరత పేరుతో అరకొరగా పూర్తిచేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో పునరుద్ధరణ పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. సుమారు రూ. 800 కోట్ల వరకు కాంట్రాక్టర్ల బకాయిలు పెండింగులో ఉన్నట్టు సమాచారం.

నిలిచిన నీటి సరఫరా

భారీ వర్షాలు, వరదల వల్ల 5,700 గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ సబ్‌స్టేషన్లలోకి నీరు చేరడంతో విద్యుత్తు నిలిపివేసిన కారణంగా పలు గ్రామాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నీటి పంపింగ్‌కి అవసరమైన విద్యుత్తు లేక 5700 ఆవాస గ్రామాలకు, వరదల వల్ల 1400 చోట్ల మిషన్ భగీరథ పైపులు దెబ్బతిన్నాయి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో తాగు నీటిని సరఫరా చేసిందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు వేల ఆవాసాల్లో మిషన్ భగీరథ సబ్ స్టేషన్లను పునరుద్ధరించి నీటి సరఫరా చేశారు.



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం ఇసోజిపేట శివారులో తెగిపోయిన కాలువ

రెండు రాష్ట్రాలకు వెంకయ్యనాయుడు విరాళం



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : తెలుగు రాష్ట్రాల్లో వరద కష్టాలపై మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచారం వ్యక్తంచేశారు. తన వ్యక్తిగత పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధులకు రూ.5 లక్షల చొప్పున సాయం అందించినట్టు సోమవారం ఆయన ప్రకటించారు. ప్రధాని మోదీకి ఫోన్‌చేసి తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితిని వివరించగా, రెండు రాష్ట్రాలకు సహాయ సహకారాలు అందజేస్తామని ప్రధాని హామీ ఇచ్చినట్టు చెప్పారు. తన కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరపున ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేసినట్టు వెల్లడించారు. తన కుమార్తె దీపావెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ నుంచి ఏపీ సీఎం సహాయ నిధికి రూ. 2.5 లక్షలు, తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.2.5 లక్షలు అందజేసినట్టు వెంకయ్యనాయుడు తెలిపారు.

వరద సహాయ చర్యల్లో పాల్గొందాం: జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులంతా సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావులు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.పనిగంటలతో సంబంధం లేకుండా నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు భరోసానివ్వాలని కోరారు.

విజయవాడ హైవేపై రాకపోకల పునరుద్ధరణ

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 2 : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65పై నందిగామ వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతాయని సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం తెలిపారు. గరికపాడు వద్ద పాత బ్రిడ్జి ధ్వంసమైనందున వాహనాలను కొత్త బ్రిడ్జిపై నుంచి మాత్రమే పంపిస్తున్నారని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణికులు గమనించి బ్రిడ్జిపై నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

తక్షణ సాయం 10 వేలు

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు
- పశువులకు 50 వేలు, గొర్రెలు, మేకలకు 5వేలు
- పంట నష్టం ఎకరాకు రూ.10 వేలు
- 2వేల కోట్ల తక్షణ సాయం కోసం కేంద్రానికి వినతి : సీఎం రేవంత్‌రెడ్డి
- సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో పర్యటన

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) సూర్యాపేట, /మామిళ్లగూడెం, సెప్టెంబర్ 2: వరద బాధితులకు తక్షణ సహాయం కింద ప్రతి కుటుంబానికి రూ.10వేలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున, పశువులకు రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.5వేలు, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు. రెండు రోజుల్లో మున్సిపల్,రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి, నష్టాన్ని అంచనావేసి పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోకలిసి సోమవారం సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా, మంచికంటినగర్‌లో బాధితులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ మున్నేరు వరదలో చిక్కుకొని సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

సూర్యాపేటలో సమీక్ష

అంతకుముందు సీఎం మార్గమధ్యంలో సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో ఆగారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి వరద పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.సాగర్ ఎడమ కాల్వ తెగడం వల్ల జరిగిన పంట నష్టంపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అన్నారు. తక్షణ సాయంగా కలెక్టర్‌కు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు జిల్లాల్లో సీఎం పర్యటనకు అడుగడుగునా నిరసన వ్యక్తమైంది.

మూడు రోజులుగా నిద్రలేదు!

రాష్ట్రంలో వర్షాలు,వరద పరిస్థితిపై మూడు రోజులుగా నిద్ర లేకుండా సమీక్ష చేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో రూ. 5వేల కోట్లు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని, కేంద్రం తక్షణం రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని కోరుతున్నామని అన్నారు. వరద పరిస్థితిపై ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాతోపాటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి వివరించి సాయం కోరానని తెలిపారు. సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు అందిస్తే ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వానికి సహకారం అందించాలని కోరారు.

పరిశీలనకు రావాలని ప్రధానికి వినతి

వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిచేశారు. వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు రావాలని ప్రధానిని కోరుతూ లేఖ రాయాలని సీఎస్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలు ఏర్పాటుచేసి 24 గంటలు పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి మూడు గంటలకో బులెటిన్ విడుదల చేయాలని సూచించారు.

పోలీసులకు ఎన్‌డీఆర్ఎఫ్ తరహా శిక్షణ

రాష్ట్రంలోని 8 బెటాలియన్లలో మూడో వంతు యువ పోలీసులకు ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో శిక్షణ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని ఆదేశించారు. 25 పెద్ద టవర్లు కూలిపోయినా విద్యుత్తు సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని అభినందించారు. కూలీలను గుర్తించి నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని ఆదేశించారు.



నిజామాబాద్ జిల్లా సిరికొండ శివారులో బైక్‌పై వాగు దాటే క్రమంలో కొట్టుకుపోతున్న నారాయణ



రంగారెడ్డి జిల్లా పరిధి మోకిలలో పెద్దఎత్తున వరద నీరు చేరడంతో ముంపునకు గురైన విల్లాలు

జలదిగ్బంధంలో ఆరు కోట్ల విల్లా

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం, మోకిలలోని విల్లాల్లోకి భారీగా వరద నీరు చేరింది. సుమారు 200 విల్లాలు ఉన్న గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టులోకి పెద్దఎత్తున నీరు వచ్చింది. వరద ప్రవాహానికి అడ్డుగా ఈ విల్లాలు నిర్మించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లే వీలులేకపోవడంతోనే విల్లాల్లోకి నీరు చేరిందని, ప్రతియేటా వానకాలంలో ఇది సర్వసాధారమైందని పేర్కొంటున్నారు. సుమారు రూ.6 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన విల్లాలు నీట మునగడంతో బాధితుల బాధ వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో విల్లాల్లోకి వరద రాకుండా చర్యలు తీసుకోవాలని విల్లాలవాసులు కోరుతున్నారు.

25 లక్షల ఎకరాల్లో పంట నష్టం!

- వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షాలతో దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వానలు కొనసాగుతుండటంతో నష్టం పెరిగే అవకాశం ఉన్నదన్న అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక నివేదికల ప్రకారం దాదాపు 12–15 లక్షల ఎకరాల పత్తి ,10 లక్షల ఎకరాల్లో వరి, 3 లక్షల ఎకరాల్లో మక్కజొన్నతోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నట్టుగా అధికారులు లెక్కలు వేస్తున్నారు.

జిల్లాల్లో పరిస్థితి ఇలా..

సూర్యాపేట జిల్లాలోని 19,696 ఎకరాల్లో, నల్లగొండ జిల్లాలోని ఆరు మండలాల్లోని 14 గ్రామాల పరిధిలో 648 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. రంగారెడ్డి జిల్లాలో పంట పొలాలు నీట మునగడంతో వేల ఎకరాల్లో నష్టం జరిగింది. మొయినాబాద్ మండలంలోని అండాపూర్ వద్ద ఈసీ వాగు పంట పొలాల నుంచి పారడంతో సుమారు 100 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వికారాబాద్ జిల్లాలో 1056 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1.5 లక్షల ఎకరాల్లో, సంగారెడ్డి జిల్లాలో 623 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.



మహబూబాబాద్ పట్టణ శివారులోని మున్నేరువాగు ఉధృతికి నేలవాలిన వరిపంట

జిందగీ
ఊపిరి
నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 3 సెప్టెంబర్ 2024
www.ntnews.com

గర్భధారణ... మహిళల జీవితంలో అతి మధురమైన ఘట్టం. తమకు పుట్టిన బిడ్డ పూర్తి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటారు. కానీ, కొంతమందికి దురదృష్టవశాత్తు అవయవ లోపాలు, వంశపారంపర్య వ్యాధులు తదితర సమస్యలతో కూడిన బిడ్డలు జన్మించడం జరుగుతుంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి బాధపడే దుస్థితి తలెత్తుతుంది. ఇలా పలురకాల అనారోగ్యాలు, లోపాలను గర్భంలో ఉన్నప్పుడే గుర్తించి వారికి తగిన చికిత్స అందించాలన్నా, లేదా నయంకాని సమస్యలు, లోపాలు ఉన్న పిండాన్ని గుర్తించి దాన్ని తొలగించాలన్నా... కడుపులో బిడ్డ ఊపిరి పోసుకోకముందే పిండం ఆరోగ్యస్థితిని గుర్తించాల్సి ఉంటుంది. గర్భంలో ఉన్న పిండం పూర్తి ఆరోగ్య స్థితిని క్షుణ్ణంగా తెలుసుకుని, అవసరమైన చికిత్స అందించడాన్నే ఫీటల్ మెడిసిన్ అంటారు. ఈ ఫీటల్ మెడిసిన్ అనేది ప్రతి గర్భిణికి అవసరమా, దీని ద్వారా ఏయే సమస్యలను గుర్తించవచ్చు, ఎలాంటి చికిత్స అందించవచ్చు, దీనివల్ల కలిగే లాభాలు మొదలైన అంశాల గురించి తెలుసుకుందాం..



అమ్మ కడుపులోనే.. సంరక్షణ

ఫీటల్ మెడిసిన్ కవచం

గర్భంలోనే పిండానికి చికిత్స అందించే విధానాన్ని ఫీటల్ మెడిసిన్‌గా పరిగణిస్తారు. ఇందులో భాగంగా శిశువు పిండదశలో ఉన్నప్పుడే స్క్రీనింగ్ చేస్తారు. దీంతో పుట్టబోయే శిశువుకు ఉండే సమస్యలు, భౌతిక లోపాలు, జన్యులోపాలు వంటివాటిని గుర్తించి నిర్ధారించవచ్చు. పది పదిహేనేండ్ల కింద ఈ విధమైన వెసులుబాటు లేదు. దీంతో చాలామంది తల్లిదండ్రులు బిడ్డ పుట్టిన తరువాత చికిత్స అందించడం, కొన్ని రకాల లోపాలతో జన్మించిన శిశువుల భవిష్యత్తు గురించి బాధపడటం జరిగిపోయేవి. కానీ, ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో పుట్టబోయే బిడ్డకు ఉన్న వ్యాధులు, లోపాలను గర్భంలో పిండదశలోనే గుర్తించవచ్చు. ఆ సమస్యలకు అవసరమైన చికిత్స కూడా పిండదశలోనే అందిస్తూ ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చే విధంగా చూడవచ్చు. పైగా తలసేమియా వంటి నయం చేయలేని సమస్యలు ఉన్న పిండాలను చట్టబద్ధంగా తొలగించే వెసులుబాటు ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, తమ ఆరోగ్యంతోపాటు పుట్టబోయే బిడ్డల ఆరోగ్యంపై దృష్టిపెడుతున్న తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతున్నది. దీంతో ఫీటల్ మెడిసిన్‌కు కూడా డిమాండ్ పెరుగుతున్నది.

స్కానింగ్ కీలకం

ఫీటల్ మెడిసిన్‌లో అల్ట్రా సౌండ్ స్కానింగ్ అనేది అత్యంత కీలకం. ఇందులో వచ్చే ఫలితాలు స్కానింగ్ జరిపే ఆపరేటర్‌పై ఆధారపడి ఉంటాయి. అంటే స్కానింగ్‌ను సరైన పద్ధతిలో జరపాల్సి ఉంటుంది. అందుకోసం నిష్ణాతుడైన ఆపరేటర్ ఉండాలి. సాధారణంగా డయాగ్నోసిస్ అనేది సమస్యను మాత్రమే గుర్తిస్తుంది. కాని ఫీటల్ మెడిసిన్‌లో డయాగ్నోసిస్‌తో పాటు అవసరమైన సలహాలు, సూచనలు, కౌన్సెలింగ్, క్లినికల్ పార్ట్ వంటివి కూడా ఇమిడి ఉంటాయి. స్కానింగ్ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి లో రిస్క్ గ్రూప్. రెండవది హై రిస్క్ గ్రూప్. వీరిలో కొన్ని స్కానింగ్ పరీక్షలు రెండు గ్రూపుల వారికి కూడా చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఎన్‌టీ, ఎనామలి స్కానింగ్‌లు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అవసరమవుతాయి.

లోరిస్క్‌గ్రూప్ వారికి పరీక్షలు

లోరిస్క్ గ్రూప్ వారికి 11– 13 వారాల్లో ఎన్‌టీ స్కాన్, 20–22 వారాల్లో మరో ఎన్‌టీ స్కాన్ చేయాల్సి ఉంటుంది. 11–13 వారాల్లో చేసే ఎన్‌టీ స్కాన్‌లో జెనెటికల్, క్రోమోజోమ్ లోపాలను గుర్తించవచ్చు.

రిస్క్‌గ్రూప్స్ అంటే?

రుమాటో ఆర్థరైటిస్, ఆటోఇమ్యూన్ డిజార్డర్, డయాబెటిస్, ఊబకాయం, బీపీ, మేనరికం వివాహాలు, ఆలస్యంగా పెళ్లవడం, గుండె సమస్యలు, జెనెటికల్ డిజార్డర్స్ తదితర సమస్యలు ఉన్న మహిళలు రిస్క్ గ్రూప్ కిందికి వస్తారు. వీరందరికీ ప్రతి స్కానింగ్ కూడా చాలా ముఖ్యం. ఆయా స్కానింగ్స్‌లో ఫీటల్ స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ రిస్క్ గ్రూప్ వారికి 7– 8 వారాల్లో వయబిలిటీ స్కాన్ కూడా అవసరం. వయబిలిటీ స్కాన్‌లో ఫీటల్ (పిండం) గుండె కొట్టుకోవడం, దాని ఎదుగుదల గురించి తెలుసుకుంటారు. అంతేకాకుండా పిండం గర్భసంచిలో ఉందా లేదా, ఫాలోపియన్ ట్యూబులో ఉందా కూడా ఈ పరీక్షతో నిర్ధారించుకోవచ్చు. పిండం కొన్నిసార్లు ట్యూబ్‌లో ఇరుక్కుపోతుంది. దీనివల్ల పిండంలో ఎదుగుదల లేక గర్భంలోనే శిశువు మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. పిండం గర్భసంచిలోనే ఉండాలి. అందుకే పిండం స్థానాన్ని తెలుసుకునేందుకు కూడా ఈ వయబిలిటీ స్కాన్ చాలా ఉపయోగపడుతుంది. రిస్క్ గ్రూప్ కిందికి వచ్చే మేనరికం వివాహాలు చేసుకున్న వారు గర్భం దాల్చే ముందు పరీక్ష చేయించుకోవడం ఉత్తమం.

న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ (ఎన్‌టీ) స్కాన్

పిండం 11–13 వారాల వయసప్పుడు చేసే స్కాన్‌ను న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ లేదా ఎన్‌టీ స్కాన్ అంటారు. ఇందులో పిండం మెడ వెనకాల చర్మం కింద ఉండే ఫ్లూయిడ్స్ మందాన్ని తెలుసుకోవచ్చు. సాధారణ శిశువులో మెడ వెనకాల ఉన్న చర్మం కింద ఫ్లూయిడ్ 2.3 నుంచి 2.4 మిల్లీమీటర్లు ఉంటుంది. అంతకంటే ఎక్కువ ఉంటే చర్మంపై వాపు వస్తుంది. ఈ వాపు గుండె సమస్య లేదా క్రోమోజోమ్ లోపం, జెనెటిక్ లోపం వల్ల వచ్చే అవకాశం ఉంటుంది. ఈ స్కాన్ ఆధారంగా శిశువులో క్రోమోజోమ్, జన్యులోపం, గుండె సమస్యలను గర్భంలో ఉన్నప్పుడే గుర్తిస్తారు. ఈ పరీక్ష ప్రతి ఒక్కరికీ అవసరం. అదే సమయంలో డబుల్ మార్కర్ బ్లడ్ టెస్ట్ కూడా చేస్తారు. ఇది క్రోమోజోముల లోపాల్ని 90 శాతం కచ్చితంగా గుర్తిస్తుంది. 70 శాతం వరకు స్ట్రక్చరల్ లోపాలు... అంటే పుట్టబోయే శిశువు భౌతిక లోపాలను సైతం గుర్తించవచ్చు.

అనామలీ స్కాన్ లేదా టిఫా స్కాన్

టిఫా స్కానింగ్ 20– 22 వారాలప్పుడు చేస్తారు. ఇది కూడా చాలా ముఖ్యమైన స్కానింగ్. ఇందులో పిండం తల నుంచి కాలు వరకు ప్రతి అవయవాన్నీ పరీక్షిస్తారు. మెదడు, తల, ముఖం, మెడ, వేళ్లు, వెన్నెముక, గుండె, ఊపిరితిత్తులు, కాళ్లు , చేతులు, మాయ, నీరు, కదలికలు, గర్భశాయ ముఖద్వారం కూడా చూడవచ్చు. అంతేకాకుండా ఈ స్కానింగ్‌లో సర్వైకల్ లెంగ్త్ కూడా తెలుసుకోవచ్చు. టిఫా, ఎన్‌టీ స్కాన్‌లు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా చేయాల్సిన పరీక్షలు.


క్లిష్ట పరిస్థితుల్లో చేయాల్సిన స్కాన్స్

ఫీటల్ ఇకో కార్డియోగ్రఫీ

ఫీటల్ ఇకో కార్డియోగ్రఫీ స్కానింగ్‌ను 22– 24 వారాల్లో జరుపుతారు. ఇందులో భాగంగా గర్భసంచిలో ఉన్న శిశువుకు గుండె పరీక్ష చేస్తారన్న మాట. ఇది తల్లిదండ్రుల ఆరోగ్య నేపథ్యం ఆధారంగా 16– 17 వారాల్లో కూడా ఈ ఫీటల్ ఇకో కార్డియోగ్రఫీ చేస్తారు. కుటుంబంలో ఎవరికైనా గుండె సమస్యలున్నా, తల్లి ఆటోఇమ్యూన్ రోగి అయినా, 11– 13 స్కాన్‌లో వాపు ఉన్నప్పుడు ఈ ఫీటల్ ఇకో కార్డియోగ్రఫీ అవసరం ఉంటుంది. కవలలు ఉన్నా కూడా ఈ పరీక్షకు వెళ్లాలి. ఈ పరీక్షలో గుండె పనితీరు, రక్తం గుండెలోపలికి, వెలుపలికి ప్రవహించడం (ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో), రక్త ప్రసరణలో ఏదైనా లీకేజ్, పంపింగ్ సామర్థ్యం వంటివి సవ్యంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తారు. భారతీయ చట్టాల ప్రకారం 24 వారాల్లోపు మాత్రమే అబార్షన్ చేయడానికి అవకాశం ఉంది. కాబట్టి, ఆలోపు మాత్రమే ఈ పరీక్షలన్నీ చేయాలి.

నాన్ ఇన్వేజివ్ ప్రీనేటల్ టెస్ట్ (ఎన్‌ఐపీటీ)

నాన్ ఇన్వేజివ్ ప్రీనేటల్ టెస్ట్‌ను 10 వారాల తర్వాత చేయవచ్చు. ఈ పరీక్ష ద్వారా పిండంలో డౌన్ సిండ్రోమ్‌ను 99 శాతం గుర్తించవచ్చు. ఒక వేళ డౌన్ సిండ్రోమ్ ఉన్నట్టు తేలితే అప్పుడు సమ



స్యను 100 శాతం కచ్చితంగా నిర్ధారించేందుకు ఇన్వేజివ్ టెస్ట్ అవసర పడుతుంది. ఎన్‌ఐపీటీలో భాగంగా తల్లి రక్తం తీసుకుని అందులోంచి పిండం డీఎన్‌ఏను వేరుచేస్తారు. ఆ తర్వాత 5 క్రోమోజోమ్‌ల పనితీరు అంటే... 21వ క్రోమోజోమ్, 18, 13వ క్రోమోజోమ్, ఎక్స్, వై కోమోజోమ్‌ల పనితీరుతోపాటు డౌన్ సిండ్రోమ్‌ను గుర్తిస్తారు. డౌన్ సిండ్రోమ్ మానసిక రుగ్మతలైన బుద్ధిమాంద్యం, మెదడులో ఎదుగుదల లేకపోవడం వంటి లోపాల కిందికి వస్తుంది. అయితే ఈ పరీక్షలో సమస్యను 99 శాతం వరకు మాత్రమే గుర్తించే వీలు ఉంటుంది.

ఇన్వేజివ్ టెస్ట్

ఎన్‌ఐపీటీలో ఏదైనా సమస్యను గుర్తించినప్పుడు ఇన్వేజివ్ టెస్ట్ చేయాలి. దీనిద్వారా సమస్యను 100 శాతం కచ్చితంగా నిర్ధారించవచ్చు. ఈ పరీక్షలో భాగంగా సూది సాయంతో మాయలోని 'విలై'ని తీసి ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఇన్వేజివ్ టెస్ట్ రెండు రకాలు. ఒకటి కొరియోనిక్ విల్లోస్ సాంప్లింగ్. ఇది 11–14 వారాల్లో చేస్తారు. రెండోదైన ఆమ్నియోసెంటెసిస్ టెస్ట్‌ను 16 నుంచి 20 వారాల్లో చేస్తారు. ఈ పరీక్షల ద్వారా పిండం గుండెలో ఉన్న లోపాలు, రంధ్రం వంటి సమస్యలే కాకుండా భౌతిక పరమైన ఆకృతి లోపాలు, తలసేమియా వంటి రక్త సంబంధిత లోపాలనూ గుర్తించవచ్చు. అంతేకాకుండా జెనెటిక్ లేదా స్ట్రక్చరల్ లోపాలను కూడా నిర్ధారించవచ్చు. ఈ పరీక్ష ద్వారా గర్భం ఉంచాలా లేక తొలగించాలా అనేది నిర్ణయిస్తారు. పై స్కానింగ్, టెస్టులన్నీ 24 వారాల్లోపే పూర్తి చేయాల్సి ఉంటుంది.

ట్విన్స్ క్లినిక్ లేదా మల్టిపుల్ ప్రెగ్నెన్సీ

ముగ్గురు లేదా నలుగురు శిశువులు ఉన్నవారిని ట్విన్స్‌కు (ఇద్దరికి) కన్వర్ట్ చేస్తారు. దీనినే ఫీటల్ రిడక్షన్ అంటారు. గర్భం ధరించిన 11– 13 వారాల్లో అంటే ఎన్‌టీ స్కాన్ సమయంలోనే ఫీటల్ రిడక్షన్ చేయాల్సి ఉంటుంది. ఐడెంటికల్, నాన్ ఐడెంటికల్ ట్విన్స్‌కి కచ్చితంగా ఫీటల్ మెడిసన్ అవసరం. లేజర్ సర్జరీతో మాయను వేరుచేస్తారు. దీనిని లేజర్ థెరపీ అంటారు. ప్రతి 2 వారాలకు స్కానింగ్ అవసరం.

బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్

సాధారణంగా తల్లిది నెగెటివ్ బ్లడ్‌గ్రూప్ ఉన్నప్పుడు శిశువు పాజిటివ్ ఉంటే అప్పుడు శిశువు ప్రాణాలకే ప్రమాదకరం. ఇలాంటి శిశువుకు ఇంట్రాయూటరైన్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేయవచ్చు. అంటే గర్భంలో ఉన్నప్పుడే పిండానికి రక్తం ఎక్కించవచ్చన్నమాట. ఇది 95 శాతం వరకు ఫలితాలను ఇస్తుంది.

గ్రోత్, డాప్లర్ టెస్ట్

గ్రోత్, డాప్లర్ టెస్టులను 7 నెలల సమయంలో చేయాల్సి ఉంటుంది. గర్భంలో శిశువు ఎదుగుదల, మాయ పెరగకపోవడం, రక్త ప్రసరణ లోపాలు వంటివి గుర్తిస్తే వెంటనే ప్రసవం చేయాలి. ప్రస్తుతం గర్భంలో ఉన్న పిండానికి చికిత్స అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో గర్భంలో ఉన్న పిండానికి ఫీటల్ సర్జరీ కూడా సాధ్యమవుతుంది. ప్రస్తుతం ఈ పరిజ్ఞానం విదేశాలో ఆచరణలో ఉంది. త్వరలోనే భారత్‌లో కూడా అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

... మహేశ్వర్‌రావు బండారి



డాక్టర్ గౌరి వినాయక్ ధమంగౌకర్
ఎంబీబీఎస్, ఎంఎస్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజి
ఫెల్లో ఇన్ ఫీటల్ మెడిసిన్–మెడిస్కాన్(చెన్నై)
ఫీటల్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్
రెయిన్‌బో హాస్పిటల్, హైదరాబాద్

హ్యాండ్ ఫుట్ అండ్ మౌత్.. భయం వద్దు

మా పాప వయసు పద్దెనిమిది నెలలు. తనకు నీటితో నిండిన గుల్లలు వచ్చాయి. మూడు రోజుల నుంచి జ్వరం కూడా ఉంది. అమ్మవారు వచ్చిందని అనుకున్నాం. జ్వరం తగ్గింది. కానీ, పాప ఏమీ తినడం లేదు. మా బాబు వయసు ఆరు సంవత్సరాలు. పాపకంటే ముందుగా బాబులో ఈ లక్షణాలు కొద్దిగా కనిపించాయి. తను అంతగా ఇబ్బంది పడలేదు. ఇది చికెన్‌పాక్స్ లాంటి వ్యాధేనా? పాఠశాలలో పిల్లలందరికీ ఇది వస్తున్నది. ఆందోళనగా ఉంది. సలహా ఇవ్వండి.

• రేణుక, పద్మారావు నగర్, హైదరాబాద్

పిల్లల పెంపకం



మీ బిడ్డకు జ్వరం వచ్చింది. కాళ్ల మీద చేతుల మీద గుల్లల్లాగా అయ్యాయంటున్నారు. అలాగే నాలుక మీద కూడా గుల్లలు వచ్చాయంటున్నారు. ఈ లక్షణాలను బట్టి దీనిని హ్యాండ్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ అనిపిస్తుంది. వర్షాలు మొదలైన తర్వాత చాలామంది పిల్లలు ఈ వ్యాధి బారినపడ్డారు. చిన్నపిల్లల్లో దీని ప్రభావం ఎక్కువ. ఇది మీ బాబు ద్వారా పాపకు సోకి ఉండొచ్చు. ఈ సమస్యల నుంచి బయటపడాలంటే చర్మం మీద ఉన్న రాషెస్‌కి లోషన్ రాయాలి. జ్వరం సిరప్ (శరీర బరువును బట్టి) ఇవ్వాలి. కాళ్లు, చేతులపై ఉన్నట్టు నోటిలో, ఇంకా లోపల కూడా గుల్లలు ఉంటాయి. వీటి వల్ల అల్సర్ సమస్య ఉంటుంది. ఆహారం మింగలేరు. నోటి నుంచి లాలాజలం కారుతుంది. జ్వరానికి సిరప్ ఇచ్చిన తర్వాత గొంతునొప్పి తక్కువగా ఉంటుంది. అప్పుడు ద్రవ ఆహారం ఇవ్వాలి. ఓఆర్ఎస్, కొబ్బరినీళ్లు, సగ్గుబియ్యం జావ తాగించాలి. ఇలా ఆరోగ్యకరమైన పానీయాలు ఇవ్వాలి. ఎక్కువ వేడి, బాగా చల్లగా ఉన్న ద్రవాలు ఇవ్వకూడదు. కొంతమంది పిల్లలు నీళ్లు తక్కువగా తాగుతారు. కాబట్టి డీహైడ్రేషన్ బారినపడతారు. వీళ్లకు మూత్రం కూడా రాదు. ఇలాంటి స్థితిలో ఉంటే హాస్పిటల్‌లో చేర్చి, సెలైన్ ఎక్కించాలి. ఇప్పుడంత ప్రమాదకరంగా లేదు. కాబట్టి జ్వరానికి, నొప్పులకు మందులు ఇస్తే సరిపోతుంది. అంతగా ఆందోళన చెందాల్సిన పనిలేదు.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

కొలెస్ట్రాల్‌ను కరిగించే వెల్లుల్లి

అపసవ్య జీవనశైలి మన శరీరంలో ఎన్నో అవయవాలపై దుష్ప్రభావం చూపుతుంది. డయాబెటిస్ మొదలుకుని శరీరంలో అధిక కొలెస్ట్రాల్ స్థాయుల వరకు వివిధ రకాలైన సమస్యలు అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా విజృంభిస్తున్నాయి. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగిపోయిందంటే మాత్రం గుండెపోటు, స్ట్రోక్ ముప్పు పెరిగిపోతుంది. కాబట్టి, కొలెస్ట్రాల్ స్థాయులను నియంత్రణలో ఉంచుకోవాలంటే మొట్టమొదట ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి.

శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించుకోవడానికి సరైన పదార్థాలను ఆహారంలో భాగం చేసుకొని, వాటిని సుదీర్ఘకాలం పాటు కొనసాగిస్తూ ఉండాలి. దీనికోసం కొన్ని రకాలైన కూరగాయలు, ఆయుర్వేద గుణాలున్న పదార్థాలను ఎంచుకోవాలి. వీటిలో వెల్లుల్లి ఒకటి. పచ్చి వెల్లుల్లి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ట్రైగ్లిజరైడ్లను పెంచుతుంది. అంతేకాదు అధిక రక్తపోటు నియంత్రణలో కూడా వెల్లుల్లి సమర్థంగా పనిచేస్తుంది.



ఎలా తినాలి?

అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవాళ్లు పరగడుపునే పచ్చి వెల్లుల్లిపాయ తినడం మంచి ప్రయోజనాలను ఇస్తుంది. దీన్ని చప్పరించినా, నమిలినా ఎలా తిన్నా మంచిదే. వగరుగా ఉంటుంది కాబట్టి, వెల్లుల్లి తినగానే కొన్ని నీళ్లు తాగితే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ పీడ విరగడైపోతుంది. వెల్లుల్లిలో అలిసిన్ అనే మూలకం ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్తాన్ని పలుచన చేస్తుంది. అలా రక్తసరఫరా మెరుగుపడుతుంది. గుండె మీద ఒత్తిడి తగ్గిపోతుంది. అంటే గుండెపోటు, పక్షవాతం ముప్పు కూడా తగ్గిపోయినట్టే కదా!

తేనెతో వెల్లుల్లి



వగరుగా ఉంటుంది కాబట్టి పచ్చి వెల్లుల్లి తినాలని అనుకునే వాళ్లు... ఓ వెల్లుల్లి రెమ్మను తీసుకోవాలి. దాన్ని తేనెలో ముంచి తినేయాలి. లేదంటే వెల్లుల్లిని ముక్కలుగా చేసుకుని, తేనెతో కలుపుకొని తిన్నా కూడా మేలుచేస్తుంది. ఈ మిశ్రమాన్ని ఓ వారం రోజులు నిల్వ చేసుకోవచ్చు కూడా. వారమంతా తినడానికి వీలుంటుంది. వెల్లుల్లిని పచ్చళ్లు, ఊరగాయల్లో జోడించుకోవడమూ మంచి ఆలోచనే.

శాకాహారులకూ.. కొలాజెన్

చర్మం, ఎముకలు, ఇతర కణజాలాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచే ప్రొటీన్ కొలాజెన్. ఇది మన శరీరంలో సహజంగానే ఉత్పత్తి అవుతుంది. కానీ, మాంసాహారం దీని ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. కాబట్టి, మాంసం, ఎముకల పులుసు తింటేనే శరీరంలో కొలాజెన్ స్థాయులు పెరుగుతాయని చాలామంది నమ్ముతారు. శాకాహారం నుంచి కూడా శరీరంలో కొలాజెన్ ఉత్పత్తికి అవసరమైన పోషకాలు లభిస్తాయని ఇటీవలి అధ్యయనాల్లో తేలింది.

మొక్కల నుంచి వచ్చే ఆహారం నుంచి కూడా శరీరంలో కొలాజెన్ స్థాయులు మెరుగుపడతాయి అంటున్నారు పోషకాహార నిపుణులు. ఇక కొలాజెన్ మాంసాహారంలోనే ఉంటుందనేది అపోహ మాత్రమే. దీనిని పప్పుధాన్యాలు, బాదం, జీడిపప్పు లాంటి ఎండుఫలాలు, గింజలు లాంటి మొక్కల నుంచి వచ్చే పదార్థాల నుంచి కూడా పొందవచ్చు. పైగా జంతు ఆహారం కంటే కొలాజెన్ ఉత్పత్తికి మొక్కల నుంచి వచ్చే ఆహారమే మంచిదనేది పోషకాహార నిపుణుల మాట. జంతుమాంసం (రెడ్ మీట్)లో ఉండే అడ్వాన్స్‌డ్ గ్లైకేషన్ ఎండ్ ప్రాడక్ట్స్ (ఏజీఈస్) కొలాజెన్‌ను ధ్వంసం చేస్తాయట. అదే మొక్కల ఆధారిత ఆహారాలు యాంటి ఆక్సిడెంట్లతో సమృద్ధంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొలాజెన్ క్షీణించకుండా చూడటమే కాకుండా, ఆరోగ్యకరమైన కొలాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. కొలాజెన్ ఉత్పత్తికి అవసరమైన మరో పోషకపదార్థం విటమిన్ సి. ఇది కొలాజెన్ శరీర కణాల్లో కలిసిపోవడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. సిట్రస్ జాతి పండ్లు, క్యాప్సికం, ఆకుకూరలు విటమిన్ సి గనులు. కొలాజెన్ ఉత్పత్తి కోసం శాకాహారులు, వీగన్‌లకు ఈ తరహా ఆహారం మేలుచేస్తుంది.



ఆహారంతోపాటు జీవనశైలి మార్పులు కూడా కొలాజెన్ ఉత్పత్తిలో ప్రభావం చూపుతాయి. ధూమపానం, ఎండలో గడపడం, అధిక చక్కెరలు, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక ఒత్తిడి స్థాయులు కూడా శరీరంలో కొలాజెన్ క్షీణతకు కారణమవుతాయి. మరోవైపు, బరువును తట్టుకునే వ్యాయామాలు కొలాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. చర్మం, ఎముకలు బలంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా అరెస్ట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌ను, ఆయన సహచరులు కొందరిని ఈడీ సోమవారం అరెస్ట్ చేసింది. ఉదయం 6 గంటలకే ఎమ్మెల్యే నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తాము అడిగిన కొన్ని ప్రశ్నలకు ఎమ్మెల్యే అస్పష్ట సమాధానాలు ఇవ్వడంతో అరెస్ట్ చేశామని ఈడీ పేర్కొంది. అమానతుల్లా ఢిల్లీ వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఉన్నప్పుడు (2018-2022) చట్టవిరుద్ధంగా సిబ్బందిని నియమించారని, బోర్డు ఆస్తులను పారదర్శకత లేకుండా లీజుకు ఇచ్చారని ఈడీ ఆరోపించింది.

బిభవ్‌కుమార్‌కు బెయిల్

రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్ కుమార్‌కు సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే, కేసులో సాక్షులందర్నీ విచారించే వరకు ఢిల్లీ సీఎం నివాసంలోకి ప్రవేశించరాదని బిభవ్‌పై నిషేధం విధించింది. ఢిల్లీ సీఎం కార్యాలయంలో ఎలాంటి బాధ్యతలు తీసుకోరాదని, కేజ్రీవాల్ సహాయకుడిగా తిరిగి విధుల్లో చేరకూడదని ఆదేశించింది.

23వ న్యాయ సంఘం ఏర్పాటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశంలో 23వ న్యాయ సంఘాన్ని నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 22వ న్యాయ సంఘం పదవీకాలం ఆగస్టు 31తో ముగిసిన నేపథ్యంలో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసింది. 23వ న్యాయ సంఘానికి పూర్తికాల చైర్మన్‌తో పాటు నలుగురు పూర్తికాల సభ్యులు, ఒక సభ్య కార్యదర్శి ఉండనున్నారు. న్యాయ వ్యవహారాల విభాగం కార్యదర్శి, శాసన విభాగం కార్యదర్శి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. న్యాయ సంఘంలో ఐదుగురికి మించకుండా పార్ట్‌టైమ్ సభ్యులు ఉంటారు.

రేపిస్టులకు ఉరిశిక్ష!

'అపరాజిత' పేరుతో బెంగాల్ సర్కారు బిల్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 2: మహిళలపై రేప్, హత్యలకు పాల్పడేవారికి ఉరిశిక్ష విధించేందుకు ఉద్దేశించిన 'అపరాజిత మహిళా & శిశు బిల్లు'ను పశ్చిమ బెంగాల్ శాసన సభ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు సోమవారం తెలిపాయి. కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారంపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. మంగళవారం సభలో ప్రవేశపెట్టనుంది.

ఆర్‌జీ కర్ దవాఖాన మాజీ ప్రిన్సిపాల్ అరెస్ట్

కోల్‌కతా: ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్‌ను సీబీఐ సోమవారం అరెస్ట్ చేసింది. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన కేసులో ఈ చర్య తీసుకుంది. ఈ దవాఖానలో ఆగస్టు 9న ఓ ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో డాక్టర్ సందీప్‌ను సీబీఐ 15వ రోజు ప్రశ్నించిన తర్వాత కోల్‌కతాలోని నిజాం ప్యాలెస్ ఆఫీస్‌కు తీసుకెళ్లింది. అక్కడ ఆయనను అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది. ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు కోసం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. అయితే కలకత్తా హైకోర్టు ఈ దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించింది.

ముస్లింలపై బీజేపీ ఎమ్మెల్యే రాణే విద్వేష వ్యాఖ్యలు

ముంబై, సెప్టెంబర్ 2: మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే నితేశ్ రాణే ముస్లింలపై విద్వేషాన్ని వెళ్లగక్కారు. 'రామ్‌గిరి మహారాజ్‌కి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే, మసీదుల్లో చొరబడి, ఒక్కొక్కరి సంగతి చూస్తాం. జాగ్రత్త..!' అంటూ బెదిరింపులకు దిగారు. ఆదివారం (సెప్టెంబర్ 1) అహ్మద్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రెండు సభల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు ఓ వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. గత నెల ఆగస్టు 14న నాసిక్‌లో రాణే చేసిన విద్వేష ప్రసంగం కారణంగా ఛత్రపతి శంభాజీ నగర్‌లో ఉద్రిక్తతలు తలెత్తాయి. దీనిపై ముంబై కాంగ్రెస్ అధ్యక్షుడు గైక్వాడ్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో, అహ్మద్‌నగర్ పోలీసులు రాణేపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు.

'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీం ఫైర్

నిందితుడైనంత మాత్రాన ఇల్లు కూల్చేస్తారా?

దోషిగా తేలినా కూడా కూల్చేయడం కుదరదు

- అక్రమ కట్టడమైనా చట్టాన్ని పాటించాల్సిందే
- ఈ అంశంపై మార్గదర్శకాలు జారీ చేస్తాం
- సలహాలు ఇవ్వాలని లాయర్లకు కోర్టు సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఇండ్లను కూల్చేస్తూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితుడిగా ఉన్నంత మాత్రాన ఇల్లు ఎలా కూల్చేస్తారని ప్రశ్నించింది. 2022లో ఢిల్లీలోని జహంగీర్‌పురిలో పలు ఇండ్ల కూల్చివేతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌తో పాటు అల్లర్ల కేసుల్లో నిందితుల ఆస్తులను కూల్చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. 'కేవలం నిందితుడు అయినంత మాత్రాన ఇల్లు ఎలా కుల్చేస్తారు? దోషిగా తేలినప్పటికీ కూల్చేయడం కుదరదు' అని జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ అక్రమ కట్టడమే అయినప్పటికీ చట్ట ప్రకారం నిర్దిష్ట ప్రక్రియను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలను కోర్టు రక్షించబోదని, ఇందుకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. 'ఓ తండ్రికి మాట వినని కొడుకు ఉండవచ్చు. ఈ కారణంతో ఇల్లు కూల్చేయడం సరైన పద్ధతి కాదు' అని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు.



మార్గదర్శకాలు రూపొందిస్తాం: సుప్రీంకోర్టు

ఈ విషయానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని, ఇవి అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. సరైన మార్గదర్శకాలు రూపొందించేందుకు గానూ సీనియర్ న్యాయవాది నచికేత జోషికి ప్రతిపాదనలు అందజేయాలని న్యాయవాదులకు సూచించింది. న్యాయవాదులతో సమన్వయం చేసుకొని ప్రతిపాదనలు కోర్టుకు సమర్పించాలని నచికేత జోషిని కోరింది. 'ఈ సమస్యను దేశవ్యాప్తంగా పరిష్కరించేందుకు ప్రయత్నిద్దాం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కోర్టును యుద్ధక్షేత్రంగా మార్చొద్దు

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. కేవలం క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉన్నాడనే కారణంతో ఇల్లు కూల్చడం లేదని తెలిపారు. మున్సిపల్ లేదా స్థానిక సంస్థల చట్టాలను ఉల్లంఘించి నిర్మించిన వాటిని మాత్రమే కూల్చేస్తున్నట్టు చెప్పారు. ముందుగా నోటీసులు జారీ చేసిన తర్వాతే కూల్చివేతలు జరిగినట్టు పేర్కొన్నారు. జమాతే ఉలేమా ఇ హింద్ తరపు న్యాయవాది దుశ్యంత్ దవే వాదిస్తూ.. 2022 ఏప్రిల్‌లో అల్లర్లు జరిగిన వెంటనే ఢిల్లీ జహంగిర్‌పురిలో అల్లర్లలో పాల్గొన్నారనే ఆరోపణలతో అనేక మందివి ఇండ్లు కూల్చేశారని పేర్కొన్నారు. మరో న్యాయవాది చందర్ ఉదయ్ సింగ్ వాదిస్తూ.. ఉదయ్‌పూర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి కుమారుడు ఓ నేరంలో నిందితుడిగా ఉన్నందుకు ఆ ఇంటిని కూల్చేశారని తెలిపారు. విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు గదిని యుద్ధక్షేత్రంగా మార్చొద్దని న్యాయవాదులను నిలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది.



బందీల విడుదలకు హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వేలాది మంది పౌరులు ఆదివారం ఇజ్రాయెల్ వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించారు.

వారానికి 24 గంటలే పని

- కెనడాలో ఆఫ్-క్యాంపస్ ఉద్యోగాలపై పరిమితి
- భారతీయ విద్యార్థులకు పెరగనున్న ఆర్థిక కష్టాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లిన విదేశీ విద్యార్థులకు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఇప్పటికే వలస (ఇమ్మిగ్రేషన్) విధానాలను మార్చడంతోపాటు స్టడీ పర్మిట్లపై పరిమితి విధించాలని, శాశ్వత నివాస దరఖాస్తుల (పర్మినెంట్ రెసిడెన్సీ నామినేషన్ల) సంఖ్యను కుదించాలని నిర్ణయించడం ద్వారా ఎంతో మంది విదేశీ విద్యార్థులను కష్టాల్లోకి నెట్టిన కెనడా ప్రభుత్వం.. తాజాగా ఆఫ్-క్యాంపస్ జాబ్స్‌పై పరిమితి విధించింది. ఇకపై విదేశీ విద్యార్థులు తమ జీవన ఖర్చుల కోసం క్యాంపస్ వెలుపల వారానికి 24 గంటలకు మించి పనిచేయకూడదన్న నిబంధనను ప్రవేశపెట్టింది. ఈ నెల నుంచే ఈ నిబంధనను అమల్లోకి తెచ్చింది. దీంతో లక్షల మంది విదేశీ విద్యార్థులకు, అత్యధికంగా భారతీయ విద్యార్థులకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తనున్నాయి. వాస్తవానికి గతంలో కెనడాలో విదేశీ విద్యార్థులు వారానికి 20 గంటలు మాత్రమే క్యాంపస్ వెలుపల పనులు చేసుకునేందుకు వీలుండేది. కానీ, కొవిడ్ సంక్షోభ సమయంలో అక్కడ కార్మికుల కొరత ఏర్పడటంతో ఈ నిబంధనను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ వెసులుబాటు గడువు ఈ ఏడాది ఏప్రిల్ 30తో ముగియడంతో ఇప్పుడు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు.



కూలిన మిగ్-29.. పైలట్ సురక్షితం

జైపూర్: ఐఏఎఫ్ మిగ్-29 యుద్ధ విమానం సోమవారం రాజస్థాన్‌లోని బామర్‌లో కూలిపోయింది. కూలిపోవడానికి ముందే పైలట్ సురక్షితంగా బయటపడగలిగారు. బామర్ సెక్టార్‌లోని ఐఏఎఫ్ బేస్ నుంచి శిక్షణ కోసం బయల్దేరిన ఈ విమానంలో సాంకేతిక లోపం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర్లాయ్ ప్రాంతంలో కూలిన వెంటనే మంటల్లో చిక్కుకున్నట్లు చెప్పారు. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

వ్యవసాయ రంగంలో 7 కొత్త పథకాలు

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ఏడు కొత్త కార్యక్రమాలను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు రూ.14 వేల కోట్లతో ఈ కార్యక్రమాలను అమలు చేయనుంది. ఇందులో డిజిటల్ వ్యవసాయ మిషన్‌కు రూ.2,817 కోట్లు, క్రాప్ సైన్స్‌కు రూ.3,979 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. ముంబై-ఇండోర్ మధ్య రూ.18,036 కోట్లతో 309 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. గుజరాత్‌లోని సనంద్‌లో రూ.3,307లో సెమికండక్టర్ల తయారీ యూనిట్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది.


కీళ్ల వాతానికి హైడ్రోజెల్

చైనా శాస్త్రవేత్తల అభివృద్ధి

బీజింగ్, సెప్టెంబర్ 2: కీళ్ల నొప్పులు (ఆర్థరైటిస్) లేదా కీళ్లవాతం అనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక మందిని బాధిస్తున్న ఆరోగ్య సమస్య. ముఖ్యంగా 40 ఏండ్లు దాటిన వాళ్లలో ఈ సమస్య ఎక్కువగా కనపడుతున్నది. కీళ్లవాతంలో 'ఆస్టియో ఆర్థరైటిస్' అనే ఆరోగ్య సమస్యకు పరిష్కారం చూపే అడ్వాన్స్‌డ్ లూబ్రికెంట్‌ను చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. తాము తయారుచేసిన హైడ్రోజెల్.. దెబ్బతిన్న మృదులాస్థి (ఎముకల్లోని గుజ్జు)ని టార్గెట్ చేసుకొని పనిచేస్తుందని, దానిని తిరిగి పునరుద్ధరణ చేసే విధంగా పనిచేస్తుందని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. హైడ్రోజెల్ వాడటం ద్వారా ఆర్థరైటిస్ వ్యాధి తీవ్రం కాకుండా అడ్డుకోవచ్చునని సైంటిస్టుల అధ్యయనం పేర్కొన్నది. షాంఘైలోని అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు దీనిని తయారుచేశారు.

పొడవాటి వ్యక్తులకు క్యాన్సర్ ముప్పు

న్యూఢిల్లీ: పొట్టిగా ఉండేవారితో పోలిస్తే కాస్తంత పొడవు ఉంటే ఆ ఆత్మవిశ్వాసమే వేరుగా ఉంటుంది. అయితే పొడవు మన పాలిట శాపంగా మారుతుందని తాజా అధ్యయనం ఒకటి స్పష్టం చేసింది. ఎత్తు ఎక్కువ ఉన్నవారికి క్యాన్సర్ ముప్పు అధికమని 'యూకే మిలియన్ విమెన్ స్టడీ' తేల్చింది. తాము అధ్యయనం చేసిన 17 మంది పొడుగు వ్యక్తులలో 15 మంది క్యాన్సర్ బాధితులేనని తెలిపింది. పొట్టి వారితో పోలిస్తే పొడవుగా ఉన్న వారు త్వరగా క్యాన్సర్ బారినపడతారని అధ్యయనం పేర్కొన్నది. పొడుగు వ్యక్తులు పాంక్రియాస్, ఓవరీ, ప్రొస్టేట్, కిడ్నీ, స్కిన్ (మెలానోమా), బ్రెస్ట్ (మెనోపాజ్ ముందు, వెనక), పెద్దపేగు, యుటెరస్ (ఎండోమెట్రియం) వంటి క్యాన్సర్ల బారినపడే అవకాశం ఉన్నదని వరల్డ్ క్యాన్సర్ రిసెర్చ్ ఫండ్ తెలిపింది. పెరిగే ప్రతి 10 సెంటీమీటర్ల ఎత్తుకు క్యాన్సర్ వచ్చే ముప్పు 16 శాతం ఉంటుందని వివరించింది.



ఎత్తుకు క్యాన్సర్‌కు సంబంధం ఏమిటి?

ఎత్తు ఎక్కువగా ఉన్న వారిలో కణాలు పెద్ద సంఖ్య లో ఉంటాయి. క్యాన్సర్ ముప్పుకు ఇది కూడా ఒక కారణం. పొడవు ఎక్కువగా ఉన్న వ్యక్తులలో ఎక్కువ కణాలతో పొడవాటి పెద్ద పేగు ఉంటుంది. ఇది పెద్ద పేగు క్యాన్సర్‌కు కారణం అవుతుంది. ఒక కణం విభజనకు గురై కొత్త కణం తయారైనప్పుడు ఏర్పడే జన్యువులు దెబ్బతినడం వల్ల కూడా క్యాన్సర్ అభివృద్ధి చెందుతుంది. ఇలా ఎక్కువ సార్లు జన్యువులు దెబ్బతింటే క్యాన్సర్ రిస్క్ కూడా ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కొన్ని పరిశోధనల ప్రకారం పొడవాటి వ్యక్తులలో పెద్ద మొత్తంలో కణాలు క్యాన్సర్ అభివృద్ధికి కారకంగా మారతాయి. ఇన్సులిన్ లాంటి గ్రోత్ ఫ్యాక్టర్ 1 (ఐజీఎఫ్-1) హార్మోన్ వల్ల కూడా క్యాన్సర్ బారినపడే అవకాశం ఉన్నది. అయితే, ఐజీఎఫ్-1 స్థాయిలు సగటు కంటే ఎక్కువగా ఉంటే ప్రొస్టేట్, రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.


హారిస్‌కు ట్రంప్ సతీమణి మద్దతు!

వాషింగ్టన్, సెప్టెంబర్ 2: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ టంప్‌ను ఆయన సతీమణి మెలానియా ట్రంప్ ఇష్టపడటం లేదు. దేశాధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిని కమల హారిస్ గెలవాలని ఆమె కోరుకుంటున్నారు. కమలకు ఆమె రహస్యంగా మద్దతిస్తున్నారు. ట్రంప్ మాజీ వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ ఆంథోనీ స్కరముచి ఈ వివరాలను తెలిపారు. హ్యారిస్ విజయం గురించి అత్యంత ఉత్సాహంతో ఎదురు చూస్తున్న వ్యక్తి మెలానియా అని చెప్పారు. ట్రంప్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మెలానియా సాదాసీదాగా పాల్గొంటున్న నేపథ్యంలో స్కరముచి ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కోసం ఎన్నికల నిధుల సేకరణలో మెలానియా తక్కువగా పాల్గొన్నారు. స్కరముచి ఆరోపణలను డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు.

కర్ణాటక సీఎం రేసులోకి కొత్త ఫేసు

- ముఖ్యమంత్రి కావాలని ఉందన్న కాంగ్రెస్ సీనియర్ నేత దేశ్‌పాండే
- ఇప్పటికే సీఎం పీఠంపై కన్నేసిన డీకే శివకుమార్, పరమేశ్వర

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్య దిగిపోగానే ఆ పీఠాన్ని అందుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు డిప్యూటీ సీఎం శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర సీఎం పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుండగా ఇప్పుడు మరో సీనియర్ నేత ఆర్వీ దేశ్‌పాండే కూడా రేసులోకి వచ్చారు. మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మంత్రి పదవులను నిర్వర్తించి అలిసిపోయాను. ఇక నేను ముఖ్యమంత్రిని కావాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. తాను సిద్ధరామయ్య కంటే రెండేండ్లే పెద్దవాడినని, కాంగ్రెస్ అధిష్ఠానం, సిద్ధరామయ్య అంగీకరిస్తే సీఎం అవుతానని ప్రకటించారు. దీని ద్వారా సిద్ధరామయ్యకు పదవీగండం పొంచి ఉందనే విషయాన్ని దేశ్‌పాండే చెప్పకనే చెప్పారు. ముడా స్కామ్‌లో సిద్ధరామయ్య ప్రమేయం లేదని చెప్తూనే దేశ్‌పాండే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు వచ్చినందుకు రామకృష్ణ హెగ్డే సీఎంగా రాజీనామా చేశారని, కానీ ఇప్పుడు విలువలతో కూడిన రాజకీయాలు లేవని వ్యాఖ్యానించారు.



దేశ్‌పాండే

ముడా స్కామ్ బయటపెట్టిన ఆర్టీఐ కార్యకర్తకు బెదిరింపులు

ముడా (మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) స్కామ్‌లో సీఎం సిద్ధరామయ్య అక్రమాలపై సంచలన విషయాలు బయటపెట్టిన ఆర్టీఐ కార్యకర్త ఎన్ గంగరాజు, తనకు ప్రాణహాని ఉందని మీడియా ముఖంగా భయాందోళన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు తనను, తన కుటుంబ సభ్యుల్ని బెదిరిస్తున్నారని సోమవారం విలేకర్లతో చెప్పారు. రియల్ మాఫియా నుంచి బెదిరింపులు వస్తున్నాయని, తనకు భద్రత కల్పించాలంటూ సీఎం కార్యాలయానికి లేఖ రాసినట్టు తెలిపారు. దీంతో మైసూర్‌లోని ఆయన ఇంటివద్ద కర్ణాటక పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు.

సిద్ధరామయ్య సోషల్ మీడియా ఖర్చు నెలకు రూ.54 లక్షలు

ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం

బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారిక, వ్యక్తిగత సామాజిక మాధ్యమాల ఖాతాల నిర్వహణ కోసం నెలకు రూ.53.9 లక్షలు (18 శాతం జీఎస్టీతో కలిపి) ఖర్చు అవుతున్నది. 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రూ.3.18 కోట్లు ఖర్చు అయింది. ఈ సొమ్మును 'ది పాలసీ ఫ్రంట్' అనే ఖాతాకు ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. ఈ ఖాతాల నిర్వహణకు 35 మంది సిబ్బంది ఉన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం దాఖలు చేసిన దరఖాస్తుకు ఇచ్చిన సమాధానంలో కర్ణాటక రాష్ట్ర మార్కెటింగ్ కమ్యూనికేషన్ అండ్ అడ్వర్టయిజింగ్ లిమిటెడ్ (ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థ) ఈ వివరాలను తెలిపింది.

ఖర్గే ట్రస్ట్‌కు ఫ్రీగా 19 ఎకరాలు!

- కలబురిగిలో సిద్ధరామయ్య సర్కారు ధారాదత్తం
- బెంగళూరులోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్కులో ఐదెకరాలు కట్టబెట్టడంపై ఇప్పటికే వివాదం
- సమగ్రంగా స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని బీజేపీ డిమాండ్



ఖర్గే

బెంగళూరు, సెప్టెంబర్ 2: కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నడుస్తున్న 'సిద్ధార్థ విహార ట్రస్ట్' భూ కేటాయింపుల వ్యవహారం కర్ణాటకలో వివాదాస్పదంగా మారింది. బెంగళూరులోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్‌లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ట్రస్ట్‌కు కేటాయించిన కాంగ్రెస్ సర్కార్, కలబురిగిలో మరో 19 ఎకరాల ప్రభుత్వ భూమిని ట్రస్ట్‌కు ధారాదత్తం చేసిన సంగతి తాజాగా బయటకొచ్చింది. ఇందుకు సంబంధించి ఆ రాష్ట్ర బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. కలబురిగిలో ట్రస్ట్‌కు చెందిన 'పాలి, సంస్కృత, కంపారిటీవ్ ఫిలాసఫీ ఇనిస్టిట్యూట్'కు 19 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా కేటాయించారని బీజేపీ ఎంపీ లహర్ సింగ్ సిరోయ ఆరోపించారు. 'పాలి ఇనిస్టిట్యూట్‌కు 2014లో 16 ఎకరాలు కేటాయించారు. కొన్నాళ్ల తర్వాత మరో 3 ఎకరాలు ఇచ్చారు. మొత్తం 19 ఎకరాలను 2017 మార్చిలో ట్రస్ట్ పేరిట ఉచితంగా బదిలీ చేశారు' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ భూ కేటాయింపుపై స్వతంత దర్యాప్తు చేపట్టాలని లహర్ సింగ్ డిమాండ్ చేశారు.

సీఎస్ నుంచి నివేదిక కోరిన గవర్నర్

ఖర్గే కుటుంబ సభ్యుల ట్రస్ట్‌కు భూ కేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ స్పందించారు. అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై తనకు నివేదిక సమర్పించాలని రాష్ట్ర సీఎస్ శాలిని రజనీష్‌ని గవర్నర్ సోమవారం ఆదేశించారు.

తోడేలుతో పోరాడి.. కొడుకును కాపాడి

లక్నో: యూపీకి చెందిన ఓ తల్లి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తోడేలుతో పోరాడి తన కుమారుడిని రక్షించుకున్నది. భరూచ్‌లోని హర్ది ప్రాంతంలో ఆదివారం ఐదేండ్ల బాలుడు పరాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోతుండగా ఓ తోడేలు దాడి చేసి ఎత్తుకెళ్లింది. ఇది గమనించిన అతడి తల్లి మరో ఆలోచన లేకుండా వెంటనే మంచం మీద నుంచి తోడేలుపైకి దూకింది. అత్యంత చాకచక్యంతో దాని మెడను గట్టిగా నొక్కిపెట్టింది. ఉక్కిరిబిక్కిరి అయిన ఆ తోడేలు పరాస్‌ను వదిలిపెట్టింది. అనంతరం ఆమె గట్టిగా అరిచి, కుటుంబ సభ్యుల సాయం కోరింది. వారంతా వచ్చే సరికి తోడేలు పారిపోయింది. సుమారు 50 రోజుల నుంచి భరూచ్ సహా మరికొన్ని జిల్లాలో తోడేళ్లు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం మరో బాలికను తోడేళ్లు పొట్టనబెట్టుకున్నాయి. తోడేళ్లను పట్టుకోవడానికి అటవీ శాఖాధికారులు చిన్న పిల్లల మూత్రంతో తడిసిన రంగు రంగుల టెడ్డీ బేర్లను అవి విశ్రాంతి తీసుకునే నదీ పరీవాహక ప్రాంతాల్లో పెడుతున్నారు. తోడేళ్లు రాత్రి వేళ జనంపై దాడి చేసి, ఉదయానికల్లా తిరిగి తమ విశ్రాంతి ప్రదేశాలకు వెళ్లిపోతున్నాయని డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ అజిత్ ప్రతాప్ సింగ్ చెప్పారు.

కులగణనకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు!


రాజకీయ లబ్ధి కోసం దుర్వినియోగం చేయొద్దని వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశంలో కులగణనకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ప్రకటించింది. ఈ అంశంపై ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్య అధికార ప్రతినిధి సునీల్ అంబేకర్ సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. 'హిందూ సమాజంలో కులం, కుల సంబంధాలు అనే సున్నితమైన అంశం ఉంది. జాతీయ ఐక్యత, సమగ్రతకు సైతం ఇది ముఖ్యమైన అంశం. నిర్దిష్ట సమాజం లేదా కులానికి అందించే అన్ని సంక్షేమ పథకాలను ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలనేది ఆర్‌ఎస్‌ఎస్ అభిప్రాయం. ఇందుకోసం ప్రభుత్వానికి గణాంకాలు కావాలి. అయితే ఎన్నికల ప్రయోజనాలకు, రాజకీయ లబ్ధికి ఈ గణాంకాలను దుర్వినియోగం చేయరాదు' అని సునీల్ అంబేకర్ వ్యాఖ్యానించారు.

హిమాచల్.. దివాలా!

రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్

- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అడ్డగోలు హామీల ప్రకటన
- రాష్ట్రం పాలిట గుదిబండగా మారిన హస్తం గ్యారెంటీలు
- పెరిగిపోయిన అప్పు.. ఖాళీ అయిన ప్రభుత్వ ఖజానా
- పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి డబ్బు తీసుకున్న వైనం
- గ్యారెంటీలు, రాయితీలకు కత్తెర పెడుతున్న సర్కారు
- ఇదే బాటలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలు?!



సుఖ్‌విందర్ సింగ్

షిమ్లా, సెప్టెంబర్ 2: 'ఎన్ని హామీలైనా ఇవ్వాలి.. ఎన్నికల్లో మాత్రం గెలవాలి' అనే కాంగ్రెస్ తీరు ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నది. గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చే ముందు ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని పట్టించుకోని కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక నెరవేర్చే దారి లేక కోతలు పెడుతున్నది. తాజాగా హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ సర్కారు తీరు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నది. 2022 చివర్లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 గ్యారెంటీలు ప్రకటించింది. 18 ఏండ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, పాత పింఛన్ విధానం అమలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఈ హామీలను అమలు చేసే స్థితిలో లేదు. ఇదేమీ పట్టించుకోకుండా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సుఖ్‌విందర్ సింగ్ సుఖు సర్కారు ఇప్పుడు హామీలకు, సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది.

ఒక్కొక్కరిపై రూ.1.17 లక్షల అప్పు

దేశంలో తలసరి అప్పు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ.1.17 లక్షల అప్పు భారం ఉంది. ఈ చిన్న రాష్ట్రం అప్పు ఇప్పుడు రూ.86,589 కోట్లకు చేరింది. మరోవైపు కొత్త పింఛన్ పథకం అమలు వల్ల రాష్ట్రం కొత్త అప్పు తీసుకోవడంపై కేంద్రం పరిమితులు విధించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ఒకవైపు ఇప్పటికే ఉన్న అప్పులకు మిత్తీల భారం, మరోవైపు కొత్త అప్పులపై పరిమితులు, పెరిగిపోయిన పథకాల భారంతో సుఖు సర్కారుకు దిక్కుతోచడం లేదు. ఆఖరికి పెన్షన్ల శాఖలో ఉండే పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి సైతం ప్రభుత్వం డబ్బును వాడుకుంది. తమ జీతాలు రెండు నెలలు వాయిదా వేసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది.

14 సబ్సిడీలకు కత్తెర పెట్టేందుకు కసరత్తు

మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వడం ప్రధానంగా ఆర్థిక భారం మోపుతున్నదని అధికారులు చెప్తున్నారు. ఇక, రాష్ట్రం ఈ పథకాల భారాన్ని మోయలేదని భావిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు వాటికి కోతలు పెట్టే పనిని ప్రారంభించింది. అన్ని కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇంకా ఈ పథకాన్ని అమలు చేయలేదు. పైగా ఇప్పటికే ఉన్న 125 యూనిట్ల విద్యుత్తు సబ్సిడీపై కోతలు విధించింది. బీపీఎల్ పరిధిలో ఉన్న వారికి మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని ప్రకటించింది. మొత్తం 14 సబ్సిడీలపై కోతలు విధించేందుకు సిద్ధమైంది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని తొలగించి 50 శాతం టికెట్ వసూలు చేయాలని నిర్ణయించింది. ఉచిత నీటి సరఫరా పథకాన్ని నిలిపివేయాలని భావిస్తున్నది.

వేతనాలు ఆలస్యం.. డీఏలు పెండింగ్

అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడుస్తున్నా ఇంకా పలు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదు. మరోవైపు ఉన్న పథకాలకు సైతం కత్తెర పెడుతుండటం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఎన్నికల్లో హామీలు ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాంగ్రెస్‌కు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, అలవెన్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని, ఆఖరికి పింఛన్ల సంక్షేమ నిధి నుంచి కూడా డబ్బులు తీసుకుంటున్నదని ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ ఆరోపించారు. ఉద్యోగులకు వేతనాలు సమయానికి ఇవ్వడం లేదని, కాంగ్రెస్ సర్కారుకు ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడమే ఆర్థిక సంక్షోభానికి కారణమన్నారు.

ఇదే బాటలో కర్ణాటక, తెలంగాణ!

గ్యారెంటీల పేరుతో గెలిచిన కర్ణాటక, తెలంగాణలోనూ కాంగ్రెస్ వ్యవహారం ఇదే రకంగా ఉంది. కర్ణాటకలో గ్యారెంటీల అమలు ఆ రాష్ట్రంపై ఆర్థిక భారం మోపి ంది. దీంతో ధరలు పెంచి, ఖజానా నింపేందుకు సిద్ధరామయ్య సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు గ్యారె ంటీల అమలును సైతం పునఃపరిశీలించాలని కాంగ్రెస్ నాయకులే డిమాండ్ చేస్తున్నారు. గ్యారెంటీలు అమలు చేయలేకనే ఈ డిమాండ్ తెరపైకి తెస్తున్నారనే వాదన ఉంది. ఇక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా హామీల అమలును మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకటి, రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని సర్కారు చెప్తున్నప్పటికీ లబ్ధిదారులు అందరికీ అందడం లేదు. ఈ మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ వ్యవహారాన్ని చూస్తున్న విశ్లేషకులు.. కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తున్నదని విమర్శిస్తున్నారు. పథకాలు, సబ్సిడీలకు కోతలు విధించడానికి ఇవాళ హిమాచల్ సర్కార్ శ్రీకారం చుట్టిందని, రేపు కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలూ ఇదే వైఖరిని పాటించే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

- ఆపదలో ఆకలి తీర్చేలా...



ఖమ్మం రూరల్ మండలంలోని పలు కాలనీల్లో బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

- వరద బాధితులకు భరోసా ఇచ్చేలా...



సూర్యాపేట జిల్లా గోండ్రియాలలో వరద పరిస్థితులను తెలుసుకుంటున్న మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

- బాధితులకు అండగా..




ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో సహాయక చర్యల్లో పాల్గొన్న బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

చేతగానితనంతోనే ప్రాణనష్టం

- గత నెల 27నే వాతావరణ శాఖ హెచ్చరించింది
- అయినా కుంభకర్ణ నిద్రలో కాంగ్రెస్ ప్రభుత్వం
- ముందస్తు, సహాయక చర్యల్లో ఘోరంగా విఫలం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- తెలంగాణ సీఎం ఎన్ని హెలికాప్టర్లు, పడవలు తెప్పించారంటే.. 'బిగ్ జీరో' అంటూ ఎద్దేవా





హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ చేతగానితనం వల్లే వర్షాలు, వరదలతో ప్రాణనష్టం సంభవించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించటం అన్యాయమని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, ఇండ్లు కోల్పోయిన, దెబ్బతిన్నవారికి రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సాయం అందిస్తామని గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి వాగ్దానం చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆగస్టు 27నే భారీ వర్ష సూచన చేసిందని, అలెర్ట్‌గా ఉండాలని చెప్పిందని, కానీ, రాష్ట్రంలో కుంభకర్ణ నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయిందని దెప్పిపొడిచారు. రేవంత్ సర్కార్ నేరపూరిత నిర్లక్ష్యం ఖరీదు ఓ యువ శాస్త్రవేత్తతో పాటు సుమారు ఇరవై మంది ప్రాణాలు అని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఓ మంత్రి హెలికాప్టర్లు దొరకలేదంటడు.. మరో మంత్రి, ఈ రాష్ట్రానికి సీఎం లేనట్టు పక్క రాష్ట్ర సీఎంకు ఫోన్ చేస్తడు, ఇంకో మంత్రి ఫొటో ఫోజులకే పరిమితమవుతడు' అంటూ దుయ్యబట్టారు. 'నష్టం జరిగాక పూల డెకరేషన్ స్టేజీ మీద కూర్చొని వరదల మీద సమీక్ష చేసే చీఫ్ మినిస్టర్.. ఉల్టాచోర్ కొత్వాల్‌కో డాంటే అన్నట్టు ప్రతిపక్షం ఏం చేస్తున్నదని ప్రశ్నిస్తున్నాడు' అంటూ ఎద్దేవా చేశారు.

బిగ్ జీరో

'పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరు హెలికాప్టర్లు, 150 పడవలు తెప్పిస్తే మరి తెలంగాణ ప్రభుత్వం ఎన్ని హెలికాప్టర్లు, పడవలు తెప్పించిందో చెప్పాలి' అని ఎక్స్‌లో కేటీఆర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. దీనికి సమాధానం 'బిగ్ జీరో' అంటూ ఎద్దేవాచేశారు.

రాహుల్ గాంధీ ట్వీట్‌పై కేటీఆర్ చురకలు

'భారీ వర్షాలు, వరదల కారణంగా తెలంగాణలో ఏర్పడిన పరిస్థితులు ఆవేదనకు గురిచేశాయి.. ప్రజలకు ఇబ్బంది లేకుండా తెలంగాణ ప్రభుత్వం అవిశ్రాంతంగా చర్యలు చేపట్టింది' అంటూ రాహుల్‌గాంధీ చేసిన ట్వీట్‌పై కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. 'తెలంగాణలో నిజంగా ప్రభుత్వం తరఫున సహాయక కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తున్నారో? లేదో? తెలుసుకుంటే ఇక్కడ మీ ప్రభుత్వ నిర్వాకం తెలుస్తుంది' అంటూ రాహుల్‌కు చురకలంటించారు. 'వరదల్లో చిక్కుకున్న ప్రజలను దేవుడే కాపాడాలని ప్రభుత్వ పెద్దలే మాట్లాడుతుంటే ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఏం ప్రయోజనం?' అంటూ నిలదీశారు. ఓ జేసీబీ డ్రైవర్ సోదరుడు తన ప్రాణాలకు తెగించి తొమ్మిది మంది ప్రాణాలు కాపాడారని చెప్పారు. 'వరదలతో సతమతమవుతున్న ప్రజలు సాయం కోరితే లాఠీచార్జీలతో హింసిస్తారా? సిగ్గు తెచ్చుకోండి' అంటూ రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు.

అండగా ఉన్నవారికి అభినందనలు

విపత్కర సమయంలో ప్రజలకు బీఆర్ఎస్ కార్యకర్తలు మేమున్నామంటూ భరోసా కల్పించారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు కష్టమొచ్చిందంటే ముందుండేది బీఆర్ఎస్సేనని మరోసారి రుజువు చేశారని పార్టీ శ్రేణులను అభినందించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకోవడంలో ఖమ్మం జిల్లా నాయకులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, వరంగల్ బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందనీయమని పేర్కొన్నారు.

ఎస్ఎన్‌డీపీ వల్లే హైదరాబాద్‌కు తప్పిన ముంపు

విజన్ ఉంటే విపత్తులను కూడా సమర్థంగా ఎదుర్కోవచ్చని బీఆర్ఎస్ హయాంలో అమలుచేసిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) అక్షరాలా నిరూపించిందని కేటీఆర్ స్పష్టంచేశారు. హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలను ముంపు నుంచి కాపాడటంలో ఎస్ఎన్‌డీపీ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఎస్ఎన్‌డీపీ పనుల వల్లే వరద బాధ పోయిందని ప్రజలు చెప్పడం సంతృప్తినిస్తున్నదని పేర్కొన్నారు.

సుభాన్‌ఖాన్.. నీ సాహసానికి సెల్యూట్: కేటీఆర్

'పోతే ఒక్కడినే.. వస్తే పది మంది అని ప్రమాదానికి ఎదురెళ్లిన నీకు సలాం..' అంటూ ఖమ్మం జిల్లాలో తొమ్మిది మందిని కాపాడిన జేసీబీ డ్రైవర్ సుభాన్‌ఖాన్ సాహసాన్ని ఉద్దేశించి కేటీఆర్ కొనియాడారు. ఆయనకు ఫోన్‌చేసి అభినందించినట్టు సోమవారం ఎక్స్ వేదికగా తెలిపారు. సుభాన్‌ఖాన్‌ను తాను త్వరలో కలుస్తానని వెల్లడించారు. 'వారిని రక్షించేందుకు హెలికాప్టర్‌ను ఎలా తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తూ చేష్టలుడిగితే, ధైర్యంగా ముందుకెళ్లి వారిని రక్షించిన సుభాన్‌ఖాన్ రియల్ హీరో.. నీ సాహసానికి సెల్యూట్' అంటూ అభినందించారు.

కేవలం 5రోజుల్లో 800 డెంగ్యూ కేసులు

డెంగ్యూతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 6000 డెంగ్యూ కేసులు నమోదైతే దాచిపెట్టిందని విమర్శించారు. 5 రోజుల్లోనే 800 డెంగ్యూ కేసులు నమోదైనట్టు ఫ్యామిలీ అండ్ వెల్ఫేర్ డైరెక్టర్ నిర్ధారించిందని గుర్తుచేశారు.

కరెంటు బకాయిలు కట్టాలని ఒత్తిడి

గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలను వంచించడాన్ని రేవంత్ సర్కార్ మొదలు పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్తు అంటూ ఊదరగొట్టి, ఇప్పుడు ఐదు నెలల బకాయిలు కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెస్తున్నదని మండిపడ్డారు. మళ్లీ అప్లికేషన్ పెట్టుకోవాలని చెప్పి ఐదు నెలల బకాయిలు చెల్లించాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

నేతన్నలను కాపాడండి

సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారుతున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. సర్కార్ నిర్లక్ష్యం కార్మికుల ఉసురు తీస్తున్నదని విమర్శించారు. 'నేతన్నలకు భరోసా ఇచ్చే బతుకమ్మ చీరెల ఆర్డర్లను నిలిపివేసి వాళ్ల పొట్టకొట్టడం న్యాయమేనా? ఆదుకోవాల్సిన ప్రభుత్వమే ఉపాధి లేకుండా చేయడమేమిటి?' అని ప్రశ్నించారు. నేతన్నలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

రక్షిత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన 16 ఏళ్ల రక్షిత అనే విద్యార్థిని నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కాలేజీ హాస్టల్‌లో అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనపై కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. హాస్టల్‌లో చేరిన రెండో రోజే రక్షిత బాత్‌రూమ్‌లో శవమై కనిపించిందని, దుపట్టాతో ఉరి వేసుకున్నదని చెప్తున్నా, అంతకుముందు రాత్రి 8 గంటలకు తల్లితండ్రులతో ఫోన్‌లో మాట్లాడి అంతా బాగానే ఉన్నదని చెప్పిన అమ్మాయి తెల్లారేసరికి చనిపోవటం అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. ఆమె మృతదేహాన్ని తల్లిదండ్రులు వచ్చే వరకు ఉంచకుండా హడావుడిగా హాస్పిటల్‌కు తరలించే ప్రయత్నం చేయటం, సంఘటన జరిగిన రోజు సీసీ టీవీ ఫుటేజ్ లేదని చెబుతుండటం అనుమానాలను మరింత బలపరుస్తున్నదని చెప్పారు. హడావుడిగా మృతదేహాన్ని తరలించటం, సీసీ ఫుటేజ్ మాయం చేయటంపై ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాడుతామని చెప్పారు.



ఖమ్మంలో వరదలో చిక్కుకున్న వారిని కాపాడిన నర్సింహారావును సత్కరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు

ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే

- 'మున్నేరు'పై ముందు జాగ్రత్త లేకనే అపార నష్టం
- ముగ్గురున్నా ముంపు బాధితులను ఆదుకోలేదు
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇవ్వాలి
- మీడియాతో మాజీ మంత్రి అజయ్, ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా ముంపు బాధితులను ఆదుకోలేకపోయారని, వారంతా అసమర్థ మంత్రులేనని దుయ్యబట్టారు. మున్నేరువరదలపై ప్రభుత్వానికి ముందు జాగ్రత్త లేకపోవడం వల్లే ఇంతటి నష్టం వాటిల్లిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పుట్టెడు దుఃఖంతో ఉన్న ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం వారు పర్యటించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ..మున్నేరు వరదపై ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. వరదల్లో మృతి చెందిన వ్యక్తుల కుటుంబానికి ఒక్కొక్కరికీ 25 లక్షల చొప్పున పరిహారం అందించాలని, కుటుంబానికి 2 లక్షల తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎంపీ వద్దిరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముంపునకు గురైన ప్రాంతాల్లో ఇళ్లన్నీ బురదతో నిండి ఉన్నాయని, పాములు సంచరిస్తున్నాయని తెలిపారు. సర్వం కోల్పోయి రోడ్డున పడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఖమ్మంలో మున్నేరు వరద బాధితులను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంను నట్టేట ముంచారు

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీని నమ్మిన ఖమ్మం ప్రజలను నట్టేట ముంచారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. వరద సహాయక చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. వర్షాలతో రాష్ట్రం అల్లకల్లోలమవుతుంటే సీఎం ఏం చేస్తున్నాడంటూ ప్రశ్నించారు. వరదల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు బడే భాయ్‌ని హెలికాప్టర్ పంపించమని అడిగే తీరిక సీఎంకు లేదా అంటూ నిలదీశారు. ప్రజలు వరదల్లో చిక్కుకున్న తర్వాత రోజు తీరిగ్గా సీఎం బయటకు వచ్చాడని, ఖమ్మం వరదల్లో చిక్కుకున్న తొమ్మిది మందికి రాష్ట్ర ప్రభుత్వ సాయం లభించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

హెలికాప్టర్ తెప్పించలేని అసమర్థ సీఎం

- ప్రజలు కొట్టుకుపోతుంటే.. ప్రభుత్వం మొద్దు నిద్ర
- ఆదివారమంతా సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నట్టు?
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) వరద సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరదల్లో కొట్టుకుపోతున్న వారిని కాపాడటానికి కనీసం హెలికాప్టర్ తెప్పించలేని అసమర్థులు మన ముఖ్యమంత్రి, మంత్రులు అంటూ విరుచుకుపడ్డారు. రెవెన్యూ శాఖ మంత్రిగా ఉండి ఒక హెలికాప్టర్ తీసుకరాలేని మంత్రి పొంగులేటి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావుతో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వరదల్లో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియాగా రూ.25 లక్షలు చెల్లించాలని గతంలో డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు అమలు చేయాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో 20 జిల్లాల్లో వర్షం ప్రభావం ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సగటున 45 సెంటిమీటర్లకు పైగా వర్షం పడుతుంటే.. ఆదివారం రోజంతా ఎక్కడా కనిపించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని, అంత రహస్య సమావేశాలు, చర్చలు ఏమిటో ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందని, గంటల తరబడి బాధితులు సహాయం కోసం చూశారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. వరదలపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యల్లో ఒక్క రాజకీయ పదం కనిపించిందా? కోదాడలో ఎవరి హయాంలో కబ్జాలు జరిగాయో ఉత్తమ్‌తో చర్చకు సిద్ధమని చెప్పారు.

ఆ మంత్రికి ఏపీ సీఎం దొరికాడు కానీ తెలంగాణ సీఎం దొరకలేదా..?

ప్రజలే రెస్క్యూ ఆపరేషన్ చేసుకొని ప్రాణాలు కాపాడుకున్నారని, హెలికాప్టర్ కోసం ప్రయత్నించినా రాలేదని చెప్తున్న మంత్రి తక్షణం రాజీనామా చేయాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. హెలికాప్టర్ రాకుంటే ముఖ్యమంత్రి ప్రధానమంత్రితో మాట్లాడకుండా నిన్న ఏం చేశారని నిలదీశారు. సైనిక విమానం 45 నిమిషాల్లో ఖమ్మంకు చేరుకునేదని, ప్రాణాలను కాపాడేదని అభిప్రాయపడ్డారు. ఒక మంత్రి హెలికాప్టర్ కోసం ఏపీ సీఎంతో మాట్లాడాను అని చెప్తున్నారని, ఆయన తెలంగాణ సీఎంతో ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. ఆ మంత్రికి ఏపీ సీఎం దొరికాడు తప్ప తెలంగాణ సీఎం దొరకలేదా అంటూ నిలదీశారు. సీఎంతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, మాట్లాడితే తెలంగాణకు హెలికాప్టర్ కావాలని ఎందుకు అడగలేదని సందేహం వ్యక్తంచేశారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి ఏం చేస్తున్నారని ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. భువనగిరి, కోదాడ, నల్లగొండ, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి హెలికాప్టర్ దొరుకుతుందని, కానీ ప్రజలను రక్షించేందుకు దొరకదా అంటూ ఈ ప్రభుత్వానికి పరిపాలించే నైతిక హక్కు లేదని, వర్షాలతో సంభవించిన మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.



సోమవారం హైదరాబాద్‌లోని ఫీవర్ హాస్పిటల్ ఓపీ బ్లాక్ వద్ద బారులుదీరిన రోగులు

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

- ఇప్పటికే సీజనల్ వ్యాధుల విజృంభణ
- రాష్ట్రంలో వేలాదిగా డెంగీ కేసుల నమోదు
- సమీక్షలతో మంత్రుల సమయం వృథా
- దవాఖానల్లో వేధిస్తున్న మందుల కొరత



కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ఇన్‌వార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్య లోపం, వైద్యారోగ్యశాఖ వైఫల్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది డెంగీ కేసులు నమోదవుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా సైతం విజృంభిస్తున్నాయి. ఇలాంటి సమయంలో వర్షాలు, వరదలతో వ్యాధుల ముప్పు పొంచి ఉన్నదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాలతో నీళ్లు నిలిచి ఇప్పటికే దోమల సంఖ్య పెరుగుతున్నదని, వరద తగ్గిన తర్వాత ప్రభావిత ప్రాంతాల్లో కలరాతోపాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని గుర్తు చేస్తున్నారు. వర్ష, వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సహాయక చర్యలపై నిరంతరం పర్యవేక్షించాల్సిన సమయంలో వైద్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులు చట్టాలపై సమీక్షలు నిర్వహించడమే ఇందుకు ఉదాహరణగా చెప్తున్నారు. ప్రస్తుత పరిస్థితులతో సంబంధం లేని అంశంపై గంటలపాటు సమీక్షిస్తూ, సమయం వృథా చేయడంపై మండిపడుతున్నారు. ఇప్పుడే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే మరిన్ని వ్యాధులు విజృంభిస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే దవాఖానల్లో మందుల కొరత నెలకొన్నదని గగ్గోలు పెడుతున్నారని, తగిన విధంగా స్పందించాలని కోరుతున్నారు.



మంచిర్యాల ఏసీహెచ్‌లో రోగులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

పంటలకు చీడపీడల బెడద

నివారణకు చేపట్టాల్సిన చర్యలు ఇవీ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో వరి, పత్తి తదితర పంటలకు చీడపీడల బెడద పెరగవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని సూచించారు.

- వరి పంటకు బ్యాక్టీరియా, ఎండాకు తెగులు వ్యాప్తిని నివారించేందుకు ఎకరానికి 44 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్, 60 గ్రాముల స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. పూత దశలో ఉన్న వరి పంటకు కాపర్ శిలీంధ్రనాశినులను పిచికారీ చేయరాదు.
- పత్తిచేలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఎండు తెగులు వ్యాప్తి నివారణకు లీటర్ నీటికి గ్రాము చొప్పున కార్బండాజిమ్‌ను మొక్కల మొదళ్ల వద్ద పోయాలి. ఆకుమచ్చ, ఆల్టేనేరియా ఆకు మాడు, కాండం మాడు తెగుళ్ల నియంత్రణ కోసం ఎకరానికి 500 గ్రాముల కార్బండాజిమ్, మాంకోజెబ్ మిశ్రమాన్ని లేదా 80 గ్రాముల ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్, టెబుకొనజోల్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.

రియల్ హీరో సుభాన్



వరద బాధితులను కాపాడటంలో చేతులెత్తేసిన ఖమ్మం అధికారులు

వద్దని వారించినా.. ధైర్యంగా వెళ్లి 9 మందిని కాపాడిన జేసీబీ డ్రైవర్ › 3

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



భారత్‌కు 'పారా' హుషారు › 12

ఒక్కరోజే 8 పతకాలు

సుమిత్, నితేశ్ పసిడి వెలుగులు

బ్యాడ్మింటన్‌లో నాలుగు మెడల్స్

ఫైనల్‌కు తెలంగాణ 'దీప్తి'

మంగళవారం TUESDAY 3.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 90 ‖ వెల (Price) రూ.6.50 | అమావాస్య

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

మంగళవారం, సూర్యోదయం: 6-02, సూర్యాస్తమయం: 6-28. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం తిథి: అమావాస్య ఉదయం 7-25 వరకు, తదుపరి భాద్రపద శుక్ల పాడ్యమి. నక్షత్రం: పూర్వఫల్గుణి రాత్రి 3-10 వరకు. వర్జ్యం: ఉదయం 9-16 నుంచి ఉదయం 11-05 వరకు. రాహుకాలం: పగలు 3-21 నుంచి సాయంత్రం 4-54 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-21 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-52 వరకు. అమృతకాలం: రాత్రి 8-00 నుంచి రాత్రి 9-48 వరకు.







ఖమ్మంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తాము సర్వస్వం కోల్పోయామని గోడు వెల్లబోసుకుంటున్న మహిళ. సర్కారు స్పందనారాహిత్యంపై ముఖ్యమంత్రిని మహిళలు నిలదీస్తుండగా.. అడ్డుకుంటున్న భద్రతాసిబ్బంది

సీఎం నిలదీత.. మంత్రుల అడ్డగింత

వాన, వరదతో రాష్ట్రం అస్తవ్యస్తం

33 మంది మృతి

సాయంలో సర్కారు విఫలం

వరద నిర్వహణలో సర్కారు వైఫల్యంపై బాధితుల తీవ్ర ఆగ్రహం

పోలేపల్లిలో రేవంత్‌కు నిరసన సెగ.. మంత్రులకూ ముచ్చెమటలు

వరద నష్టం 5,320 కోట్లు.. 275 చోట్ల గండ్లు.. నిలిచిన రాకపోకలు

ప్రభుత్వ సహాయ చర్యలపై విమర్శలు.. కానరాని రెస్క్యూ టీములు

పొంచి ఉన్న మరో అల్పపీడనం.. రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలు



కాంగ్రెస్‌కు ఓట్లేసి నిండా మునిగినం

జిల్లాలో ముగ్గురు మంత్రులు పేరుకే ఉన్నరు. వారి వల్ల మాకెలాంటి ఉపయోగమూ లేదు. వరదలు వస్తాయని ముందే అధికారులు వారికి చెప్పలేదా? చెప్తే వాళ్లు మమ్మల్ని ఎందుకు పట్టించుకోలేదు? వాళ్ల బంధువులో, వాళ్ల కుటుంబ సభ్యులో ఉంటే ఇట్లనే చేస్తారా? ఎలక్షన్లప్పుడు మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని.. ప్రజలకు కష్టాలు రాగానే కన్పించకుండా పోయేవాళ్లని అనవసరంగా ఎన్నుకున్నం. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి నిండా మునిగినం.. మా బతుకుల్ని మేమే పాడు చేసుకున్నం. ప్రజలతో ఉండి, ప్రజల కోసం కష్టపడేటోళ్లని ఎన్నుకోకపోవడం మేం చేసిన తప్పు. అందువల్ల మాకే నష్టం జరిగింది.

నసీమా, వెంకటేశ్వరనగర్ (ఖమ్మం)

మూడ్రోజులు నిద్ర పోలె!

- వరద పరిస్థితిపై సమీక్షిస్తూనే ఉన్న
- బీఆర్‌ఎస్ నాయకులు వచ్చి వరద సహాయ చర్యలు చేపట్టాలి: రేవంత్

ప్రభుత్వ సాయం పది వేలు

- మృతుల కుటుంబాలకు 5 లక్షలు › 5
- నష్టపోయిన ప్రతి ఎకరాకు 10 వేలు
- జాతీయ విపత్తుగా ప్రకటించాలి: సీఎం


మీరూ వద్దు.. మీ సాయం వద్దు

- లక్షల్లో నష్టపోతే.. ఇచ్చేది ముష్టి పది వేలేనా?
- ముగ్గురు మంత్రులున్నా ఒక్కరూ పట్టించుకోలె
- ఈతగాళ్లను పెట్టుకుని మేమే బయటపడినం
- ప్రసంగాలు, ప్రచారాలు కాదు.. సాయమేది?
- రేవంత్ పర్యటనలో బాధితుల ప్రశ్నల వర్షం
- ఓపెన్ టాప్ జీపులో పరామర్శయాత్రకు సీఎం
- ఆయన వెళ్లే రూట్లో చెత్త పారబోసి నిరసన
- పలుచోట్ల రోడ్డెక్కిన బాధితులు.. సర్కార్‌పై ఫైర్
- అడ్డుకున్న పోలీసులపైనా ఎదురుతిరిగిన జనం
- పరామర్శకు వచ్చిన మంత్రులనూ నిలదీత
- 'చచ్చాక వస్తే బాగుండేది కదా' అంటూ ఆగ్రహం

ఖమ్మం/సూర్యాపేట/కొటాల, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు బాధితుల నుంచి నిరసన సెగ తగలింది. బాధితులు అడుగడుగునా అడ్డుకోవడంతో ఏం చేయాలో పాలుపోని మంత్రులు, నేతలు బిక్కముఖం వేశారు. బాధితుల ప్రశ్నలకు జవాబులు చెప్పలేక నీళ్లు నమిలారు. మూడు రోజులుగా తిండీతిప్పల్లేకుండా, వరద నీటిలో బిక్కుబిక్కుమని గడుపుతుంటే తీరిగ్గా వచ్చిన ముఖ్యమంత్రి, మంత్రులపై బాధితులు విరుచుకుపడ్డారు. బాధిత కుటుంబాలకు రూ. 10 వేలు సాయం అందిస్తామని సీఎం చెప్పగానే వారిలో ఆగ్రహం మరింతగా కట్టలు తెంచుకుంది. 'మీరిచ్చే రూ. 10 వేలు వద్దు.. మీరూ వద్దు.. ఆ పది వేలకు ఒక్క సామాను కూడా రాదు' అంటూ ఖమ్మం మహిళలు ముఖ్యమంత్రి రేవంత్ ముఖం మీదే తేల్చి › 5వ పేజీలో

వరదపై సీఎం బురద రాజకీయం

- 9 సీట్లిచ్చిన ఖమ్మంలో 9 మందినైనా ప్రభుత్వం కాపాడలె
- ముగ్గురు మంత్రులున్నా ముంపు ప్రజలను పట్టించుకోలేదు
- రేవంత్ మాటలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు › 2
- మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలి: హరీశ్



సర్కారుకు చేతగాకే ప్రాణనష్టం

- ఆగస్టు 27నే అప్రమత్తం చేసిన వాతావరణశాఖ
- ముందస్తు హెచ్చరికలున్నా ప్రభుత్వం మొద్దునిద్ర
- ఒక్క హెలికాప్టర్ రాలేదు, బోట్లనూ తెప్పించలేదు
- వరద సహాయ చర్యల్లోనూ విఫలం: కేటీఆర్ › 3

ఆర్‌ఆర్‌ఆర్ కోసమే ప్రపంచ బ్యాంకుకు!

పీపీపీ విధానంలో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు

ఖరారైన 'దక్షిణ' అలైన్‌మెంట్.. 195 కి.మీ.కు పెరిగిన రోడ్డు

ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ.. అందుకోసమే అప్పులు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగాన్ని కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర సర్కారు ఆధ్వర్యంలోనే నిర్మించాలని నిర్ణయించారు. ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో దీన్ని చేపట్టనున్నారు. సీఎం సూచనల ప్రకారం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో అధికారులు మార్పులు చేయగా, సీఎం ఆమోదం తెలిపారు. దీంతో దక్షిణభాగం రోడ్డు 189 కిలోమీటర్ల నుంచి 195 కిలోమీటర్లకు పెరిగింది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి భూసేకరణలో అడ్డంకులు › 7వ పేజీలో





రంగసముద్రం చెరువు ఆక్రమణలపై జనవరిలో నమస్తే తెలంగాణ ప్రచురించిన కథనం. ప్రస్తుతం నిండుకుండను తలపిస్తున్న రంగసముద్రం చెరువు

రంగసముద్రానికి జలకళ

'నమస్తే తెలంగాణ' కథనంతో రియల్ చెర వీడిన చెరువు › 7

రేవంత్ తీరుపై సుప్రీం అసహనం

ఉన్నత పదవుల్లో ఉన్నవారు సంయమనం పాటించాలంటూ వ్యాఖ్యలు › 10

ఓటుకు నోటు కేసు రెండు వారాలకు వాయిదా

'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీం ఫైర్

- నిందితుడైనంత మాత్రాన ఇల్లు కూల్చేస్తారా?
- అక్రమ కట్టడమైనా చట్టాన్ని పాటించాల్సిందే › 10
- దోషిగా తేలినా కూల్చేయడం కుదరదు: ధర్మాసనం

కాంగ్రెస్ వచ్చె.. 'కేన్స్' పాయె!

గుజరాత్‌కు తరలిన సెమీకండక్టర్ల పరిశ్రమ

రాష్ట్రానికి వచ్చినట్టే వచ్చి సంస్థ యూటర్న్

బీఆర్‌ఎస్ హయాంలో భూమి కేటాయింపు

ప్రభుత్వం మారాక సంస్థ పునరాలోచన

సనంద్‌లో రూ. 3,300 కోట్ల పెట్టుబడి

తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ యూనిట్‌తో సరి

5 పరిశ్రమల్లో నాలుగు గుజరాత్‌లోనే › 8

అరబిందో విస్తరణ!

హైదరాబాద్, సెప్టెంబర్ 2: ఫార్మా దిగ్గజం అరబిందో ఫార్మా తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఆర్ అండ్‌డీని మరింత బలోపేతం చేయడం తోపాటు నిర్మాణ దశలో ఉన్న ఆరు కొత్త ప్లాంట్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయని ప్రకటించింది. ఇప్పటికే సంస్థకు 29 ఉత్పత్తి కేంద్రాలు ఉండగా, వీటిద్వారా ప్రతియేటా 50 బిలియన్ల డోసేజ్‌లను ఉత్పత్తి చేస్తున్నది.

సింగరేణి లక్ష్యం మిస్

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి లక్ష్యం అంచనాలను చేరుకోలేకపోయింది. గత నెలకుగాను 100 శాతం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికి దీంట్లో 83 శాతం సాధించింది. ముఖ్యంగా ఇల్లందు ఏరియా ముందంజలో ఉండగా, బెల్లంపల్లి ఏరియా వెనుకబడింది. కొత్తగూడెం ఏరియాలో 9,96,502 టన్నుల లక్ష్యం అధిగమించి 9,93, 318 టన్నులు ఉత్పత్తి చేసింది. అలాగే ఇల్లందు ఏరియాలో 3,29,200 టన్నులు (127 శాతం), మణుగూరు ఏరియాలో 5,34, 316 (67 శాతం), బెల్లంపల్లి ఏరియాలో 1,15,452 (48 శాతం), మందమర్రిలో 1,90, 008 (76 శాతం), శ్రీరాంపూర్ ఏరియాలో 2,68, 817 (59 శాతం), ఆర్జీ-1లో 2,90,647 (79 శాతం), ఆర్జీ-2 ఏరియాలో 4,40,009 (92 శాతం), ఆర్జీ-3 ఏరియాలో 4,14,520 (99 శాతం) బొగ్గు ఉత్పత్తి జరిగింది.

ఎన్‌సీసీకి 1,236 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, సెప్టెంబర్ 2: గత నెలలో రూ.1,236 కోట్ల విలువైన ఆర్డర్లు లభించినట్లు ఎన్‌సీసీ లిమిటెడ్ ప్రకటించింది. వీటిలో ఇరిగేషన్ విభాగం నుంచి వచ్చినట్లు పేర్కొంది.

కాంగ్రెస్ వచ్చె.. 'కేన్స్' పాయె!

- గుజరాత్‌కు తరలిన కేన్స్ సెమీకండక్టర్ల పరిశ్రమ
- సనంద్‌లో రూ. 3,300 కోట్ల పెట్టుబడి
- ఆమోదించిన కేంద్ర క్యాబినెట్
- రాష్ట్రానికి వచ్చినట్టే వచ్చి యూటర్న్
- బీఆర్‌ఎస్ హయాంలో భూమి కేటాయింపు
- ఎలక్ట్రానిక్స్ యూనిట్‌తో సరి
- ఐదు పరిశ్రమల్లో నాలుగు గుజరాత్‌లోనే



హైదరాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): ఊహించిందే అయింది. గుజరాత్‌లో కేన్స్ సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమకు సోమవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మన రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సిన ఈ పరిశ్రమ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో గుజరాత్‌కు తరలివెళ్లినట్టు ఆరోపణలున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇదివరకే ఈ సంస్థకు భూమిని కేటాయించడంతో కంటి తుడుపు చర్యగా అక్కడ సెమీకండక్టర్ల పరిశ్రమకు బదులు ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ యూనిట్‌తో కేన్స్ సరిపెట్టింది. గుజరాత్‌లోని సనంద్‌లో రూ. 3,300 కోట్ల పెట్టుబడితో సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటుకు కేన్స్ సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్ పెట్టుకున్న ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ యూనిట్‌లో రోజుకు 60 లక్షల చిప్‌లు తయారు చేయనున్నారు. పరిశ్రమలు, ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, టెలికం, మొబైల్ ఫోన్స్ తదితర వాటికి ఉపయోగపడే చిప్‌లు ఇక్కడ తయారు కానున్నాయి. భారత్‌లో సెమీకండక్టర్స్, డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టంను అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ రంగానికి డిసెంబర్, 2021లో రూ. 76,000 కోట్లు కేటాయించింది. జూన్ 2023న గుజరాత్‌లోని సనంద్‌లో మొదటి సెమీకండక్టర్ల యూనిట్‌కు, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో మూడు సెమీకండక్టర్ల తయారీ యూనిట్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. టాటా ఎలక్ట్రానిక్స్ గుజరాత్‌లోని ధొలెరా, అస్సాంలోని మోరిగాంలో సెమీకండక్టర్ల యూనిట్లను ఏర్పాటు చేయనుండగా, సీజీ పవర్ అనే సంస్థ గుజరాత్‌లోని సనంద్‌లో యూనిట్‌ను నెలకొల్పనుంది. ప్రస్తుతం ఈ నాలుగు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుండగా, వీటి మొత్తం పెట్టుబడి రూ. 1.5 లక్షల కోట్లు. వీటి మొత్తం సామర్థ్యం రోజుకు 7 కోట్ల చిప్‌ల తయారీ. తాజాగా కేన్స్ సెమికాన్‌కు రోజుకు 60 లక్షల చిప్‌ల తయారీ యూనిట్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది.

మనకు ఎలక్ట్రానిక్స్ యూనిట్‌తో సరి

వాస్తవానికి కేన్స్ సెమికాన్ సంస్థ రూ. 2,800 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడమే కాకుండా నిరుడు అక్టోబర్‌లోనే రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో యూనిట్ నిర్మాణ పనులు చేపట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత, ఈ ఏడాది మార్చిలో నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. సదరు సంస్థ మన రాష్ట్రంలో యూనిట్ ఏర్పాటు ప్రణాళికలను నిలిపివేసి గుజరాత్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నది. కొంగరకలాన్‌లో చేపట్టిన ప్రాజెక్టును ఈఎంఎస్(ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్) యూనిట్‌గా మార్పు చేస్తున్నట్టు అప్పట్లో వార్తలొచ్చాయి. ఈ క్రమంలోనే గత ఆగస్టు 23న కొంగరకలాన్‌లో ఈఎంఎస్‌ను కేన్స్ సంస్థ ప్రారంభించింది. ఈ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ సీఈవో రఘు పణిక్కర్ మాట్లాడుతూ, కొంగరకలాన్ యూనిట్‌లో ప్రధానంగా స్మార్ట్ మీటర్లతోపాటు మెయిన్ బోర్డులు, ఎనర్జీ కార్డ్, ప్లాస్టిక్, ఇంజెక్షన్ మౌల్డింగ్ మెషీన్లు తయారవుతాయని తెలిపారు. ఇక్కడ ప్రస్తుతం రెండు మాత్రమే తయారీ లైన్లు ఉన్నట్టు, భవిష్యత్తులో వీటిని 15-16లైన్లకు విస్తరించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఇక్కడ సెమీకండక్టర్లకు సంబంధించిన అనుబంధ వస్తువులైన సబ్‌స్ట్రేట్, కో-ప్యాకేజ్ ఆప్టిక్స్, లైట్ స్పీడ్ ఫోటోనిక్స్ తదితరవాటిలో కొన్నింటిని కొంగరకలాన్‌లో తయారు చేస్తామని వివరించారు. ఈ యూనిట్ ప్రారంభానికి ముందు పణిక్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్ ఏర్పాటు పరిశీలనలో ఉందని చెప్పడం గమనార్హం. తమకు ప్రస్తుతం తెలంగాణలో 46 ఎకరాల భూమి మాత్రమే ఉన్నదని, ఇది తమ అవసరాలకు కావాల్సిన భూమిలో పదో వంతు మాత్రమేనని వివరించారు.

చేజారిన అవకాశం..

బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు సెమీకండక్టర్ల తయారీకి హైదరాబాద్‌ను కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. ఈ క్రమంలోనే పలు ప్రఖ్యాత సంస్థలతో సంప్రదింపులు జరిపిన అప్పటి పరిశ్రమల మంత్రి కేటీఆర్.. కేన్స్ సెమికాన్‌ను ఒప్పించి రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటుకు ఒప్పించారు. ఫలితంగా ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చర్యలను ప్రారంభించిన సదరు సంస్థ, అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఒక్కసారిగా నిర్ణయాన్ని మార్చుకొని గుజరాత్‌లో సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటు చేస్తున్నది. ఒకవేళ ఈ పరిశ్రమ రాష్ట్రంలో ఏర్పాటైతే భవిష్యత్తులో గుజరాత్‌కు పోటీగా మన రాష్ట్రంలో కూడా మరిన్ని సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలు ఏర్పాటయ్యేవని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. ఐదింటిలో నాలుగు పరిశ్రమలు గుజరాత్‌లోనే ఏర్పాటు కావడంతో క్రమంగా సెమీకండక్టర్ల రంగానికి గుజరాత్ కేంద్రంగా ఎదుగుతున్నదని వారు పేర్కొంటున్నారు.

టాటా కర్వ్ ఐస్ మాడల్స్

ప్రారంభ ధర రూ.9.99 లక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్..మార్కెట్లోకి మధ్యస్థాయి ఎస్‌యూవీకూప్ కర్వ్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ మాడల్ రూ.9.99 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నది. ఈ సందర్భంగా టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన విభాగ ఎండీ శైలేష్ చంద్ర మాట్లాడుతూ..దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మధ్యస్థాయి ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో కర్వ్‌ను విడుదల చేసినట్లు, ప్రతియేటా ఈ సెగ్మెంట్‌లో ఏడు లక్షల వాహనాలు అమ్ముడుకానుండటంతో సంస్థల మధ్య పోటీ తీవ్రంగా నెలకొన్నది. హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతి గ్రాండ్ విటారా, టయోటా అర్బన్ క్రూజర్, హోండా ఎలివేట్‌లకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను ప్రవేశపెడుతున్నది. ఆరు రంగుల్లో లభించనున్న ఈ మాడల్ రూ.9.99 లక్షల నుంచి రూ.18 లక్షల లోపు లభించనున్నది. 12.3 ఇంచుల టచ్‌స్క్రీన్, ఎలక్ట్రిక్ పార్కింగ్ బ్రేక్, అన్ని వైపుల కెమెరాలు, వైర్‌లెస్ చార్జర్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.



ఆల్టో ధర 6,500 తగ్గింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ.. ఎంట్రీ లెవల్ కార్ల ధరలను తగ్గించింది. ఆల్టో కే 10, ఎస్-ప్రెస్సో మాడళ్ల ధరలను రూ. 6,500 వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఎస్-ప్రెస్సో ఎల్ఎక్స్ఐ పెట్రోల్ వెర్షన్ రూ.2,000 తగ్గనుండగా, ఆల్టో కే10 వీఎక్స్ఐ పెట్రోల్ వెర్షన్ రూ.6,500 కూడా తగ్గనున్నది. దీంతో ఆల్టో కే10 మాడల్ ధర రూ.3.99-5.96 లక్షలకు లభించనుండగా, ఎస్-ప్రెస్సో రూ.4.26 లక్షల నుంచి రూ.6.11 లక్షల లోపు లభించనున్నాయి. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

పెరిగిన బజాజ్ అమ్మకాలు

గత నెలకుగాను 3,97,804 యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు బజాజ్ ఆటో ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే నెలలో అమ్ముడైన 3,41,648 యూనిట్లతో పోలిస్తే 16 శాతం పెరిగాయని తెలిపింది. వీటిలో దేశీయంగా 2,53,827 యూనిట్లు, 1,43,977 యూనిట్లను ఎగుమతి చేసింది.

రికార్డు స్థాయికి చేరుకున్న సూచీలు

ముంబై, సెప్టెంబర్ 2: దేశీయ స్టాక్ మార్కెట్ల లాభాల పరంపర కొనసాగుతున్నది. వరుసగా పదోరోజు సోమవారం కూడా సూచీలు కదంతొక్కాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులు పెడుతుండటం, అమెరికా మార్కెట్ల ర్యాలీ కొనసాగుతుండటంతో దేశీయ సూచీలు చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఇంట్రాడేలో 350 పాయింట్లకు పైగా లాభపడి నూతన గరిష్ఠ స్థాయికి 82,725 పాయింట్లను తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 194 పాయింట్లు అందుకొని 82,559.84 పాయింట్ల వద్ద ముగిసింది. సెప్టెంబర్ 2023 తర్వాత వరుసగా పదిరోజులుగా లాభపడటం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోసూచీ నిఫ్టీ 13 రోజులుగా లాభాల్లోనే కదలాడుతున్నది. గత దశాబ్దకాలంలో తొలిసారిగా వరుసగా ఇన్ని రోజులు లాభపడటం ఇదే తొలిసారి. సోమవారం కూడా 42.80 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 25,278.70 పాయింట్లకు ఎగబాకింది. గత 13 సెషన్లలో నిఫ్టీ 1,140 పాయింట్లు లేక 4.72 శాతం బలపడగా, సెన్సెక్స్ వరుస పది సెషన్లలో 2,135.16 పాయింట్లు లాభపడ్డాయి.

సిప్‌లో నెలకు రూ.250!: సెబీ చీఫ్

ముంబై, సెప్టెంబర్ 2: పెట్టుబడులను ప్రోత్సహించడంలో భాగంగా మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) కింద నెలకు రూ.250 చొప్పున మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టే అవకాశాలు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. స్టార్‌బక్స్‌లో కాఫీకి పెట్టే ఖర్చు స్థాయిలోనే సిప్‌లో పెట్టుబడులు పెట్టే సమయం త్వరలో రాబోతున్నదని సెబీ చైర్మన్ మాధాబి బచ్ పురి ఈ సందర్భంగా తెలిపారు. ఈ బృహత్ ప్రణాళికపై అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(యాంఫీ)తోపాటు కీలక సంస్థలతో సంప్రదింపులు జరిపినట్లు భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన వార్షిక సదస్సులో వెల్లడించారు. తక్కువ స్థాయి పెట్టుబడి ప్రతిపాదనను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సాంకేతిక పరంగా మార్పులు చేయాల్సిన అవసరం కూడా ఉన్నదన్నారు. మరో వైపు, సింగిల్ ఫైలింగ్‌తో స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయ్యేందుకు వీలుపడనున్నది.

లాభాలొస్తే వారంలోనే విక్రయం

స్టాక్ మార్కెట్‌లో మదుపరుల పెట్టుబడులపై సెబీ ప్రత్యేక నివేదికను విడుదల చేసింది.



ఐపీవోలో షేర్లు అలాట్‌మెంట్ జరిగిన వారంలోనే 54 శాతం షేర్లను మదుపరులు విక్రయిస్తున్నట్లు సెబీ అధ్యయనంలో వెల్లడైంది. నష్టాలు వచ్చినప్పటితో పోలిస్తే లాభాలు వచ్చినప్పుడు ఈ తరహా విక్రయాలు ఎక్కువగా ఉంటున్నాయని పేర్కొంది. 2021 నుంచి 2023 వరకు 144 ఐపీవోల డాటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది.



దేశీయ ట్రాక్టర్ల తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తొలిసారిగా సీబీజీ (కంప్రెస్డ్ బయో-గ్యాస్) ఆధారిత యువో టెక్ ప్లస్ ట్రాక్టర్‌ను ఢిల్లీలో కేంద్ర రవాణా, జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. మహీంద్రా సీబీజీ పవర్డ్ ట్రాక్టర్‌లో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్‌తో కాలుష్య కారకాలను తగ్గించడంతోపాటు కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చునని పేర్కొంది. డీజిల్ ట్రాక్టర్ టెక్నాలజీతో పోలిస్తే అత్యంత శకివంతంగా, సమర్థవంతంగా పనిచేయనున్నది ఈ ట్రాక్టర్.

స్కూళ్లల్లో కాంపొజిట్ స్కిల్ ల్యాబ్‌లు

- ఏర్పాటుకు మూడేండ్ల గడువు
- ఆరో తరగతి నుంచే నైపుణ్య శిక్షణ
- స్కూళ్లను ఆదేశించిన సీబీఎస్‌ఈ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): పాఠశాల దశలోనే ఆరో తరగతి నుంచే విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సీబీఎస్‌ఈ కీలక నిర్ణయం తీసుకుంది. స్కూళ్లల్లో కాంపొజిట్ స్కిల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించింది. సీబీఎస్‌ఈ ఇటీవలే ప్రిన్సిపాళ్లకు లేఖలు రాసింది. మూడేండ్లల్లో తప్పనిసరిగా ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవాలని గడువు విధించింది. సీబీఎస్‌ఈ 139వ పాలకమండలి సమావేశంలో ఇదే అంశంపై సుదీర్ఘంగా చర్చించి, ల్యాబ్‌ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్‌ను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసింది. 6 నుంచి 12 తరగతుల్లో స్కిల్‌డెవలప్‌మెంట్‌ను అంతర్భాగంగా చేర్చింది. 6వ తరగతిలో చేరిన వారు ఏదో ఒక స్కిల్ కోర్సును అభ్యసించాల్సిందే. దీంట్లో భాగంగా బడుల్లో స్కిల్ ల్యాబ్‌లు, వృత్తిశిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

చివర్లో కోర్టుకు వస్తే ఎలా?

- గణేశ నిమజ్జనాలకు ముందు పిటిషన్ వేయడంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే గణేశ నిమజ్జన వ్యవహారంపై చిట్టచివరి సమయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో వెలువరించిన ఉత్తర్వులను అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమే అవుతుందంటూ వ్యక్తిగత హోదాలో న్యాయవాది ఎం వేణుమాధవ్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారంపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. జ్వరం రావడం వల్ల ముందస్తుగా పిటిషన్ వేయలేకపోయానని పిటిషనర్ చెప్పడంతో.. చివరి క్షణాల్లో పిటిషన్ వేయడం సరికాదని, ఇది కోర్టుపై ఒత్తిడి తీసుకురావడం, బ్లాక్‌బెయిల్ చేయడం కిందికే వస్తుందని వ్యాఖ్యానించింది. అయినప్పటికీ ఇది ప్రజాహితంతో కూడిన వ్యవహారమని, దీనిపై తామే విచారణ చేస్తామని ప్రకటించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని తెలంగాణ గణేశ్ ముక్తి కళాకార్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫు న్యాయవాది కోరడంతో తదుపరి విచారణ 9కి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

ఆ వ్యాఖ్యలు వ్యక్తిగతం

స్మితా సబర్వాల్‌పై పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఐఏఎస్ లాంటి ఉన్నత పదవుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం లేదంటూ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం కొట్టివేసింది. వ్యాఖ్యల వల్ల ఎవరి హక్కులకు భంగం వాటిల్లినట్టు ఆధారాలు లేవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం స్పష్టం చేసింది. ఆమె వ్యాఖ్యలతో దివ్యాంగుల రిజర్వేషన్లు తొలగించడం కూడా జరగలేదంది.

వాష్‌రూమ్‌లో కెమెరాలపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏపీ కృష్ణా జిల్లాలో మహిళా కళాశాల వాష్‌రూమ్, కర్ణాటకలోని బెంగళూరు తినుబండారం షాపులో రహస్య కెమెరాలు ఉన్నట్టు వెలుగుచూసిన ఘటనలను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటాగా స్వీకరించింది. మహిళల భద్రత, గౌరవప్రద జీవన హక్కులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

'టీవీ-9 రవిప్రకాశ్‌పై కేసు ఉపసంహరణ చట్టవ్యతిరేకం'

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఫోర్జరీ, నిధుల దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడినట్టు అభియోగాలు ఎదుర్కొంటున్న టీవీ-9 మాజీ డైరెక్టర్ రవి ప్రకాశ్‌పై క్రిమినల్ కేసు ఉపసంహరణకు ప్రభుత్వం గత నెల 15న జీవో జారీ చేయడం, దాని ఆధారంగా కూకట్‌పల్లి మేజిస్ట్రేట్ కోర్టు ఉపసంహరణ ఉత్తర్వులు జారీ చేయడం చట్టవిరుద్ధమని అలాందా మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ హైకోర్టుకు తెలిపింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆ సంస్థ డైరెక్టర్ కౌశిక్‌రావు వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది టీ నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. ఎలాంటి కారణాలను పేర్కొనకుండా ఈ కేసు ఉపసంహరణకు మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారని, ఇది నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు. యాంత్రికంగా జారీచేసిన ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రవి ప్రకాశ్‌కు, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీచేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 5కి వాయిదా వేసింది.

- రైతులందరికీ రుణమాఫీ చేయాలి



ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సోమవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం ఇండియన్ బ్యాంకు ఎదుట అన్నదాతలు ఆందోళన చేపట్టారు. అనంతరం వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఇండియన్ బ్యాంక్ నుంచి బొడ్డుచింతలపల్లి, పోతురాజుపల్లి, ధర్మారం, స్తంభంపల్లి, వసంతాపురం గ్రామాలకు చెందిన 1,293 మంది రైతులు రుణాలు తీసుకుంటే.. 270 మందికి మాఫీ అయిందని, మిగతా రైతులకు మాఫీ వర్తించలేదని రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రైతులు ముత్తిలింగం, విద్యాసాగర్, గోలి రాజయ్య తెలిపారు. ప్రభుత్వం వెంటనే షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు. - గీసుగొండ

కూల్చివేతలపై హైకోర్టు స్టే

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఖానాపూర్‌లో తమ ఇండ్ల కూల్చివేతకు అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ విద్యాధర్‌రెడ్డి, అనుపమ దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఉస్మాన్‌సాగర్ చెరువుకు సంబంధించిన మ్యాప్ వివరాలను అందజేయాలని, తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు నిర్మాణాలను కూల్చివేయరాదని ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత తనిఖీల తర్వాత ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇండ్ల స్థలాలు లేవని అధికారికంగా పత్రాలు ఇచ్చిన అధికారులు ఇప్పుడు పిటిషనర్లకు నోటీసులు ఇవ్వడంపై జస్టిస్ వినోద్‌కుమార్ సందేహాన్ని వ్యక్తం చేస్తూ.. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేశారు. ఉస్మాన్‌సాగర్ మ్యాప్ సమర్పించడంతోపాటు కూల్చివేతలపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ఏవైనా నిబంధనలకు లోబడే ఉండాలి..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటలోని దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం చేపట్టే చర్యలు చట్టంలోని నిబంధనలకు లోబడి ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. అక్కడ 15 ఎకరాల్లోని లేఔట్లలో ప్లాట్లను కొనుగోలు చేసినవారికి వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద డిప్యూటీ కలెక్టర్ నోటీసులు ఇవ్వాడాన్ని సవాలు చేస్తూ దాఖలైన 4 పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఆ నోటీసులను షోకాజ్ నోటీసులుగా పరిగణించాలని అధికారులను ఆదేశించింది. ఆ ప్లాట్లలోని నిర్మాణాల కూల్చివేతకు ముందు బాధితులకు నోటీసులు జారీ చేయాలని, వారు సమర్పించే ఆధారాలను పరిశీలించి, వివరణ తీసుకున్నాకే అధికారులు ముందడుగు వేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

సీపీగెట్ సీట్ల కేటాయింపు ఆలస్యం!

- ఇటు వర్షాలు.. అటు ఇంకా పూర్తికాని పరీక్షలు
- 4న సీట్ల కేటాయింపు.. కానీ ఆలస్యమయ్యే ఛాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): పీజీ ఫస్టియర్ సీట్ల భర్తీకి నిర్వహించే కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీగెట్) సీట్ల కేటాయింపు ఆలస్యంకానుంది. ఇటు వర్షాలతోపాటు, ఇంకా పీజీ ఫస్టియర్‌లోని విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు పూర్తికాకపోవడంతో ఇప్పట్లో ఫస్టియర్ విద్యార్థులకు సీట్లు కేటాయించలేని పరిస్థితి నెలకొన్నది. సీపీగెట్ మొదటి విడత కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. షెడ్యూల్ ప్రకారం 4న సీట్లను కేటాయించాల్సి ఉంది. అయితే ఇది అనుమానంగానే కనిపిస్తున్నది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఓ నాలుగైదు రోజులు ఆగి సీట్లను కేటాయించాలని అధికారులు భావిస్తున్నారు.

ప్రధాన వర్సిటీల్లో పీజీ ఫస్టియర్ సీట్లు

వర్సిటీ	సీట్లు
ఉస్మానియా	12,682
కాకతీయ	12,675
శాతవాహన	5,345
తెలంగాణ	4,210
మహాత్మాగాంధీ	3,177
పాలమూరు	3,070

278 పీజీ కాలేజీల్లో 44వేలకు పైగా సీట్లుండగా, ఈడబ్ల్యూఎస్ సీట్లను కలుపుకుంటే వీటి సంఖ్య 50వేలకు చేరుతుంది. ఈ ఏడాది 73వేల మంది దరఖాస్తు చేసుకోగా, 61వేల మంది (94,.57శాతం) క్వాలిఫై అయ్యారు. కొంత కాలంగా పీజీ కోర్సుల్లో సీట్లు నిండటం లేదు. ఏటా 45శాతం సీట్లు మాత్రమే నిండుతున్నాయి. ఈ ఏడాది క్లినికల్ న్యూట్రిషన్, న్యూట్రిషన్ వంటి కోర్సుల్లో సీట్లు పెంచుకునేందుకు పలు కాలేజీలు ముందుకొచ్చాయి. దీంతో ఆయా కోర్సుల్లో స్వల్పంగా సీట్లు పెంచుకున్నట్టు అధికారులు తెలిపారు.

పీజీఈసెట్ వెబ్ కౌన్సెలింగ్‌లో మార్పులు

ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల సీట్ల భర్తీకి నిర్వహించే పీజీఈసెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌పై వర్షాల ఎఫెక్ట్ పడింది. రాష్ట్రంలో వర్షాలు, వరదల నేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో విద్యుత్తు, ఇంటర్‌నెట్ సరఫరాలో అంతరాయం తలెత్తిన నేపథ్యంలో మొదటి విడత షెడ్యూల్‌ను అధికారులు సవరించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ గడువు ముగియగా, మంగళవారం వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు. 4,5 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదుకు, 6న సవరణకు అవకాశామిచ్చారు. 9న సీట్లు కేటాయిస్తారు. 10 నుంచి 13 వరకు కాలేజీల్లో రిపోర్ట్‌చేయాల్సి ఉంటుంది. 10 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయి. కొన్ని ఎం ఫార్మసీ సీట్లకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంతవరకు అనుమతివ్వలేదు.

గిరిజన రైతులపై పోలీసుల జులుం



వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లె రంగాయ చెరువు రీడిజైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు. వారిపై కేసులు నమోదు చేసి అరెస్టుకు యత్నించగా గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. ఈ మేరకు గోవిందాపూర్ గ్రామ రైతులు సోమవారం ఎమ్మెల్యే దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేయొద్దని, అవసరమైతే తామంతా పోలీస్‌స్టేషన్‌కు వస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

వైద్య సిబ్బందికి భద్రత పెంచండి

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో పనిచేసే వైద్య సిబ్బందికి భద్రత పెంచాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మహిళా డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బందికి రక్షణగా షీ టీమ్‌లతో రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కాలేజీల్లో భద్రత బలోపేతంపై సుప్రీంకోర్టు నిబంధన మేరకు సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బందిపై దాడుల నియంత్రణకు 2008 చట్టంపై చర్చించారు.

రేపు చలో విద్యుత్తు సౌధ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి, జ్యుడిషియల్ కమిషన్‌చేత విచారణ జరిపించాలని తెలంగాణ విద్యుత్తు బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి బుధవారం చలో విద్యుత్తు సౌధకు పిలుపునిచ్చింది. ఉద్యోగులంతా తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ కుమారస్వామి, కో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ భానుప్రకాశ్ పిలుపునిచ్చారు.

హాస్టల్ వెల్ఫేర్ సమస్యలు పరిష్కరించాలి: టీఎన్జీవో

హైదరాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేనీ డిమాండ్ చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఫోరం సమావేశాన్ని అధ్యక్షుడు ఎండీ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని టీఎన్జీవోభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్కర్లను కేటాయించాలని, గ్రీన్‌చానల్ ద్వారా బడ్జెట్‌ను విడుదల చేయాలని, పర్చేజ్ కమిటీలో హెచ్‌డబ్ల్యూవోలకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎంబీఏలో 33వేలు.. ఎంసీఏలో 6వేల సీట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ తర్వాత అత్యధిక డిమాండ్ ఉండేది ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకే. రాష్ట్రంలో ఈ ఏడాది 264 కాలేజీల్లో 33, 620 ఎంబీఏ, 65 కాలేజీల్లో 6,162 ఎంసీఏ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా వివరాలను సాంకేతిక విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటాలో ఎంబీఏలో 23,989, ఎంసీఏలో 4,583 సీట్లు ఉన్నాయి. వర్సిటీలవారీగా తీసుకుంటే ఓయూలో 117 కాలేజీల్లో 17,615 ఎంబీఏ, 42 కాలేజీల్లో 3,900 ఎంసీఏ సీట్లున్నాయి. జేఎన్టీయూలో 95 కాలేజీలుంటే 10,125 ఎంబీఏ, 9 కాలేజీల్లో 942 ఎంసీఏ సీట్లున్నాయి. కాకతీయలో 26 ఎంబీఏ కాలేజీల్లో 2,820, 9 కాలేజీల్లో 900 ఎంసీఏ సీట్లున్నాయి. సోమవారం వరకు 10,634 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 8వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్‌కు అవకాశముండగా, మంగళవారం నుంచి 9 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు. 4 నుంచి 11 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశముంది.